# సత్యవాణి

(Satyavani Radio Sermons Vol. 1 & 2)

**Joshua Gootam**

Satyavani - Church of Christ
P.O. Box 80
Kakinada, A.P. 533001.

# విషయ సూచిక


1. మోసికొను పోతగు గ్రంథాలయము 1
2. ఆకాశములు దేవుని... వివరించుచున్నవి 9
3. త్రిత్వమైన దేవుడు 15
4. పరిశుద్ధాత్మ దేవుడు 21
5. దేవుని విశదీకరణ 27
6. సమస్తము కలిగిన విధము 33
7. బైబిలును అర్థము చేసికొనుట యెట్లు 39
8. నిబంధనల సంబంధము 45
9. పాపము అనగా నేమి? 52
10. మానవునికి అవసరమయిన విమోచన 59
11. క్రీస్తుద్వారా దేవుని విమోచన మార్గము 65
12. కృపద్వారా విశ్వాసము వలన రక్షణ 72
13. రక్షణ పొందుటకు మానవుడు ఏమి చేయవలెను 78
14. నశించిన దానిని వెదుకుట 84
15. ప్రవచింపబడిన సంఘము 90
16. క్రొత్త నిబంధన సంఘము 96
17. క్రీస్తు సంఘము 102
18. ఆరాధనా మూర్తి 108
19. దైవారాధన 116
20. నాలుగు రకములైన ఆరాధన 122
21. దేవునికి అంగీకారయోగ్యమైన ఆరాధన 128
22. శాశ్వత శాంతి 134

# 1. మోసికొను పోతగు గ్రంథాలయము

## (THE PORTABLE LIBRARY)

ప్రియ మిత్రులారా! ఈ దినమున మనము మోసికొను పోదగు ఒక గ్రంథాలయమును గూర్చి నేర్చుకొన బోవుచున్నాము. మీరు ఎక్కడకు వెళ్ళినను మీ వెంటనే ఒక గ్రంథాలయము మోసికొను పోవుట వీలగునా? అని ఆశ్చర్యపడవచ్చును. విజ్ఞాన పూరితమయిన గ్రంథములతో సమకూర్చబడి నట్టినది గ్రంథాలయము గనుక అది ఎట్లు సాధ్యమగునో యని మీరు తలంచవచ్చును. అయితే బైబిలు అను ఒక పరిశుద్ధ గ్రంథము కలదు. అది దానికదియే ఒక గ్రంథాలయమై యున్నది. అది ఇహలోక సంబంధమైన విజ్ఞానముతో కాక పరలోక సంబంధమైన విజ్ఞానముతో కూడ నిండియున్నది. అయితే అది మోసికొను పోతగు గ్రంథాలయమని యెట్లనబడెనో మనము ఇప్పుడు తెలిసికొందము.

బైబిలు అను పదమునకు 'గ్రంథము' అని యర్థము. అది నిజానికి అరువది ఆరు పుస్తకముల సంపుటియై యున్నది. మీరు బైబిలు అను పదమును తప్పక వినియే యుందురని నేను అనుకొనుచున్నాను. ప్రతి క్రైస్తవుడు దానిని తనదిగా చేసికొని, దాని ప్రకారము నడువనెంచుకొనిన ఒక గ్రంథమిది. అది యించుమించు నాలుగువేల సంవత్సరముల కంటె పాతదైయున్నది. బైబిలుకు సాటియైన గ్రంథమీ ప్రపంచమందు లేదు. ఉండబోదు కూడ! అందున్న అరువది ఆరు పుస్తకములు పాత నిబంధన, క్రొత్త నిబంధనయని రెండు ముఖ్య విభాగములుగా చేయబడినవి. చదువరులకు వీలుగ ప్రతి పుస్తకము అధ్యాయములుగను, అధ్యాయములు వచనములుగను విభాగింపబడినవి. కాలపరీక్ష లన్నిటియందును

దృఢముగ నిలచినట్టి గ్రంధము బైబిలు. దాని తరువాత అనేక గ్రంధములు వచ్చి వెడలిపోయినను బైబిలు మాత్రము అట్లే నిలచి యున్నది. అది ఎన్నడును కాలమునకు భిన్నముగా లేదు.

బైబిలును దాని బోధనలను ఎరిగినవారు, దానియందు బహుగా విశ్వాసముంచెదరు. మరియే గ్రంధము కూడ జబాబు చెప్పలేనట్టి కొన్ని మానవ సమస్యలకు బైబిలు జవాబులిచ్చుచున్నది. మానవుడు విమర్శనాత్మక మైనవాడు. అతడు విచారణ చేయువాడు. అందుకనే 'నేనెవరిని?' 'ఎక్కడ నుండి వచ్చితిని?' 'ఎక్కడకు పోవుచున్నాను?'యను తన ఆలోచనల కతడు ఎల్లప్పుడు జవాబు కనుగొనాలని కాంక్షించుచూ యుంటాడు. ఒకడు ఇట్టి ఆలోచనలను తన జీవితాంతము వరకూ చేసినను జవాబు కనుగొనలేకపోవచ్చును. ఒకడు ప్రకృతిని దాని స్వభావమును పరిశోధింప వచ్చును. అయినను తన ప్రశ్నలకు సరియైన జవాబును మాత్రమతడు ప్రకృతిలో కనుగొనలేడు. అయితే బైబిలు ఒక్కటి మాత్రమే మానవుని జన్మ, ఆది, అంతములను గూర్చి అతనికి చెప్పుచున్నది. అంతేకాదు, దినములు ఎంత చెడ్డవైనను చిరకాలము జీవించకోరిక గలవాడు మానవుడు. చావు అనిన భయపడువాడు మానవుడు. అతని కోరికలు నెరవేరని యెడల, భూప్రాణు లన్నింటికంటె నిరాశ చెందువాడు మానవుడు. అందుకే ఒకడు తన జీవిత కాలమంతయు దేవుని యెడల నమ్మకముగా నున్న యెడల అతడు చనిపోయినను తిరిగి బ్రతుకునని బైబిలు బోధించుచున్నది. మానవుని ప్రతి సమస్యకు బైబిలు నందు జవాబు కలదు.

బైబిలు వంటి దివ్యమైన గ్రంధమును వ్రాయుట మానవునికి నిజముగా సాధ్యము కాదు. అందువలనే బైబిలును సమ్మతించువారు



దానిని దేవుని వాక్యమని నమ్ముదురు. నిజానికి అది దేవుని వాక్యమై యున్నదని బైబిలు తననుగూర్చి చెప్పుకొనుచున్నది. దానిని నలువది మంది మదహారు వందల సం॥ల కాలములో లిఖించినను, దాని లేఖకులు దానికి గ్రంధకర్తలమని ఎన్నడు ఆరోపణ చేసియుండలేదు. నిజానికి వారందరు దేవుని మాటలను వ్రాసినట్లు నుడివిరి. బైబిలును లిఖించిన వారిలో యొకడగు పేతురు ఏమి చెప్పుచున్నాడో ఇప్పుడు విందము. "ఏలయనగా, ప్రవచనము ఎప్పుడును మనుష్యుని యిచ్ఛనుబట్టి కలుగలేదు గాని, మనుష్యులు పరిశుద్ధాత్మ వలన ప్రేరేపింపబడిన వారై దేవుని మూలుముగ పలికిరి" (2 పేతురు 1:21). అందువలననే బైబిలు విశ్వాసి అతను విశ్వాసమువలన అది దేవుని వాక్యమై యున్నదని తను అంగీకరించుచున్నట్లు చెప్పును. ఏలయనగా "విశ్వాసమనునది నిరీక్షింపబడు వాటియొక్క నిజస్వరూపమును, అదృశ్యమైనవి యున్న వనుటకు ఋజువునై యున్నది" (హెబ్రి 11:1).

గనుక ప్రియ మిత్రాలారా! అతని విశ్వాసము గ్రుడ్డిది కాదుగాని, అనేక పునాదులపై ఆధారపడినట్టిదై యున్నది. బైబిలు లేఖకులందరు ఒకే కాలమునందు జీవించినవారు కాదు. వారు వివిధ స్థలములలో, కాలములలో జీవించినవారు. ఒకడు మరియొకడు వ్రాసినదానిని గాని, వ్రాయబోవు దానిని గాని ఎరిగి యుండలేదు. వారిలో కొందరు రాజులు, కొందరు గొర్రెల కాపరులు, కొందరు జాలరులు, ఒకడు వైద్యుడు, మరియొకడు ద్వేషింపబడిన సుంకరి. వారు వివిధ కోణముల ద్వారా అనేక అంశములను గూర్చి వ్రాసిరి. అయినను వారి వ్రాతలను మనము ఏకీభవించిన, వారు ఒకే ఒక ముఖ్యాంశమును గూర్చి వ్రాసినట్లు అనగా

పాపబంధకముల నుండి మానవుని విమోచనను గూర్చి వ్రాసినట్లు తెలిసికొనగలము. అందే విధమైన స్వవిర్ధు సంగతులు లేక బ్రహ్మాండమైన ఏకీభావము కలదు. దీని బోధనలను గూర్చి ఒక వేళ నేటి మానవులు తడబడవచ్చునేమో గాని అది మాత్రము దేవుని వాక్యమే అయియున్నది. బైబిలు లేఖకులు విభిన్న కాలములలో జీవించినను, వారిని నడిపించిన 'ఆత్మ' మాత్రము మార్పు లేనిదై యున్నదనుట నమ్మదగినది. అది దేవుని ఆత్మయే! ఏలయనగా వివిధ కాలములలో జీవించిన నలువది మంది పురుషులు దైవావేశము లేకయే అట్టి బ్రహ్మాండమైన ఏకీభావము గల గ్రంథమును తయారు చేయుట అసాధ్యము.

విజ్ఞానశాస్త్ర ప్రకారము, బైబిలు యథార్థమైనది. చాలా కాలము వరకును భూమి బల్లపరుపుగా నుండెనని ప్రజలు భావించిరి. 15వ శతాబ్దములో కొలంబస్ అనునతడు భూమి గుండ్రముగా నున్నదని చెప్పగా అతడు హేళన చేయబడెను. అటు తరువాత 'మెజెల్లన్' అనునతడు భూమి చుట్టూ పయనించిన తరువాతనే భూమి అంతరిక్షములో వ్రేలాడు ఒక గోళమని జనులు విశ్వసించిరి. అయితే దీనికి కొన్ని వేల సంవత్సరములకు ముందే దేవుడు 'భూమండలము' మీద ఆసీనుడై యున్నాడు" అని ప్రవక్తయైన యెషయా బైబిలునందు వ్రాసెను (యెష 40:22). మహాజలము మీద ఆయన (అనగా దేవుడు) 'మండలమును నిర్ణయించెను' అని రాజైన సాలొమోను బైబిలునందు లిఖించెను (సామె 8:27). భూమి గుండ్రముగ నున్నదని మనుజులు తెలుసుకొనుటకు కొన్ని వేల సం॥లకు ముందే ఈ సంగతులు బైబిలు నందు వ్రాయబడెనని మరచిపోకుడి. అదే విధముగ భూమి దేనిపై ఆధారపడి యున్నది యను అంశము గూర్చి కూడా అనేక



సిద్ధాంతములుద్భవించెను. "అట్లాసు అనునతడు భూమిని తన భుజములపై మోయుచుండెనని కొందరు భావించిరి. మరికొందరు అయిదు ఏనుగులు దానిని మోయుచున్నట్టు తలంచిరి. అయితే "దేవుడు శూన్యము పై భూమిని వ్రేలాడదీసెను" అని బైబిలు చెప్పుచున్నది (యోబు 26:7). నేటి కింకను మానవులు కనుగొనుచున్న వందలకొలది, అట్టి వైజ్ఞానిక సంగతులు ఈ గ్రంథమందిమిడి యున్నవి.

దూరదర్శిని సహాయమువలన ఖగోళ శాస్త్రము నేడు బహుగా అభివృద్ధి చెందినది. ఆకాశ నక్షత్రములు లెక్కింపనగునని ఒకప్పుడు మానవులు తలంచిరి. అయితే ఈ దూరదర్శిని సహాయమువలన ఆకాశ నక్షత్రముల సంఖ్య లెక్కింపతరము కాదని ఋజువైనది. ఇది క్రీస్తుకు పూర్వము 1600 సం॥ల క్రితమే ఆకాశ నక్షత్రములు లెక్కింపనలవి కానివని మోషే బైబిలునందు వ్రాసిన సంగతిని మనకు జ్ఞప్తికి తెచ్చుచున్నది. దీనిని మీరు బైబిలులో ఆదికాండము 15వ అధ్యాయము 5వ వచనములో చదువగలరు. బైబిలు నందలి ప్రవచనముల నెరవేర్పును బట్టి అది దేవుని వాక్యమని విశ్వసింపతగినది. ఆయా రాజ్యములను గూర్చియు, జనాంగములను గూర్చియు, పట్టణములను గూర్చియు వందల కొలది ప్రవచనములందున్నవి. ఈ ప్రవచనములు వాటి నెరవేర్పుకు కొన్ని వందల సంవత్సరములకు ముందే చెప్పబడినను, అవి అక్షరాల నెరవేరెను.

పాత నిబంధన ప్రవచనముల నెరవేర్పే 'యేసుక్రీస్తు'. పాత నిబంధనలోని అనేక మాదిరులు క్రీస్తును సూచించుచున్నవి. ఆయన జననము, జీవనము, మరణము, పునరుత్థానములను గూర్చిన ప్రవచనము లన్నియును ఖచ్చితముగా నెరవేరినవి. నిజానికి యేసుక్రీస్తు బైబిలునకు

ఆదియు అంతమునై యున్నాడు. క్రీస్తును గూర్చిన ఆఖరి ప్రవచనము 450 సం॥ల ముందే వ్రాయబడినందున అది నెరవేరేసరికి 450 సం॥ల కంటే పాతదై యుండెనన్న మాట. వాటిలో కొన్ని 7, 8, 9, 10 వందల సం॥లకు పైగా యున్నపుడు నెరవేరినవి. అందుచే దానిని ప్రవచించిన వ్యక్తి తన ప్రవచన నెరవేర్పును గూర్చి ఇసుమంతయును కూడా తన పలుకుబడిని ఉపయోగించుకొన వీలు లేకున్నది. గనుకనే దేవుడు తన సేవకుల ద్వారా పలికిన సంగతులపై సమస్తాధికారమును ఆయన మాత్రమే కలిగి యుండెననుట బహు నమ్మతగినది. బైబిలు అభివృద్ధి చేయతగని గ్రంథము. మానవుని పను లెన్నడును పరిపూర్ణములు గావు. నేటి తన యంత్రములు రేపటి తరములో మార్చబడుచున్నవి. నిన్నటి శాస్త్రీయ గ్రంథములు, నేటి పరిహాస గ్రంథము లాయెను. అయితే బైబిలునందు సరిదిద్దవలసిన సంగతులు ఏమియును లేవు. నేటి ఆధునిక విజ్ఞానము ప్రబలక కొన్ని వందల సంవత్సరములకు ముందునుండే బైబిలు ఈ లోకముందు కలదు. అది అభివృద్ధి చేయతగని గ్రంథము. గనుక అది తప్పక భగవత్కృషియే అయియుండవలెను. దేవుడు సర్వజ్ఞాని యగుటచే ఆయన విజ్ఞానమును మనము అభివృద్ధి చేయలేము.

బైబిలు సంఘటనలు చారిత్రాత్మకముగాను, భౌగోళికముగాను కూడా యధార్థమైనవని మీరు గుర్తించుకొనుడి. బైబిలు యాథార్థతను గూర్చి మనము అనేక సంగతులను చెప్పుకొనవచ్చును. మోసికొనపోతగు గ్రంథాలయమైన మీ బైబిలులో అగాధమైన విజ్ఞానము ఎంతయో కలదు. మానవునికరి నైతిక ఆత్మీయ శక్తి సామర్థ్యములను ఒసగునది బైబిలు. మానవుడు జ్ఞానవంతుడు. అది అతనికి నీతి మార్గమును గరపించు



చున్నది. అపోస్తలుడైన పౌలు ద్వారా, బైబిలు తనను గూర్చి ఏమి చెప్పుకొనుచున్నదో వినుడి. "దైవజనుడు సన్నద్ధుడై, ప్రతి సత్కార్యమునకు పూర్ణముగ సిద్ధపడి యుండునట్లు, దైవావేశమువలన కలిగిన ప్రతి లేఖనము ఉపదేశించుటకును, ఖండించుటకును, తప్పుదిద్దుటకును, నీతియందు శిక్ష చేయుటకును ప్రయోజనకరమై యున్నది" (2 తిమోతి 3:16-17). మానవుడు రోగములను, బాధలను అనుభవించువాడు. అది తనకొక గొప్ప వైద్యుని గూర్చి బోధించుచున్నది. మానవుడు పాపాత్ముడు. అది అతనికి దయార్ద్రకరుడైన రక్షకుని గూర్చి బోధించుచున్నది. మానవుడు భక్తిపూరితుడు. అది అతనికి నిజమైన దేవుని నారాధించు విధానమును గరుపుచున్నది. దేవుడు ఆత్మగనుక ఆయన నారాధించువారు ఆత్మతోను, సత్యముతోను ఆరాధించవలెను.

అంతేకాదు, అన్ని కాలములలో నుండు మానవులందరికి ఉపయోగపడు సమాచారము బైబిలునందున్నది. మీరు నిరుత్సాహపడిన యెడల అది మీకు ధైర్యము నిచ్చును. బలహీనులైన వారికి అది బలమునిచ్చును. దుఃఖపడువారిని అది ఓదార్చును. నిరాశ చెందినవారికి అది నిరీక్షణ నొసగును. మరణించినవారికది సమాధి యనంతరము నిత్యజీవనమును క్రీస్తుద్వారా నొసగును. అందువలననే భూమి మీద నుండు ప్రతి మానవునికి బైబిలు అవసరమైయున్నది. అది వర్తమాన భూత భవిష్యత్కాలములలో మానవునికి దారిజూపు దివ్యజ్యోతియై యున్నది. మీరు దానిని విశ్వసించి లోబడిన యెడల ఇహలోకము నుండి పరలోకమునకు తీసికొనిపోవు మార్గమిది. దేవుడు ఎల్లప్పుడు మంచివాడు. ఆయన చిత్తానుసారముగ నుండిన ప్రతి మానవుని అవసరమును ఆయన

తీర్చును. దేవుని కుమారుడైన యేసుక్రీస్తు ఆయన మాటలే ఆత్మయు జీవమునై యున్నవని చెప్పెను. బైబిలు మానవునికి దేవుని గూర్చియు, క్రీస్తును గూర్చియును, పరిశుద్ధాత్మను గూర్చియు బోధించుచున్నది.

బైబిలునందలి ఆశ్చర్యకరమైన సంగతులను గూర్చి మనమెంతయో చెప్పుకొనవచ్చును. అది మానవునికి బయలుపరచబడిన దేవుని చిత్తము. గనుక మిత్రులారా! మీరు విజ్ఞానులగుటకు దానిని పఠించుడి. పాప విమోచన నొందుటకు దానిని నమ్మి లోబడుడి, దాని పఠనము నిజానికి లాభదాయకమైన ఆనందమును, సహాయకరమైన హెచ్చరికయునై యున్నది. మోసికొనుపోతగు గ్రంథాలయమైన మీ బైబిలు యథార్థమని అది నమ్మతగినదని మరచిపోవద్దు సుమీ!



## 2. ఆకాశములు దేవుని... వివరించుచున్నవి

### (THE HEAVENS DECLARE GOD)

గత పాఠములో బైబిలు ఒక మోసికొనుపోతగు గ్రంథాలయమని తెలిసికొంటిమి. ఆ పరిశుద్ధ గ్రంథము దేవుని ఉనికిని గూర్చి నిత్యము బోధించుచున్నది. ఒక వ్యక్తిగత దేవుని ఉనికియే క్రైస్తవ్యమున కంతయు మూలాధారము. ఈ పునాదిపై క్రైస్తవ్యమంతయు ఆధారపడియున్నది. దీని నుండి దేవుని తొలగించిన క్రైస్తవ్యమంతయు కూలిపోవును. అనేకులు 'దేవుడు ఉన్నాడా' యని ప్రశ్నలు వేస్తుయుంటారు. బైబిలు గ్రంథమయితే ఒక గొప్ప నిజదేవుడున్నాడని బోధించుచున్నది. ఆయన అన్ని చోట్ల యున్నవాడు గనుక సర్వాంతర్యామి. ఆ దేవుడు సమస్తమును ఎరిగినవాడు గనుక సర్వజ్ఞాని. ఆ దేవునికి ఏదియును అసాధ్యము కాదు గనుక ఆయన సర్వశక్తిమంతుడు. బ్రహ్మాండమైన ఈ విశ్వమంతటిని చేసినవాడు దేవుడని, దానిని కొనసాగించువాడు దేవుడని బైబిలు బోధించుచున్నది. "ఆకాశములు దేవుని మహిమను వివరించుచున్నవి. అంతరిక్షము ఆయన చేతి పనిని ప్రచురపరచుచున్నది" అని బైబిలు బోధించుచున్నది. అయితే దేవుడు లేడని బుద్ధిహీనులు తమ హృదయములో అనుకొందురు అని కూడా అది బోధించుచున్నది (కీర్త 19:1; 14:1).

సర్వజ్ఞాని, సర్వశక్తిమంతుడునై లోకమంతటిని సృష్టించి పిచ్చుక పాటును సహితము కనిపెట్టుచున్న యట్టి దేవుని ఉనికిని గూర్చి మనకు సంతృప్తికరమైన ఆధారములు కలవా? అవి ఉన్నవో లేవో ఈ రోజు మనం గమనించుదాం. ఈ విశ్వమంతటిలోను దేవునిగూర్చి మనకు దొరుకు ఋజువులను పొందుపరుచుదాం.

భూమియు, దాని చుట్టునున్న గ్రహములును ఒక బ్రహ్మాండమైన వాస్తుశాస్త్రపు విద్యయైయున్నది. బ్రహ్మాండమైన ఈ విశ్వములో భూమి ఒక చిన్న భాగమైనందున ఈ విశ్వము మానవజ్ఞానమునకు మించినదై యున్నది. అంతరిక్షమును ఏలుచు తన రథములో పయనించు పగటి రాజును గమనించుము. తన తెల్లబారిన కాంతిలో రేజీకటిని ధైర్యముతో పారద్రోలుచు ఆకాశ విశాలములో నెగురు రేరాణిని నొకమారు చూడుము. రాత్రివేళ విలువైన ముత్యములతో పొదగబడినట్లగుపడు ఆ యంతరిక్షము నొకసారి పరిశీలించుము. ప్రకృతి నేత్రములతో ఒకడు 6 వేల నక్షత్రములనే చూడగలుగునని అంచనా వేయబడెను. మిక్కిలి శక్తివంతమైన దూరదర్శిని సహాయముతో ఇంచుమించు 60 లక్షల నక్షత్రములను చూడవచ్చునని కూడా అంచనా వేయబడెను. అయితే దూరదర్శిని వలన కనుగొనబడలేని కోటాను కోట్ల నక్షత్రములింకను యున్నవి.

భూమికిని, మిగిలిన గ్రహములకును మానవజ్ఞానము ఊహించ లేనంత దూరము కలదు. చంద్రుడు భూమికి ఇంచుమించు 3 లక్షల మైళ్ళ దూరములో యున్నాడు. భూమికిని, సూర్యునికిని గల మధ్య దూరాన్ని బట్టి చూస్తే ఇది బహు తక్కువ. సూర్యుడు భూమికి 9 కోట్ల మైళ్ళ దూరములో యున్నాడు. అంతేకాదు భూమికి అతి సమీపములోనున్న నక్షత్ర సమూహము 200 కోట్ల మైళ్ళ దూరములోనున్నది. వెలుగు సెకనుకు 186 వేల మైళ్ళు ప్రయాణించునని ఎరిగిన తరువాత ఖగోళ దర్శకులు దూరమును కొలుచుటకు 'కాంతి సంవత్సరమును' ప్రవేశపెట్టిరి. సెకనుకు 186 వేల మైళ్ళ చొప్పున వెలుగు ఒక సంవత్సరములో ప్రయాణించు దూరమును 'కాంతి సంవత్సరము' తెలియజేయును. కొన్ని నక్షత్రములు భూమి నుండి 32 కాంతి సంవత్సరముల దూరములో కలవు. మరికొన్ని



అంతకుమించిన దూరములో కూడా కలవు. ఈ విశ్వమంతయును ఒక గంభీరమయిన వాస్తు శాస్త్రపు విద్యయని మనము అంగీకరింపక తప్పదు. అయితే ఈ వాస్తు శాస్త్రవేత్త యెవరు? అనే ప్రశ్న మనలో తప్పక ఉద్భవించును. ఈ వాస్తు శాస్త్రవేత్త దేవుడే యని బైబిలు బోధించుచున్నది.

విశ్వమంతటిలోను చక్కటి క్రమము గలదు. ఆధునిక శాస్త్రజ్ఞులు చంద్రమండలము పైకి మానవుని పంపించిన తరువాత, ఆయా గ్రహముల పైకి రాకెట్లను (Space craft) పంపించి, మానవునికి నివాసయోగ్యముగా భూమి ఒక్కటి మాత్రమే యున్నదని తెలుసుకొనిరి. బుధుడు (Mercury) అను గ్రహము భూమికంటె 7 రెట్లు ఎక్కువ సూర్యరశ్మిని పొందుచున్నది. అంటే వేసవిలో ఆ గ్రహమంతయును 700 డిగ్రీల కంటే ఎక్కువ ఉష్ణోగ్రతతో అగ్ని గుండమువలె యుండి మనుష్యులుగాని, జంతువులుగాని జీవించడానికి యోగ్యముకాని స్థితిలో నుండునన్న మాట! వరుణుడు (Uranus) అను వేరొక గ్రహము మన సూర్యకుటుంబములో కలదు. అది సూర్యుని నుండి భూమికంటె వంద రెట్లు దూరముగనున్నది. అందువలన ఇది బహు శీతలమయినది. ఈ గ్రహమందలి ఉష్ణోగ్రత సున్నకంటె 2–3 వందల డిగ్రీలు తక్కువగుటచే ఏ జీవరాశియు అక్కడ జీవించుట అసాధ్యము. మానవ నివాస యోగ్యమగు భూమి తప్ప సూర్యకుటుంబములోని గ్రహములన్నింటికిని ఈ వాదము వర్తించును.

భూగ్రహమందు కూడా చాల ఆశ్చర్యకరమయిన క్రమమును మనము చూడగలము. భూమి చుట్టుకొలత ఇంచుమించు 25 వేల మైళ్ళున్నది. అనగా భూవ్యాసము 8 వేల మైళ్ళు. అయితే భూవ్యాసము 8 వేల మైళ్ళు కాక 9 వేల మైళ్లున్న యెడల భూమ్యాంతర ఉష్ణోగ్రత

బహు ఎక్కువై అది మానవ నివాస యోగ్యము కాని గ్రహమువలె యుండును. భూవ్యాసము 7 వేల మైళ్ళు మాత్రమే అయితే భూమ్యాంతర ఉష్ణోగ్రత బహు తక్కువై అది జీవన యోగ్యము కానిదగును. ఒక ఆకస్మిక సంఘటన ఇంత విశేష క్రమమునకు కర్తయగుట అసాధ్యము. అయితే ఇంత గంభీర క్రమమును విశ్వమంతటిలోను ఏర్పరచిన జ్ఞాని యెవడు? ఆ జ్ఞాని దేవుడే యని బైబిలు బోధించుచున్నది.

భూమితో సహా మిగిలిన అంతరిక్ష గోళములు ఒకదానికొకటి అతి ఖచ్చితముగా తమ క్రమ ప్రకారము చలించుట మరింత ఆశ్చర్యకరమైన సంగతి. సూర్యుడు నిద్రపోవుట నీవు ఎన్నడైననూ గమనించితివా? లేదు. దినదినము, సంవత్సర సంవత్సరము భూమి తన ఇరుసుపై 24 గంటల కాలములో తన చుట్టూ తాను తిరుగుచు ప్రమాదములు ఏమియు లేకుండగనే మనకు రేయింబవళ్ళ నిచ్చుచున్నది. ఖగోళ దర్శకులు గ్రహచలనములను గమనించి ప్రతి సంవత్సరం ఫలాని దినమున ఇన్ని గంటల ఇన్ని నిమిషములకు సూర్యగ్రహణము లేక చంద్ర గ్రహణము జరుగగలదని ముందుగానే చెప్పగల్గునంత ఖచ్చితముగా ఈ గ్రహములు చలించుచున్నవి. ఇంత ఆశ్చర్యకరమైన అతి ఖచ్చిత గణిత క్రమము నెరిగిన ఈ గణిత శాస్త్రజ్ఞుడు ఎవరు? ఈ గణితజ్ఞుడు దేవుడు అని బైబిలు బోధించుచున్నది.

భూమియు, భూవాతావరణమును రసాయనిక మూలకములతో నిండియున్నవి. ఈ మూలకములన్నిటిని మిశ్రమము చేసిన వాడంటూ ఒకడుండెనని అవే చెప్పగలవు. విజ్ఞాన శాస్త్రపు మిశ్రమము ఎక్కడ ఉండునో అక్కడ దానికి కర్తయైన జ్ఞాని తప్పక యుండును. ఉదాహరణకు



మనము నీటిని గమనించుదాం. నీరు ఎట్లు తయారైనది? అది రెండుపాళ్ళు హైడ్రోజన్‌తోను, ఒక పాలు ఆక్సిజన్‌తోను తయారైనది. Chemistry విద్యార్థిని ఎవరిని అడిగినా $H_2O$ అను గుర్తు నీటిని లేదా అందున్న రసాయనిక మూలకముల మిశ్రమమును తెలియజేయుచున్నదని ఇట్టే చెప్పగలరు. హైడ్రోజన్ వాయువు మిక్కిలి సులభముగ మండెడు గుణము గలదు. అగ్ని తయారు చేయుటకు ఆక్సిజన్ వాయువు తప్పక యుండవలెను. అయినను ఈ రెండు రసాయనములను ఇంతకు ముందు చెప్పిన నిష్పత్తిలో కలిపిన యెడల మనకత్యవసరమైన నీరు లభించును. భూ వాతావరణములో అనేక వేలకొలది ఇట్టి క్రమబద్ధమైన రసాయనక మిశ్రమము లున్నవి. అవన్నియును వాటంతటవే కలిగినవని వివేకులు ఎవరు చెప్పలేరు. అయితే ఈ రసాయనిక శాస్త్రవేత్త యెవరు? ఆయన దేవుడు అని బైబిలు బోధించుచున్నది.

ప్రకృతి పుటలలోని మహనీయ కళలను వర్ణించుట మనకు అసాధ్యము. మనము సుందర సూర్యాస్తమయమును చూచితిమి. పశ్చిమ క్షితిజములోనికి సూర్యుడు మెల్లమెల్లగా దిగుచు, ఆకాశమునంతటినీ తన చిత్రవిచిత్ర రంగులతో నింపుచూ ప్రఖ్యాత కవుల నుండి, సామాన్య మానవుని వరకు అందరినీ ఉత్తేజపరచుట మీరు గమనించే యుంటారు. రకరకాల గులాబీలు, చేమంతులు, సన్నజాజులలో ఒక పరిపూర్ణ మహనీయ చిత్రకారుని యొక్క కృషిని గమనించి వర్ణించుటకు నిజానికి మనకు సమయము చాలదు.

నిజానికి భూమిపై మనము జీవించుచున్నాము అంటే మనకు ప్రాణము పోసిన ప్రాణదాత యెవరు? అని అడుగక తప్పదు. ఈనాడు

మానవుడు విజ్ఞానమును బట్టి అనేక సంగతులను సాధించియున్నాడు. అయితే ప్రాణమును మాత్రము అతడు తయారు చేయలేడు. చనిపోయిన జీవిని తిరిగి అతడు బ్రతికించలేడు. భూమిపై వివిధ స్థాయిలలో జీవరాసు లుండుటచే ఈ జీవనదాత యెవరు? అని మనమడుగక తప్పదు. ఆయన దేవుడు అని బైబిలు బోధించుచున్నది.

ఈ గంభీర విశ్వమందున్న ఋజువులలో మనమొక సృష్టికర్తను, గణితజ్ఞుని, విజ్ఞాన శాస్త్రవేత్తను, ప్రసిద్ధ కళాకారుని, ప్రాణదాతను చూడగలుగుచున్నాము. ప్రపంచమందున్న సమస్తాశ్చర్యములకు వెనుకనున్న గంభీర వ్యక్తియే దేవుడు. దీనికింక తిరుగులేదు. ఆకాశములు దేవుని మహిమను వివరించుచున్నవి. అంతరిక్షము ఆయన చేతిపనిని ప్రచురపరచుచున్నది యని దావీదు మహారాజు సత్యమునే పలికెను. అందువలననే బైబిలులోని మొదటి వచనమే “ఆది యందు దేవుడు భూమ్యాకాశమును సృజించెను” యని చెప్పుచున్నది. సమస్తమునకు కర్తయైన ఆ నిజదేవుని మనము తెలుసుకొను నిమిత్తము యేసుక్రీస్తు ఈ లోకమునకు వచ్చెను. ఆ దేవుని చెంతకు మనము చేరవలెననిన మనము యేసుక్రీస్తు నందు విశ్వాసముంచి, మన పాపముల విషయమై మారు మనస్సునొంది, ఆయన నామమును ఒప్పుకొని పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము నొందవలెను. అట్లు చేసి నిజదేవుని నెరిగి ముక్తినొందుట సాధ్యమగును.



# 3. త్రిత్వమైన దేవుడు
## (THE TRIUNE GOD)

క్రైస్తవ్యమున కంతకును కొన్ని ముఖ్యాధారములు కలవు. అవి దేవుడొక్కడే, ఆయన నిత్యుడు, మూర్తిత్వము గలవాడు, త్రియేకుడు. దేవుడు త్రియేకుడనుటలో యేసుక్రీస్తు యొక్క దైవత్వము తప్పక ఇమిడియున్నది. త్రియేకుడైన దేవునియందు విశ్వాసము కలిగి యుండుట మానవజాతికి బహుప్రాధాన్యమయినది. అది క్రైస్తవ్యమునకు మరింత ప్రాముఖ్య మయినది. ఏలయనగా విశ్వాసము లేకుండా దేవునికి ఇష్టుడై యుండుట అసాధ్యము. దేవుని యొద్దకు వచ్చువాడు ఆయన యున్నాడనియు, తన్ను వెదకువారికి ఫలము దయచేయు వాడనియు నమ్మవలెను అని బైబిలు బోధించుచున్నది (హెబ్రీ 11:6). త్రిత్వము అను పదము నిజానికి బైబిలు నందు కన్పడుట లేదు. క్రైస్తవ్యము (Christianity) అను పదము కూడా బైబిలునందు లేదు. అయితే త్రియేకుడైన దేవుడు, త్రిత్వము అను భావము మాత్రము అతి విపులముగ బైబిలు నందు కన్పడుచున్నది. అది మనము ఆరాధించు సజీవముగల దేవుని యొక్క ప్రత్యేకతను తెలుపుచున్నది.

త్రిత్వము అనగా యేమిటి? అని మీరడగవచ్చును. దీనినర్థము చేసుకొనడానికి మనము కొన్ని సత్యములను జ్ఞాపక ముంచుకొనవలెను. బైబిలు తండ్రియైన దేవుని గూర్చి కుమారుడైన దేవునిగూర్చి, పరిశుద్ధాత్ముడైన దేవునిగూర్చి చెప్పుచున్నది. అయనను ఉన్న దేవుడు ఒక్కడే. దీనిని బట్టి ఒకే దేవునిలో ముగ్గురు దేవుండ్లు ఉన్నారని యర్థముకాదు కాని వారు దేవునియందున్న మూడు నిత్య ప్రత్యేకతలను సూచించుచున్నారు. కాలమును బట్టి మనం ఒక ఉదాహరణను చూడవచ్చును. కాలము ఒక్కటే అయినను

అది వర్తమాన, భూత భవిష్యత్కాలమని మూడు విధములుగ మనము గమనించవచ్చును గదా. త్రిత్వమందున్న ముగ్గురు వ్యక్తులు దేవుడు అని లేఖనములయందు చెప్పబడియున్నది.

తండ్రియైన దేవుని గూర్చి వాక్యము ఏమి చెప్పుచున్నదో ఇప్పుడు చూద్దాం. "క్షయమైన ఆహారము కొరకు కష్టపడకుడి, గాని నిత్యజీవము కలుగజేయు అక్షయమయిన ఆహారము కొరకే కష్టపడుడి, మనుష్య కుమారుడు దానిని మీకిచ్చును. ఇందుకై తండ్రియైన దేవుడు ఆయనకు ముద్రవేసి యున్నాడని యేసు చెప్పెను" (యోహాను 6:27). కుమారుడైన దేవుని గూర్చి లేఖనములు ఇట్లు చెప్పుచున్నవి. "ఆది యందు వాక్యముండెను" (యోహాను 1:1). ఆ వాక్యము శరీరధారయై కృపాసత్య సంపూర్ణుడుగా మన మధ్య నివసించెను. తండ్రి వలన కలిగిన అద్వితీయ కుమారుని మహిమవలె మనము ఆయన మహిమను కనుగొంటిమి (యోహాను 1:14). యేసుక్రీస్తు మృతులలో నుండి తిరిగి లేచిన తరువాత తోమా అను శిష్యుడు యేసును చూచి నా ప్రభువా, నా దేవా అనెను.

పరిశుద్ధాత్ముడైన దేవుని గూర్చి కూడ లేఖనములు చెప్పుచున్నవి. అననీయ, సప్పీరాలను దంపతులు దేవునికి కొంత ధనమును ఇచ్చుటకు నిశ్చయించుకొని, దానిలో కొంత దాచుకొనగా, "పరిశుద్ధాత్మను మోస పుచ్చుటకు సాతాను ఎందుకు నీ హృదయమును ప్రేరేపించెను? అది నీ యొద్దనున్నపుడు నీదేకదా? నీవు మనుష్యులతో కాదు, దేవునితోనే అబద్ధమాడితివని" పేతురు అననీయతో చెప్పెను (అపో.కా. 5:3-4). తండ్రికిని, కుమారునికిగల ప్రత్యేకత మనకు బైబిలునందు గోచరమవు చున్నది. యేసు ఒకసారి ఇట్లు చెప్పెను. "నేను దేవుని కుమారుడనని



చెప్పినందుకు, తండ్రి ప్రతిష్ఠచేసి యీ లోకములోనికి పంపినవానితో నీవు దేవదూషణ చేయుచున్నావని చెప్పుదువా?" (యోహాను 10:36). మరల తండ్రి కుమార, పరిశుద్ధాత్మలకు గల ప్రత్యేకత యోహాను 15:26లో ఈలాగున కన్పడుచున్నది. "తండ్రి యొద్దనుండి మీ యొద్దకు నేను పంపబోవు ఆదరణకర్త అనగా తండ్రియొద్ద నుండి బయలుదేరు సత్య స్వరూపియైన ఆత్మ వచ్చినప్పుడు ఆయన నన్ను గూర్చి సాక్ష్యమిచ్చును".

మనము ఇప్పటివరకు గమనించిన వాక్యములను బట్టి త్రిత్వమందున్న దేవుడు ఏకాకి కాదుగాని, ఆయన ముగ్గురు మూర్తులై యున్నవాడు, ఆయన ముగ్గురైయున్న దైవత్రైకుడు. త్రియేకులైన ముగ్గురు వ్యక్తులు సమానులు. కుమారుడైన యేసుక్రీస్తు దేవుడు అని వాక్యము బోధించుచున్నది. ఆయన ఆదియందు వాక్యమై యుండెను. ఆ వాక్యము దేవుని యొద్ద యుండెను. ఆ వాక్యమే దేవుడైయుండెను. మనము మహా దేవుడును మన రక్షకుడైన యేసు క్రీస్తు మహిమయొక్క ప్రత్యక్షత కొరకు ఎదురుచూచు చుండవలెను అని తీతు 2:13లో వ్రాయబడియున్నది. ఇంకా యెషయా 7:14 మత్తయి 1:23, యెషయా 9:6లను మీరు దయచేసి చూడండి.

పాత నిబంధనలో యున్న యెహోవా దేవుడే యేసుక్రీస్తు అని లేఖనములు పోల్చిచెప్పుచున్నవి. నిర్గమకాండము 3:14 ఇప్పుడు చదువుకొందము. "అందుకు దేవుడు నేను ఉన్నవాడను అనువాడనై యున్నానని మోషేతో చెప్పెను. మరియు ఆయన - ఉందుననువాడు మీ యొద్దకు నన్ను పంపెనని నీవు ఇశ్రాయేలీయులతో చెప్పవలెననెను". ఇప్పుడు క్రొత్త నిబంధనలో మనము చూచిన, యేసు అబ్రాహాము పుట్టక

మునుపే నేను ఉన్నానని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను" (యోహాను 8:58).

యెషయా 48:11లో చూచిన, దేవుడు ఇట్లు పలుకుచున్నాడు. "యాకోబూ నేను పిలచిన ఇశ్రాయేలూ, నాకు చెవియొగ్గి వినుము. నేనే ఆయనను. నేను మొదటివాడను, కడపటివాడను". అయితే ప్రకటన గ్రంథము 1:18లో భక్తుడైన యోహాను ఇట్లు చెప్పుచున్నాడు. "ఆయన తన కుడి చేతిని నా మీద ఉంచి నాతో ఇట్లనెను – భయపడకుము నేను మొదటివాడను, కడపటివాడను, జీవించువాడను. మృతుడనైతినిగాని ఇదిగో యుగయుగములు సజీవుడనైయున్నాను". మరియు, "ఆలకించుడి. అడవిలో ఒకడు ప్రకటించుచున్నాడు. ఎట్లనగా–అరణ్యములో యెహోవాకు మార్గము స్థిరపరచుడి. ఎడారిలో మా దేవుని రాజమార్గము సరాళము చేయుడి" అని యెషయా 40:3లో ప్రకటింపబడితే, బాప్తిస్మమిచ్చు యోహాను రాగా "ప్రభువు మార్గము సిద్ధపరచుడి, ఆయన త్రోవలు సరాళము చేయుడని అరణ్యములో కేకవేయు యొకని శబ్దము అని ప్రవక్తయైన యెషయా ద్వారా చెప్పబడినవా డితడే" అని క్రొత్త నిబంధన బోధించుచున్నది (మత్తయి 3:3).

యోహాను యేసుక్రీస్తుకు మార్గమును సరాళము చేయుటకు వచ్చెను. అందువలన యెహోవాకు మార్గము సిద్ధపరచెను. అందువలన పాతనిబంధనలో యెహోవాయని పిలువబడిన దేవుడే క్రొత్త నిబంధనలో యేసుక్రీస్తు అయిన దేవుడు. నేను ఆయనననని మీరు విశ్వసించనియెడల మీరు మీ పాపములలోనే యుండి చనిపోవుదురని యేసు అందుకే చెప్పెను (యోహాను 8:24). కుమారుడైన యేసుక్రీస్తు ఆదినుండియు దేవుడే.



ఆయన దైవనామఃక్కరణము చేయబడిన వాడని, యెహోవా దేవుడని ఇంతవరకూ మనం చూశాం. అయితే యేసుక్రీస్తు నందు దేవుని లక్షణము లన్నియును ఉన్నట్లు మనము చూడగలము. యేసు నందు జీవమున్నది. ఆయనలో జీవముండెను. ఆ జీవము మనుష్యులకు వెలుగై యుండెను (యోహాను 1:4). యేసు "నేనే మార్గమును, సత్యమును, జీవమును, నాద్వారానే తప్ప యెవడును తండ్రి యొద్దకు రాడు" అని చెప్పెను (యోహాను 14:6). యేసు తనంతట తానే జీవముగలవాడు. "తండ్రి యేలాగు తనంతట తానే జీవముగలవాడై యున్నాడో, అలాగే కుమారుడును, తనంతట తానే జీవముగలవాడై యుండుటకు కుమారునికి అధికారము అనుగ్రహించెను" అని యేసు చెప్పెను (యోహాను 5:26). మీకా గ్రంథము 5వ అధ్యాయయు 2వ వచనమును కూడా దయచేసి మీ బైబిలునందు చదవండి.

యేసుక్రీస్తు మార్పు చెందనివాడు. "యేసుక్రీస్తు నిన్న, నేడు ఒక్కటే రీతిగ ఉండును" అని హెబ్రీ 13:8లో వ్రాయబడి యున్నది. యేసుక్రీస్తు సత్యమై యున్నాడు. యోహాను 14:6లో నేనే మార్గమును, సత్యమును, జీవమునై యున్నానని ఆయన చెప్పెను. యేసుక్రీస్తు ప్రేమయై యున్నాడు. "ఆయన మన నిమిత్తము తన ప్రాణము పెట్టెను. గనుక దీనివలన ప్రేమ యెట్టిదని మనము తెలిసికొనుచున్నాము" (1 యోహాను 3:16). యేసుక్రీస్తు పరిశుద్ధుడు. గబ్రియేలను దేవదూత కన్యయైన మరియుకు ప్రత్యక్షమై ఆమెతో "పరిశుద్ధాత్మ నీ మీదికి వచ్చును, సర్వోన్నతుని శక్తి నిన్ను కమ్ముకొనును. గనుక పుట్టబోవు శిశువు పరిశుద్ధుడై, దేవుని కుమారుడనబడును" అని యేసును గూర్చి చెప్పెను (లూకా 1:35). యేసుక్రీస్తు సర్వాంతర్యామియై యున్నాడు. ఇదిగో నేను యుగసమాప్తి వరకు, సదాకాలము మీతో కూడా ఉన్నానని ఆయన చెప్పుచున్నాడు

(మత్తయి 28:20). యేసుక్రీస్తు సర్వజ్ఞానియై యున్నాడు. “యేసు అందరిని ఎరిగినవాడు గనుక ఆయన తన్ను వారి వశము చేసికొనలేదు. ఆయన మనుష్యుని ఆంతర్యమును ఎరిగినవాడు గనుక ఎవడును మనుష్యుని గూర్చి ఆయనకు సాక్షమియ్యనక్కర లేదు” (యోహాను 2:24-25). యేసుక్రీస్తు సర్వశక్తిమంతుడు, పరలోకమందును, భూమి మీదను నాకు సర్వాధికారము ఇయ్యబడి యున్నదని ఆయన చెప్పెను (మత్తయి 28:18).

యేసు ప్రభువు గనుక ఆయనను మనము ఆరాధించి సేవించవలెను. ఆయన దేవుడు గనుక, “పరలోకమందున్న వారిలోగాని, భూమిమీద ఉన్నవారిలోగాని, ప్రతివాని మోకాలును యేసు నామమున వంగునట్లును, ప్రతివాని నాలుకయు తండ్రియైన దేవుని మహిమార్థమై యేసుక్రీస్తు ప్రభువని ఒప్పుకొనునట్లును, దేవుడు ఆయనను అధికముగా హెచ్చించి, ప్రతినామమునకు పై నామమును ఆయనకు అనుగ్రహించెను” (ఫిలిప్పీ 2:9-11).

గనుక నా మిత్రులారా, మరి ఎవనివలనను మనకు రక్షణ కలుగదు. ఈ నామముననే అనగా యేసు నామముననే మనము రక్షణ పొందవలెనుగాని, ఆకాశము క్రింద ఇయ్యబడిన మరి ఏ నామమున మనము రక్షణ పొందలేము. మనము యేసు నామమున రక్షణ పొందవలెనంటే, యేసు దేవుడని, దేవుని కుమారుడని విశ్వసించవలెను. ఇట్లు నమ్మిన ప్రతివాడును మారు మనస్సు పొంది, యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందవలెను. అప్పుడు దేవుని కుమారుడైన యేసు రక్తము మనలను ప్రతి పాపము నుండి పవిత్రులునుగా చేయును.



# 4. పరిశుద్ధాత్మ దేవుడు

## (GOD THE HOLY SPIRIT)

ఇంతకు ముందు చెప్పబడిన రేడియో పాఠములలో మనము త్రిత్వమైన దేవునిగూర్చి తెలిసికొన్నాం. తండ్రియైన దేవుడు, కుమారుడైన దేవుడు, పరిశుద్ధాత్ముడైన దేవుడు – ఈ ముగ్గురూ కలసి ఏకమై ఒకే దేవుడై యున్నారని మనం నేర్చుకొన్నాం. వీరు ముగ్గురు మూడు దేవుళ్లు కాదు గాని ఒకే దేవుడై యున్నారని మనం ఇదివరకే నేర్చుకొన్నాం. మరియు, కుమారుడైన యేసుక్రీస్తు దేవుడెట్లై యున్నాడో కూడా మనం గ్రహించాం. దైవలక్షణము లన్నిటిని ఆయన ఎట్లు కలిగియున్నాడో మనం తెలిసికొంటిమి.

ఈరోజు మనం త్రియేక దేవునిలో మూడవ వ్యక్తిని గూర్చి, అంటే పరిశుద్ధాత్ముడైన దేవుని గూర్చి కొంత తెలిసికొనడానికి మనకీయబడిన ఈ కొద్ది ఘడియలను ఉపయోగించుదాం. పరిశుద్ధాత్ముడు మూర్తిత్వము గల దేవుడు. ఆయనను గూర్చి యేసు ప్రభువు ఈలాగు చెప్పెను: “తండ్రి యొద్ద నుండి బయలుదేరు సత్యస్వరూపియైన ఆత్మవచ్చి నప్పుడు ఆయన నన్ను గూర్చి సాక్ష్యమిచ్చును” (యోహాను 15:26). “అయితే ఆయన, అనగా సత్యస్వరూపియైన ఆత్మ వచ్చినప్పుడు మిమ్మును సర్వసత్యములోనికి నడిపించును. ఆయన తనంతట తానే యేమియు బోధింపక వేటిని వినునో వాటిని బోధించి, సంభవింపబోవు సంగతులను మీకు తెలియ జేయును” (యోహాను 16:13). పరిశుద్ధాత్ముని క్రియల ద్వారా మనం ఆయన వ్యక్తిత్వాన్ని, లేదా మూర్తిత్వాన్ని తెలిసికొనగలం. ఆయన మాటలాడును, కొర్నేలియను వానియింట సువార్తను చెప్పుటకు ముందు

పేతురు ఒక "దర్శనమును చూచి యోచించుచుండగా ఆత్మ – ఇదిగో ముగ్గురు మనుష్యులు నిన్ను వెదకుచున్నారు. నీవు లేచి క్రిందకు దిగి, సందేహింపక వారితో కూడ వెళ్లుము. నేను వారిని పంపియున్నాను" అని అతనితో చెప్పెను (అపో.కా. 10:19). పరిశుద్ధాత్ముడు సాక్ష్యమిచ్చును: "సత్యస్వరూపి అయిన ఆత్మ వచ్చినప్పుడు ఆయన నన్ను గూర్చి సాక్ష్యమిచ్చును" అని యేసు చెప్పెను.

పరిశుద్ధాత్ముడు బోధించును : "ఆదరణకర్త అనగా తండ్రి నా నామమున పంపబోవు పరిశుద్ధాత్మ సమస్తమును మీకు బోధించి నేను మీతో చెప్పిన సంగతులన్నిటిని మీకు జ్ఞాపకము చేయును" అని యేసు చెప్పెను (యోహాను 14:26).

పరిశుద్ధాత్ముడైన దేవుడు పరిశోధించును : "మనకైతే దేవుడు వాటిని తన ఆత్మవలన బయలుపరచి యున్నాడు. ఆ ఆత్మ అన్నిటిని, దేవుని మర్మములను కూడా పరిశోధించుచున్నాడు" అని అపోస్తలుడయిన పౌలు చెప్పెను (1 కొరింధి 3:10).

పరిశుద్ధాత్ముడు వరములనిచ్చును. మరియు సహోదరులారా ఆత్మ సంబంధమైన వరములను గూర్చి మీకు తెలియకుండుట నాకిష్టము లేదు... కృపావరములు నానా విధములుగా యున్నవిగాని ఆత్మ ఒక్కడే... ఆ ఆత్మ ఒక్కడే తన చిత్తము చొప్పున ప్రతివానికి ఈ వరములను పంచియిచ్చును. కార్యసిద్ధి కలుగజేయును అని అపోస్తలుడయిన పౌలు 1 కొరింధి 12వ అధ్యాములో తెలియజేయుచున్నాడు. మీకు సమయముండిన యెడల ఎఫెసి 4:7–13 వరకును, హెబ్రీ 2:4ను కూడా చదవండి.



పరిశుద్ధాత్ముడు నరులతో వాదించును : "యెహోవా – నా ఆత్మ నరులతో ఎల్లప్పుడును వాదించదు. వారు తమ అక్రమ విషయములో నరమాత్రులై యున్నారు" అని చెప్పెను (ఆది 6:3).

పరిశుద్ధాత్ముడు ఆదిలో సృష్టిని జరిగించెను. సృష్టి జరుగకముందు భూమి నిరాకారముగాను, శూన్యముగాను ఉండెను. చీకటి అగాధజలము పైన కమ్మియుండెను. దేవుని ఆత్మజలముల పైన అల్లాడుచుండెను (ఆది 1:2).

పరిశుద్ధాత్ముడు మన పక్షముగా విజ్ఞాపనము చేయును. అటువలే ఆత్మయు మన బలహీనతను చూచి సహాయము చేయుచున్నాడు. ఏలయనగా మనము యుక్తముగా ఏలాగు ప్రార్ధన చేయవలెనో మనకు తెలియదుగాని, ఉచ్చరింప శక్యముగాని మూలుగులతో ఆ ఆత్మ తానే మన పక్షముగా విజ్ఞాపనము చేయుచున్నాడు" అని పౌలు రోమా 8:26లో వ్రాసెను.

పరిశుద్ధాత్ముడు మృతులను లేపును : "మృతులలో నుండి యేసును లేపినవాని ఆత్మ మీలో నివసించిన యెడల, మృతులలో నుండి క్రీస్తు యేసును లేపినవాడు చావుకులోనైన మీ శరీరములను కూడా మీతో నివసించుచున్న తన ఆత్మ ద్వారా జీవింపజేయును" అని రోమా 8:11లో వ్రాయబడియున్నది.

పరిశుద్ధాత్ముడు దేవుడైయున్నాడు : "మీరు దేవుని ఆలయమై యున్నారనియు, దేవుని ఆత్మ మీలో నివసించుచున్నాడనియు మీరెరుగరా?" (1 కొరింధి 3:16). "మీ దేహము దేవునివలన మీకు అనుగ్రహింపబడి మీలో నున్న పరిశుద్ధాత్మకు ఆలయమై యున్నదని

మీరెరుగరా? మీరు మీ సొత్తుకాదు, విలువపెట్టి కొనబడినవారు గనుక మీ దేహముతో దేవుని మహిమపరచుడి" (1 కొరింధి 6:19).

పరిశుద్ధాత్ముడు యెహోవా దేవునితో సరిసమానముగా పోల్చబడుట మనము లేఖనములయందు చూడగలము. "ఈ విషయమై పరిశుద్ధాత్మ కూడ మనకు సాక్ష్యమిచ్చుచున్నాడు. ఏలయనగా – ఆ దినములైన తరువాత నేను వారితో చేయబోవు నిబంధన యిదే – నా ధర్మవిధులను వారి హృదయము నందుంచి వారి మనస్సు మీద వాటిని వ్రాయుదును అని చెప్పిన తరువాత – వారి పాపములను, వారి అతిక్రమములను ఇంకను ఎన్నటికిని జ్ఞాపకము చేసికొనను అని ప్రభువు చెప్పుచున్నాడు" అని హెబ్రీ 10:15–17 వరకు వ్రాయబడెను. ఇంచుమించు ఈ మాటలనే యెహోవా పలికినట్లు మనం యిర్మియా గ్రంధము 31:31 నుండి 34 వరకు చదువగలము.

పరిశుద్ధాత్ముడు జీవముగల దేవుడు. యేసుక్రీస్తు నందు జీవమునిచ్చు ఆత్మయొక్క నియమము అని పౌలు పలుకుచున్నాడు (రోమా 8:2).

పరిశుద్ధాత్ముడు సత్యమై యున్నాడు – సత్యస్వరూపియైన ఆత్మ మిమ్మును సర్వసత్యములోనికి నడిపించునని యేసు చెప్పెను (యోహాను 16:13). ఆయన ప్రేమ అయియున్నాడు (రోమా 15:30).

పరిశుద్ధాత్ముడు సర్వాంతర్యామి. "నీ ఆత్మ యొద్ద నుండి నేనెక్కడికి పోవుదును? నీ సన్నిధి నుండి నేనెక్కడికి పారిపోవుదును? నేను ఆకాశమున కెక్కినను నీవు అక్కడను ఉన్నావు. నేను పాతాళమందు పండుకొనినను నీవు అక్కడను ఉన్నావు. నేను వేకువ రెక్కలు కట్టుకొని సముద్ర దిగంతములలో నివసించినను నీ కుడిచేయి నన్ను పట్టుకొనును"



అని దావీదు మహారాజు ఆయనను వర్ణించెను (కీర్త 139:7–10).

పరిశుద్ధాత్ముడు సర్వజ్ఞాని (1 కొరింధి 3:10–11). ఆయన సర్వశక్తిమంతుడు (ఆది 1:2). ఆయన పరిశుద్ధుడు. ఆయన పరిశుద్ధాత్మ అయియున్నాడు. ఆయన నిత్యుడు (హెబ్రీ 9:14).

ఇట్లు దేవుని లక్షణములనన్నిటిని మనము పరిశుద్ధాత్మునిలో చూడగలము. పరిశుద్ధాత్ముడు తండ్రియైన దేవునితోను కుమారుడైన దేవునితోను సమానుడు. అందుచేతనే యేసుక్రీస్తు పునరుద్ధానుడైన తరువాత, "మీరు వెళ్లి సమస్త జనులను శిష్యులనుగా చేయుడి. తండ్రి యొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమిచ్చుచు. నేను మీకు ఏయే సంగతులను ఆజ్ఞాపించితినో వాటినన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి" యని తన శిష్యుల నాజ్ఞాపించెను (మత్తయి 28:19, 20).

నేటి ఈ అంశమును ముగించకముందు మీకు మరల జ్ఞాపకము చేయగోరుచున్నాను. దేవుడు త్రిత్వమయినవాడు. తండ్రి, కుమార, పరిశుద్ధాత్మయను ముగ్గురు వ్యక్తులు దేవుని యందు ఏకమైయున్నారు. వారు ముగ్గురు మూడు దేవుండ్లు కాదుగాని, వారు ముగ్గురు ఏకమై ఒకే దేవుడై యున్నారు. అందువల్లన ఆయన పూజ్యనీయుడు, పరిశుద్ధుడయిన దేవుడు. త్రియేకుడు, పరిశుద్ధాత్ముడు వచ్చి పాపమును గూర్చియు, నీతిని గూర్చియు, తీర్పును గూర్చియు లోకమును ఒకప్పుకొనజేయును అని యేసుక్రీస్తు చెప్పెను (యోహాను 16:8). పెంతెకోస్తు అను పండుగ దినమున పరిశుద్ధాత్ముడు అపోస్తలు లందరిపైనను దిగెను. ఆత్మావేశము కలిగినవాడై అపోస్తలుడైన పేతురు ఆనాడు యోరుషలేములో కూడియున్న

వేలకొలది యూదులకు యేసుక్రీస్తు యెడల వారు చేసిన అపరాధమును కనుబరచెను. మీరు సిలువ వేసిన యీ యేసునే దేవుడు, ప్రభువుగాను, క్రీస్తుగాను నియమించెను. ఈ సంగతి ఇశ్రాయేలు వంశమంతయు రూఢిగా తెలిసికొనవలెనని చెప్పెను. వారు ఈ మాట విని, హృదయములో నొచ్చుకొని సహోదరులారా, మేమేమి చేతుమని పేతురును, కడమ అపోస్తలులను అడుగగా - పేతురు, "మీరు మారు మనస్సుపొంది, పాప క్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసు క్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి. అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు'' అని చెప్పెను. కాబట్టి అతని వాక్యము అంగీకరించినవారు బాప్తిస్మము పొందిరి. ఆ దినమందు ఇంచుమించు మూడువేల మంది చేర్చబడిరి (అపో.కా. 2:36-38, 42).

గనుక మిత్రులారా, పాపవిమోచన కొరకు క్రీస్తునందు విశ్వాసముంచి, ఆయన నామమున మీరును బాప్తిస్మము పొందుడి. అప్పుడు మన ప్రభువైన యేసుక్రీస్తు కృపయు, దేవుని ప్రేమయు, పరిశుద్ధాత్మ సహవాసమును మీకందరికిని తోడై యుండునుగాక! (2 కొరింధి 13:14).



# 5. దేవుని విశదీకరణ

## (GOD'S REVELATION)

దేవుని చెంతకు చేరుటకు మానవుడు శతాబ్దముల తరబడి ఆయనను వెదుకుచూ యున్నాడు. ఈ లోకములో యున్న వివిధ మతములన్నీ దేవుని కొరకై మానవులు చేయు అన్వేషణను తెలియజేయు చున్నవి. వారు దేవునిని దేవుని నీతిని వెదుకుచునేయున్నారు. ఆ యన్వేషణలో మానవులు రకరకాల వేదాంతములను పాటించుటచే అనేక మతములు మనమధ్య ఈ రోజున ఉన్నవి. అయితే ఈ మతములన్నిటి లోను, రెండు మాత్రము అనగా యూదా మతము, క్రైస్తవ మతము దేవునిచే బయల్పరచబడినవి. అనేక వందల సంవత్సరములపాటు మానవుడు తన జ్ఞానముతో దేవుని వెదుకనిచ్చెను, ఇప్పుడైతే ఆయన పరిపూర్ణమైనట్టియు, సంపూర్ణమైనట్టియు విధముగా తన్ను తాను బయలు పరచుకొనెను (1 కొరింధి 1:18-31).

దేవుడు ముందుగా ప్రకృతి ద్వారా తన్ను తాను బయలుపరచుకొనెను. ''ఆకాశములు దేవుని మహిమను వివరించుచున్నవి. అంతరిక్షము ఆయన చేతిపనిని ప్రచుర పరచుచున్నది. పగటికి పగలు బోధ చేయుచున్నది. రాత్రికి రాత్రి జ్ఞానము తెలుపుచున్నది. వాటికి భాష లేదు, మాటలు లేవు. వాటి స్వరము వినబడదు" యని దావీదు మహారాజు పలికెను (కీర్తన 19:1-3). "దేవుని యొక్క అదృశ్య లక్షణములు, అనగా ఆయన నిత్య శక్తియు, దేవత్వమును, జగదుత్పత్తి మొదలుకొని సృష్టింపబడిన వస్తువులను ఆలోచించుట వలన తేటపడుచున్నవి" యని పౌలు చెప్పుచున్నాడు (రోమా 1:20).

దేవుడు మానవలు మనస్సాక్షి ద్వారా కూడా తన్ను తాను బయలుపరచుకొనెను. “దేవునికి పక్షపాతము లేదు. ధర్మశాస్త్రము లేక పాపము చేసినవారందరు ధర్మ శాస్త్రము లేకయే నశించెదరు. ధర్మ శాస్త్రము కలిగినవారై పాపము చేసినవారందరు ధర్మశాస్త్రానుసారముగా తీర్పు నొందుదురు. ధర్మ శాస్త్రమును వినువారు దేవుని దృష్టికి నీతిమంతులు కారుగాని ధర్మశాస్త్రమును అనుసరించి ప్రవర్తించువారే నీతిమంతులుగా ఎంచబడుదురు. ధర్మ శాస్త్రము లేని అన్యజనులు స్వాభావికముగా ధర్మ శాస్త్ర సంబంధమైన క్రియలను చేసిన యెడల వారు ధర్మ శాస్త్రము లేనివారైనను తమకు తామే ధర్మ శాస్త్రమైనట్టున్నారు. అట్టివారి మనస్సాక్షి కూడా సాక్ష్యమిచ్చు చుండగను, వారి తలంపులు ఒకదాని మీద ఒకటి తప్పు మోపుచు లేక తప్పు లేదని చెప్పుచుండగను, ధర్మశాస్త్ర సారము తమ హృదయముల యందు వ్రాయబడినట్టు చూపుచున్నారు” అని పౌలు రోమా 2:12-15లో వ్రాసెను. అపోస్తులుల కార్యములు 17వ అధ్యాయము 22 నుండి 31 వరకు చదివిన యెడల, ఏథెన్సు ప్రజల యొక్క ఇట్టి పరిస్థితిని మనం గ్రహించుకొనగలము.

మానవునికి ఉన్న మంచి చెడ్డల విచక్షణ జ్ఞానమే నైతిక జీవమును సూచించుచున్నది. ఇట్టి కట్టుబాటులను వానికి ముందు ఎవరు నేర్పించెను? మానవుడు సహజముగా భక్తితత్వము గలవాడు. తన సృష్టికర్తను పూజించవలెననెడి బాధ్యత అతనిలో సహజముగ యున్నదే. ఈ సహజ లక్షణమును కొందరు విగ్రహముల వైపు మరల్చుచున్నారు. అది విచారకరమైన సంగతి, మానవుడు చేయబడిన విధానాన్ని బట్టి చూస్తే అతడు దేవునికి బాధ్యుడు. ఆయనకు లెక్క అప్పగించవలసినవాడు. అయితే కొందరు ఈ బాధ్యతను వదిలించుకొనుటకు దేవుడు లేడు అని



వాదించుచూ యుంటారు. “దేవుడు లేడు అని బుద్ధిహీనులు తమ హృదయములో అనుకొందురు” అని కీర్తనలు 14:1 చెప్పుచున్నది. దేవుని నెరిగియుండియు ఆయనను దేవునిగా మహిమ పరచలేనివారి యెడల దేవుడు చూపించు ఉగ్రత న్యాయమైనది.

మానవుడు అజ్ఞానిగా యుండకుండు నిమిత్తము దేవుడే తన్ను తాను అసాధారణముగా తన గ్రంధమందు బయలుపరచుకొనెను. బైబిలు గ్రంధము దేవుని వాక్యమై యున్నదని తన్ను తాను చెప్పుకొనుచున్నది. “దైవజనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడియుండునట్లు దైవావేశము వలన కలిగిన ప్రతి లేఖనము, ఉపదేశించుటకును, ఖండించుటకును, తప్పు దిద్దుటకును, నీతియందు శిక్ష చేయుటకును ప్రయోజనకరమై యున్నది” (2 తిమో 3:16, 17).

బైబిలు, దేవునియొక్క ఆఖరి బయలుపాటు అని కూడ తన్ను తాను చెప్పుకొనుచున్నది. అందు మనకు జీవమునకును భక్తికిని కావలసిన వాటినన్నిటిని ఆయన దయచేసియున్నాడు. పూర్వకాలమందు నానా సమయములలోను, నానా విధములుగాను ప్రవక్తలద్వారా మన పితరులతో మాటలాడిన దేవుడు ఈ దినముల అంతమందు కుమారుని ద్వారా మనతో మాటలాడెను (హెబ్రీ 1:1, 2). బైబిలు పరిశుద్ధాత్మావేశముచే వ్రాయబడినది. అందు మానవునికి తెలియని విషయములు బయలుపరచ బడినవి. ఈ సంగతులను బయలుపరచుటలో దేవుని ఆత్మ అద్భుతరీతిగా వ్రాయుచున్న వారిని లేదా వాక్యమును బోధించుచున్న వారిని నడిపించెను. అందువలన ఈ అంతిమ బయలుపాటు నిర్దోషమైనది. అది సంపూర్ణ మైనది. పరిపూర్ణమైనది – అనగా పొరబాట్లు లేని, అది సత్యమైనది!!

బైబిలు యదార్ధమని, అది దేవుని వాక్యమని మనం ఇదివరకే గమనించి యుంటిమి గదా. కాలపరీక్షల నన్నిటిని జయించి నిలిచింది బైబిలు గ్రంధము. దానిని 40 మంది 1600 సం॥ల కాలములో వ్రాసినను గొప్ప ఐక్యత అందులోయన్నది. అందున్న ప్రవచనములు నెరవేర్చుటను బట్టియే అది దేవుని వాక్కు అని మనం అంగీకరించక తప్పదు. అందులో వ్రాయబడిన చారిత్రాత్మక, భౌగోళిక, అంతరిక్ష సంగతులన్నియును సత్యములు అని ఋజువైనవి. బైబిలును నాశనము చేయవలెనని మానవులు ఎన్ని ప్రయత్నములు చేసినను ముందెన్నడూ లేనంతగా పెక్కు సంఖ్యలలో అది ఈనాడు ఉన్నది. అందుకే “ఆకాశమును, భూమియు గతించునుగాని నా మాటలు ఏమాత్రమును గతింపవు” అని యేసు చెప్పెను (మత్తయి 24:35).

‘మన బైబిలు’ అని ప్రతివారు బైబిలును గూర్చి చెప్పుకొనుచున్నారు. అది మానవునికి మరియే గ్రంధము చేయలేనట్టి మేలులను చేసినది. బైబిలు పయనించిన ప్రదేశములయందు విద్యాసంస్థలు, అనాథ, వృద్ధ శరణాలయములు, వైద్యశాలలు నిర్మించబడుట చూడగలము. ఈ పరిస్థితిని బైబిలు పయనించని ప్రదేశములతో పోల్చిచూడండి. అనేక కోట్లకొలది ప్రాణులనది బాగుపరచినది – పురుషులను మంచి భర్తలగను, తండ్రులుగను, స్త్రీలను మంచి భార్యలుగను, తల్లులుగను తయారు చేసింది. దాని ప్రభావము వ్యాపారమందేమి, కుటుంబ మందేమి, కృషి యందేమి, ఆటలయందేమి ఎక్కడ ఉన్నను అక్కడ మానవులను సత్పురుషులుగను, స్త్రీలగను తయారుచేసినది. ఏ గ్రంధము అనుగ్రహింపనట్టి ఆదరణ నిరీక్షణలను ఈ గ్రంధము మరణ ఘడియలందిచ్చు చున్నది. అది దేవుడు మానవుని సౌహార్ధ్రమున కొసగిన మహా విలువగల యీవి. మానవజాతి



పై ఇంత గంభీరమైన ప్రభావముగల గ్రంధము దేవుని గ్రంధము. అందున్నది దేవుని వాక్యము. బైబిలును మనం విడిచిపెట్టిన యెడల మనం మానవుల జ్ఞానమును, వేదాంతమును, అభిప్రాయములను వెంబడింపవలసి వచ్చును. అయితే నేటి ప్రపంచము అనేక మానవకల్పిత వేదాంతములతోను, దేవుండ్లతోను నిండియున్నది. నేటి వేదాంతులు దేవుని నెరిగియు ఆయనను దేవునిగా మహిమపరచలేదు. కృతజ్ఞతాస్తుతులు చెల్లింపను లేదు. గాని తమ వాదములయందు వ్యర్ధులైరి. అయితే ఈ మానవకల్పిత మతములలో ఏది సరియైనది? మనకెట్లు తెలియును?

యుగముల తరబడి దేవుని జ్ఞానమునకును, మానవ జ్ఞానమున కును గొప్ప పోరాటము జరుగుచూ యున్నది. నోవహు కాలములోని ప్రజలు నోవహు ఓడను నిర్మించుచుండగా అతనితో వ్యాజ్యమాడిరి. ఆనాటి ప్రజలందరు వారి స్వజ్ఞానముపై ఆధారపడి యుండగా, నోవహు దేవుని జ్ఞానముపై ఆధారపడెను. చివరిగా జల ప్రళయమను పరీక్ష రాగా ఈ లోకజ్ఞానము వ్యర్ధమాయెను. బైబిలు ఇట్లు చెప్పుచున్నది : “జ్ఞాని యేమయ్యెను? శాస్త్రి యేమయ్యెను? ఈ లోక తర్కవాది యేమయ్యెను? ఈ లోక జ్ఞానమును దేవుడు వెర్రితనముగా చేసియున్నాడు గదా? దేవుని జ్ఞానానుసారముగా లోకము తన జ్ఞానము చేత దేవుని ఎరుగకుండినందున, సువార్త ప్రకటనయను వెర్రితనము చేత నమ్మువారిని రక్షించుట దేవుని దయాపూర్వక సంకల్పమాయెను. యూదులు సూచక క్రియల నడుగుచున్నారు. గ్రీసు దేశస్తులు జ్ఞానము వెదుకుచున్నారు. అయితే మేము సిలువ వేయబడిన క్రీస్తును ప్రకటించుచున్నాము. ఆయన యూదులకు ఆటంకముగాను, అన్యజనులకు వెర్రితనముగాను ఉన్నాడు. గాని యూదులకేమి, గ్రీసు దేశస్తులకేమి, పిలువబడినవారికే క్రీస్తు దేవుని

శక్తియును, దేవుని జ్ఞానమునైయున్నాడు. దేవుని వెర్రితనము మనుష్య జ్ఞానము కంటె జ్ఞానము గలది. దేవుని బలహీనత మనుష్యుల బలముకంటే బలమైనది" (1 కొరింథి 1:20-25).

పాపులైన మానవుల యెడల దేవుడు తన చిత్తమును యేసుక్రీస్తు ద్వారా బయలపరచియున్నాడు. ఆయన సువార్త నమ్ము ప్రతివానిని రక్షించుటకు దేవుని శక్తియైయున్నది. అందువలననే యేసు - "మీరు సర్వలోమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి. నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును. నమ్మనివానికి శిక్ష విధింపబడును" అని చెప్పియున్నాడు (మార్కు 16:15-16). మీరు రక్షణ పొందవలెనంటే యేసునందు విశ్వాసముంచుడి. మీ పాపముల నిమిత్తమై మారుమనస్సు నొంది, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుడి. మీరట్లు చేసిన యెడల ఆయన నమ్మదగినవాడు గనుక ఆయన మీ పాపములన్నిటిని కడిగివేసి మిమ్మును తన సంఘముతో తప్పక చేర్చుకొనును.



# 6. సమస్తము కలిగిన విధము

## (HOW ALL THINGS BEGAN)

మనము తరచూ కొన్ని ప్రశ్నలను ఎదుర్కొనుచు యుంటాము. సమస్తమూ ఎట్లు కలిగినవి? ఈ భూమి, సూర్యుడు, చంద్రుడు, నక్షత్రములు, చెట్లు, చేమలు, జంతువులు, మనుష్యులు ఎట్లు కలిగినవి? అని మనం తరచు ఆలోచిస్తూ యుంటాము. మత సంబంధమైన అనేక గ్రంథములు ఈ లోకములోయున్నా, బైబిలు ఒక్కటి మాత్రమే ఈ ప్రశ్నలకు జవాబు ఇచ్చుచున్నది. బైబిలులోని మొదటి వచనమే సూక్ష్మంగా అన్నిటికి జవాబిచ్చు చున్నది. "ఆదియందు దేవుడు భూమ్యాకాశములను సృజించెను" అని అది చెప్పుచున్నది. "ప్రపంచములు దేవుని వాక్యము వలన నిర్మాణమైనవనియు, అందునుబట్టి దృశ్యమైనది కనబడెడు పదార్ధములచే నిర్మింపబడలేదనియు" బైబిలు బోధించుచున్నది (హెబ్రీ 11:3). సమస్తమూ ఎట్లు కలిగెనో యని మానవులు సహజంగా తలంచు ఈ ప్రశ్నలకు శాస్త్రజ్ఞులు సమస్తమును అల్ప జీవరాసులు జన్మదశ నుండి ఉత్కృష్టదశకు మారుట వలన లేక పరిణామము చెందుటవలన కలిగెనని జవాబిచ్చుచున్నారు. వారి పరిణామ సిద్ధాంతము ఇంకను సిద్ధాంతము వలెనే యుండినందున బైబిలు బోధించు సృష్టిక్రమమును మనము తెలిసికొనుట మంచిది. బైబిలు ఇట్లు చెప్పుచున్నది:

"ఆదియందు దేవుడు భూమ్యాకాశములను సృజించెను". భూమిని దేవుడు చేసిన తరువాత అది నిరాకారముగను, శూన్యముగాను ఉండెను. చీకటి అగాధ జలముపైన కమ్మియుండెను. దేవుని ఆత్మ జలములపైన అల్లాడుచుండెను". ఈ విధముగా ఉన్న భూమిపై దేవుడు మానవుని చేయనుద్దేశించెను. గనుక భూమిని ఆయన మానవ నివాసయోగ్యముగ తయారు చేయుటకు పూనుకొనెను.

మానవునికి వెలుగు అత్యంత అవుసరమని తలంచి దేవుడు చీకటిగాయున్న భూమిపై 'వెలుగు కమ్మని పలుకగా వెలుగు కలిగెను'. వెలుగు మానవునికి మంచిదైనట్టు దేవుడు చూచెను. దేవుడు వెలుగును చీకటిని వేరుపరచెను. వెలుగునకు పగలనియు, చీకటికి రాత్రియనియు దేవుడు పేరు పెట్టెను. దేవుడు వెలుగును మొదటి దినమున చేసెను. మన జీవితంలో వెలుగు ఎంత ప్రాముఖ్యమో మీకు నేను వేరే చెప్పనవుసరం లేదు.

దేవుడు వెలుగైయున్నాడు. ఆయనలో చీకటి ఏ మాత్రము లేదు. ఆయన వెలుగులోనున్న ప్రకారము మనమును వెలుగులో నడచినయెడల (అంటే పాపపు చీకటి నుండి దూరముగ ఉండిన యెడల) మనము ఆయనతో సహవాసము గలవారమై యుండగలము.

రెండవ దినమున దేవుడు భూమిచుట్టూ యున్న వాతావరణమును మానవ నివాసయోగ్యముగా చేసెను. "దేవుడు జలముల మధ్య నొక విశాలము కలిగి ఆ జలములను, ఈ జలములను వేరుపరచునుగాక" అని పలికెను.

దేవుడు ఆ విశాలము చేసి, విశాలము క్రింద జలములను విశాలము మీది జలములను వేరుపరుపగా ఆ ప్రకారమాయెను. దేవుడు ఆ విశాలమునకు ఆకాశమని పేరు పెట్టెను.

మూడవ దినమున దేవుడు భూమిపై ఆరిన నేలను చేసెను. ఆరిన నేలకు భూమి అనియు జలరాశికి సముద్రములనియు పేరు పెట్టెను. మరల దేవుడు గడ్డిని, విత్తనములిచ్చు చెట్లను భూమి మీద తమతమ జాతి ప్రకారము తమలో విత్తనములుగల ఫలమిచ్చు ఫలవృక్షములను భూమి మొలిపించును గాక అని పలుకగా ఆ ప్రకారమాయెను. ఇదంతయు మానవునికై మంచిదని దేవుడు చూచెను.



నాలుగవ దినములన దేవుడు రెండు గొప్ప జ్యోతులను అనగా పగటిని ఏలుటకు పెద్ద జ్యోతిని అంటే సూర్యుని, రాత్రిని ఏలుటకు చిన్న జ్యోతిని అంటే చంద్రుని, నక్షత్రములను చేసెను. సూచనలను, కాలములను, దిన, సంవత్సరములను సూచించుటకై దేవుడు వాటిని చేసెను. దేవుడు ఆకాశ విశాలమందు వాటిని ఉంచెను. అది మంచిదని దేవుడు చూచెను.

అయిదవ దినమున దేవుడు జీవముకలిగి చలించు జలచరములన్నిటిని, ఆకాశ విశాలములో ఎగురు ప్రతిజాతి పక్షులను తన మాట చెప్పి సృజించెను. వాటివాటి జాతి ప్రకారము అవి అభివృద్ధి చెందగల్గునట్లు దేవుడు వాటిని సృజించెను.

6వ దినమున దేవుడు వాటివాటి జాతి ప్రకారము జీవముగల వాటిని, అనగా వాటివాటి జాతి ప్రకారము పశువులను, పురుగులను, అడవి జంతువులను భూమి పుట్టించుగాక అని పలికెను. ఆ ప్రకారమాయెను. అది మానవునికి మంచిదని దేవుడు చూచెను.

ఇంతవరకు మానవునికి అవసరమయిన ప్రతి సంగతిని దేవుడు క్రమబద్ధముగా సృజించినట్లు మనం తెలిసికొన్నాము. ఒక విశేషమేమంటే ఇప్పటివరకు ఆయన చేసినవన్నిటిని, తన మాట చెప్పి – కలుగుగాక అనగా కలుగునట్లు దేవుడు చేసెను. అయితే ఆయన మానవుని ఇంకనూ చేయలేదు. ఎవనికొరకైతే దేవుడు భూమినంతటిని సిద్ధపరచి యుంచెనో ఆ మానవుని చేయుటకు ముందు దేవుడు "మన స్వరూపమందు మన పోలిక చొప్పున నరులను చేయుదము" అని తనలోతాను తలంచుకొని, దేవుడు తన స్వరూపమందు నరుని సృజించెను.

దేవుడైన యెహోవా నేలమంటితో నరుని నిర్మించి వాని నాసికా రంధ్రములలో జీవవాయువును ఊదగా నరుడు జీవించు ఆత్మ ఆయెను. అతనికి ఆదాము అని పేరు పెట్టబడెను. మరియు దేవుడైన యెహోవా– నరుడు ఒంటరిగా నుండుట మంచిదికాదు, వానికి సాటియైన సహాయమును వాని కొరకు  చేయుదుననుకొనెను. అప్పుడు యెహోవా ఆదాముకు గాఢనిద్ర కలుగజేసి అతడు నిద్రించుచున్నప్పుడు అతని ప్రక్కటెముకలలో ఒకదానిని తీసి ఆ చోటును మాంసముతో పూడ్చివేసెను.

తరువాత తాను ఆదాము నుండి తీసిన ప్రక్కటెముకను స్త్రీగా నిర్మించి ఆమెను ఆదామునొద్దకు తీసికొని వచ్చెను. అప్పుడు ఆదాము, ఈయె నా యెముకలలో ఒక యెముక, నా మాంసములో మాంసము, నరునిలో నుండి తీయబడెను గనుక నారి అనబడును అనెను. అట్లు మొదటి పురుషుడు, మొదటి స్త్రీ చేయబడిరి. దేవుడైన యెహోవా తూర్పున ఏదెనులో ఒక తోట వేసి తాను నిర్మించిన నరుని దానిలో ఉంచెను. ఆయన నరుని తీసికొని ఏదెను తోటను సేద్యపరచుటకును దానిని కాయుటకును దానిలో ఉంచెను.

మరియు ఆయన "ఈ తోటలోనున్న ప్రతి ఫలములను నీవు నిరభ్యంతరముగా తినవచ్చును. అయితే మంచి చెడ్డల తెలివినిచ్చు వృక్ష ఫలములను తినకూడదు. నీవు వాటిని తిను దినమున నిశ్చయముగా చచ్చెదని" నరుని కాజ్ఞాపించెను.

అయితే సాతానుడు సర్పరూపమున వచ్చి "మీరు చావనే చావరు. మీరు వాటిని తిను దినమున మీ కన్నులు తెరువబడుననియు, మంచి చెడ్డలు ఎరిగినవారై దేవతలవలె ఉందురనియు" వారికి చెప్పి మోసగించెను. అప్పుడు ఆ స్త్రీ పురుషులు నిషేధింపబడిన ఫలములను తినినవారై పాపములో బడిరి.



ఇట్లు భూమిపై పాపము ఉద్భవించినది. ఇంతవరకు మనం అనేక సంగతులను గమనించాం. దేవుడు సృజించిన ప్రతిదానిని పరిపూర్ణముగా సృజించెను. ఆయన వాక్కక్తిని వినియోగించి సమస్తమును అద్భుతరీతిగ ముందు చేసెను. తరువాత వాటివాటి జాతి ప్రకారము అభివృద్ధి చెందగల్గునట్లు వాటివాటి విత్తనములను వాటియందుంచి ఆయన వాటిని చేసెను. ఇంకొక మాటలో దేవుడు ప్రకృతి సూత్రమును నెలకొల్పెనని మనం గ్రహించవలెను.

దేవుడు చేసిన సృష్టియంతటిలోను మానవుడు ప్రత్యేకమైనవాడని మనం గ్రహించవలెను. మానవుడు శారీరకముగా మిగిలిన జీవరాశు లవలె కన్పడుచున్నను, అతడు దేవునిచే ప్రత్యేకముగా సృష్టింపబడిన వ్యక్తి. భూమి మీద చలించు ప్రతిజీవిని ఏలుటకును, భూమిని నిండించి దానిని లోబరచుకొనుటకును దేవుడు మానవుని చేసెను. జంతువుల వలె గాక మానవుడు నిత్యము జీవించు ఆత్మ కలిగినవాడై సృష్టింపబడెను.

మానవుడు దేవుని స్వరూపమందు, దేవుని పోలిక చొప్పున చేయబడెను. మానవుడు స్వేచ్ఛను (free will) కలిగియుండునట్లు దేవుడు అతనిని చేసెను. మంచి చెడ్డల విచక్షణ జ్ఞానము అతడు కలిగి యున్నాడు. అందువలన దేవుని లక్షణములైన ప్రేమ, పరిశుద్ధత, విధేయత, విశ్వాసము, కరుణ మొదలగు గుణములను మానవుడు అలవరచుకొన శక్తి కలిగినవాడు, లేదా దైవవిరుద్ధమైన ద్వేషము, అసూయ, కలహము, క్రోధము, మత్సరము, స్వార్థపరత్వము మొదలగు గుణములను అలవరచుకొన శక్తిగలవాడు. మానవుని గతిని (destiny) దేవుడు మానవుని కొరకు నిర్ణయించడు. అది మనుష్యుని ఇష్టాయిష్టములకు వదిలివేయబడినది. అందువలన మనుష్యుడు దేవుని యిష్టపూర్వకముగా ఆరాధించవలెనని ఆయన కోరుచున్నాడు.

దేవునితో ఆత్మీయ సహవాసము కలిగియుండగల శక్తితో మానవుని దేవుడు సృజించెను. అయితే "దేవుడు మన యెడల తన ప్రేమను వెల్లడిపరచుచున్నాడు. ఎట్లనగా మనమింకను పాపులమై యుండగానే క్రీస్తు మనకొరకు చనిపోయెను. కాబట్టి ఆయన రక్తము వలన ఇప్పుడు నీతిమంతులముగా తీర్చబడి, మరింత నిశ్చయుగా ఆయన ద్వారా ఉగ్రత నుండి రక్షింపబడుదుము. ఏలయనగా శత్రువులమై యుండగా, ఆయన కుమారుని మరణముద్వారా మనము దేవునితో సమాధానపరచబడిన వారమై ఆయన జీవించుట చేత మరి నిశ్చయముగా రక్షింపబడుదుము" (రోమా 5:8-10).

అన్నిటికంటె ప్రాముఖ్యముగా, దేవుని ఆరాధించుట కొరకును, ఆయనను మహిమ పరచుటకొరకును, ఆయన ఆజ్ఞలను గైకొనుటకును మానవుడు చేయబడెను (ప్రసంగి 12:13, మత్తయి 6:33, 1 పేతురు 4:16). ఏదెను వనములో దేవుని నుండి పాపము ద్వారా వేరు చేయబడిన మానవుని యేసు క్రీస్తు తన సిలువద్వారా మరల దేవునితో ఏకము చేయుటకు ఈ లోకమునకు ఆయన వచ్చెను. "మనుష్యుని ద్వారా మరణము వచ్చెను. గనుక, మనుష్యుని ద్వారానే మృతుల పునరుత్థానము కలిగెను. ఆదామునందు అందరు ఏలాగు మృతి పొందుచున్నారో, ఆలాగుననే క్రీస్తునందు అందరు బ్రతికింపబడుదురు" (1 కొరింధి 15:21-22). "ఒకడు నామాట గైకొనినయెడల వాడెన్నడును మరణము పొందడని" యేసు చెప్పెను (యోహాను 8:51). నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడునని ఆయన చెప్పుచున్నాడు. నీవు నీ పాపముల నుండి రక్షణ నొందవలెననిన తక్షణమే ఆయన ఆజ్ఞలకు లోబడుము. అప్పుడు ఆయన నిత్యజీవమునకు నిన్ను పాత్రునిగా ఎంచును!!



# 7. బైబిలును అర్థము చేసికొనుట యెట్లు

## (UNDERSTANDING THE BIBLE)

మనము దేవుని తెలిసికొని ఆయనను మహిమపరచ వలెనని దేవుడు కోరుచున్నాడు. దేవుని మనం ఆయన యిచ్చిన బయలుపాటు ద్వారా, అంటే ఆయన గ్రంథము ద్వారా తెలిసికొనగలము. "పూర్వ కాలమందు నానా సమయములలోను, నానా విధములుగాను ప్రవక్తల ద్వారా మన పితరులతో మాటలాడిన దేవుడు, ఈ దినముల అంతమందు కుమారుని ద్వారా మనతో మాటలాడెను" (హెబ్రీ 1:1, 2). మనకు జీవమునకు, భక్తికి కావలసినవన్నిటిని ఆయన గ్రంథమందు లిఖించి మన కిచ్చియున్నాడు. అందువలన దేవుని గ్రంథమును చదువువాడును, వినువాడును విని అందులో వ్రాయబడిన సంగతులను గైకొనువాడును ధన్యుడు అని బైబిలు చెప్పుచున్నది (ప్రకటన 1:3).

గనుక బైబిలు గ్రంథమును మనం సరిగ అర్థం చేసికొని చదువుట అతి ప్రాముఖ్యమైన సంగతి. ఎందుకంటే "దేవుని యెదుట యోగ్యునిగాను, సిగ్గుపడనక్కర లేని పనివానిగాను, సత్యవాక్యమును సరిగా ఉపదేశించు వానిగాను (లేదా సరిగా విభజించువాని గాను) నిన్ను నీవే దేవునికి కనపరచుకొనుటకు జాగ్రత్తపడుము (2 తిమో 2:15) అని బైబిలు మనలను హెచ్చరించుచున్నది. సత్యవాక్యమయిన బైబిలును అనేకులు సరిగా విభజింపక పోవుటవలన నేడు క్రైస్తవ లోకంలో గందరగోళం ఎక్కువగా నున్నది. సరిగదా వారిలో వారు అనేక శాఖలుగా విడిపోయి ఉన్నారు. బైబిలును చదువున్పుడు మన స్వశిద్ధాంతములను, బోధలను దాని ద్వారా నిరూపించుట కొరకు చదువుట కంటె, సత్యము నందు

మనకు సరియైన నడిపింపుకొరకు, దేవుని చిత్తమును మనము గ్రహించుట కొరకును ఆసక్తితో చదువవలెను. బైబిలును నావలెనే మీరును తేలికగా అర్థం చేసికొనడానికి వీలుగా ఈ రోజు కొన్ని సలహాలను యివ్వాలని నేను కోరుచున్నాను. నేను చెప్పుచుండగా మీరు ఒక కాగితం, కలం దగ్గర పెట్టుకొని మీరు కొన్ని అంశములను వ్రాసుకొనగలిగితే చాలా మంచిది. బైబిలు అంతటిలోను 66 పుస్తములున్నవి. బైబిలులో మొదటి పుస్తకము ఆదికాండము, ఆఖరి పుస్తకము ప్రకటన గ్రంథము. ఈ 66 పుస్తములు కలిపి మరల రెండు ప్రాముఖ్య విభాగములుగా విభజింపబడినవి – పాత నిబంధనలో 39 పుస్తకములున్నవి. అవి ఆదికాండము నుండి మలాకీ గ్రంథము వరకు ఉన్న పుస్తకములు. ఈ 39 పుస్తకములు మోషే ధర్మశాస్త్రము అని మనం గ్రహించవలెను.

క్రొత్త నిబంధనలో 27 పుస్తకములున్నవి. ఇవి యేసు క్రీస్తు ద్వారా కలిగెను. మత్తయి వ్రాసిన సువార్త నుండి యోహాను వ్రాసిన ప్రకటన గ్రంథము వరకు ఉన్న 27 పుస్తకములు ఇందు ఉన్నవి. నేడు క్రైస్తవులు, వారి విశ్వాసము కొరకు, ఆచరణ కొరకు అనుసరించవలసినది క్రొత్త నిబంధన గ్రంథము. మనం బైబిలును చదువునప్పుడు సులువుగా జ్ఞాపకముంచుకొనడానికి, అర్థం చేసుకొనడానికి వీలుగ పాతనిబంధనను, క్రొత్త నిబంధనను కొన్ని అంశములు వారిగ మనము విభజింపవచ్చును. ఈ విభజనలు దైవగ్రంథమును పఠించునపుడు మనకు సహాయకరంగా యుండుటకు చేయబడినవి అని గమనించండి. పాత నిబంధనలోని 39 పుస్తకములను మనం అయిదు విభాగములు చేయవచ్చును. మొదటి విభాగము చట్టము (The Law) అని చెప్పుకొనవచ్చును. ఇందులో బైబిలునందలి మొదటి అయిదు పుస్తకములు వస్తాయి. ఆదికాండము నుండి ద్వితీయోపదేశ కాండము వరకు ఉన్న పుస్తకములు చట్టము



లేదా ధర్మశాస్త్రము అని మనం చెప్పుకొనవచ్చును. ఈ 5 పుస్తకములను పంచకాండములు అని కూడా మనం సాధారణముగా చెప్పుకొంటూ యుంటాము. ఇందులో దేవుని శాసనములు అనేకములున్నవి.

పాత నిబంధనలోని రెండవ విభాగము – చరిత్ర (history) యని మనం చెప్పుకొనవచ్చును. ఇందులో యెహోషువా గ్రంథము నుండి ఎస్తేరు గ్రంథము వరకు ఉన్న 12 పుస్తకములు వచ్చును. ఐగుప్తులో నుండి ఇశ్రాయేలీయులు విడిపింపబడినప్పటి నుండియు జరిగిన వారి చరిత్ర అందులో మనకు కన్పడగలదు. 3వ భాగాన్ని పద్యకావ్యములు (poetry) అని మనం చెప్పుకొనవచ్చును. యోబు గ్రంథము నుండి సొలొమోను రచించిన పరమగీతముల వరకు ఉన్న 5 పుస్తకములను మనం పద్యకావ్యముల లెక్కలో చేర్చవచ్చును. దేవుని మహిమను గూర్చి, ఆయన జ్ఞానమును గూర్చి ఈ పుస్తకములలో పద్యకావ్యముల రీతిగ వ్రాయబడియున్నది. పాతనిబంధనలో మిగిలిన పుస్తకములను మనం పెద్ద ప్రవక్తలు (major prophets) చిన్న ప్రవక్తలు (minor prophets) అని విభజింపవచ్చును. పెద్ద ప్రవక్తలు అను దానిలో యెషయా గ్రంథము నుండి దానియేలు గ్రంథము వరకూ ఉన్న పుస్తకములను చేర్చవచ్చును. చిన్న ప్రవక్తలు అను విభాగములో హోషేయ గ్రంథము నుండి మలాకీ గ్రంథము వరకు ఉన్న 12 పుస్తకములు వస్తాయి. పెద్ద ప్రవక్తలు అనగా చిన్న ప్రవక్తలకంటె జ్ఞానములోగాని, ప్రాముఖ్యతలోగాని ఎక్కువైనవారు అని నా ఉద్దేశ్యం కాదు. చిన్న ప్రవక్తలు అంటే పెద్ద ప్రవక్తల కంటే ప్రాముఖ్యతలో తక్కువైనవారు అని అర్థం కాదు. ప్రవక్తల గ్రంథములలో మొదటి 5 పుస్తకములు మిగిలిన వాటికంటె కొంచెము పెద్దవి గనుక మన సహాయార్థం అవి ఆ విధంగా విభజింపబడినవి.

పాత నిబంధనలోని 39 పుస్తకములను మనం 5 ప్రాముఖ్య విభాగములుగా చేయబడుట చూచాం. వాటిని మరల చెబుతాను. చట్టము, చరిత్ర, పద్యకావ్యములు, పెద్ద ప్రవక్తలు, చిన్న ప్రవక్తలు అనునవి. ఆదికాండము నుండి మలాకీ గ్రంధము వరకుయున్న ఈ 39 పుస్తకములు దైవావేశముచే వ్రాయబడినవి. అవన్నియును ప్రాముఖ్యతలో సమానములని మనం గమనించాలి. అట్లే క్రొత్త నిబంధనలోని 27 పుస్తకములను మన గ్రహింపుకొరకు 4 విభాగములుగ చేయవచ్చును. ఇందులో మొదటి విభాగాన్ని మనం క్రీస్తు జీవిత చరిత్ర (biography of Christ) అని చెప్పవచ్చును. క్రొత్త నిబంధనలోని మొదటి నాలుగు సువార్త పుస్తకములు అనగా మత్తయి, మార్కు, లూకా, యోహానులు వ్రాసిన సువార్తలు ఇందులో వస్తాయి. యేసుక్రీస్తు యొక్క జననం, జీవనం, మరణం పునరుద్ధానములను గూర్చి ఈ నలుగురు భక్తులు వ్రాసిన సాక్ష్యము మనకు అందులో దొరుకును.

తరువాత విభాగాన్ని సంఘ చరిత్ర (Church history) అని చెప్పుకొనవచ్చును. అపోస్తలుల కార్యములు అనే ఒక్క పుస్తము ఈ విభాగానికి చెందును. సంఘము ఎప్పుడు, ఎక్కడ ఎట్లు ప్రారంభమయినదో ప్రారంభమయిన తరువాత అది యూదయ, సమరయ దేశములయందంతట లోను, భూదిగంతముల వరకును అపోస్తలుల కాలములో ఎట్లు వ్యాప్తి చెందినదో 'అపోస్తలుల కార్యములు' అను ఈ పుస్తకము మనకు తెలియజెప్పుచున్నది. క్రొత్త నిబంధనలో యున్న 3వ విభాగాన్ని మనం 'పత్రికలు' లేక 'ఉత్తరములు' (epistles or letters) అని చెప్పుకొనవచ్చును. అపోస్తలుడైన పౌలు రోమీయులకు వ్రాసిన పత్రిక



నుండి యూదా వ్రాసిన పత్రిక వరకూ ఉన్న 21 పత్రికలు ఇందులో వస్తాయి. పరిశుద్ధాత్మ ఆవేశము గలిగి ఈ పత్రికలు ఆయా ప్రదేశములలో యున్న సంఘములను, వ్యక్తులను ఉద్దేశించి వ్రాయబడినవి. క్రైస్తవ జీవనము గూర్చియు, సంఘము యొక్క ఆత్మీయాభివృద్ధిని గూర్చియు, దాని పరిపాలనా విధానమును గూర్చియు ఈ పత్రికల ద్వారా దేవుడు మనకు బోధించుచున్నారు.

క్రొత్త నిబంధనలో ఆఖరి విభాగము 'ప్రవచనము' (The prophecy). ఇందులో ప్రకటనయను ఒకే ఒక్క పుస్తకమున్నది. ఇది బైబిలు నందలి ఆఖరి పుస్తకము. భక్తుడైన యోహాను ఆత్మావేశుడై ఈ ప్రవచన గ్రంధమును వ్రాసెను. యోహాను వ్రాయుసరికి సంఘమునకు త్వరలో సంభవింపనై యున్న అనేక సంగతులను ఈ గ్రంధమందు మనము చూడగలము. క్రొత్త నిబంధనలోని 27 పుస్తకములను మన గ్రహింపు కొరకు 4 విభాగములుగ జేసియున్నాము. అవి క్రీస్తు చరిత్ర, సంఘ చరిత్ర, పత్రికలు లేక ఉత్తరములు మరియు ప్రవచనము అనునవి.

పాత నిబంధన ఎట్లు దైవావేశముచే వ్రాయబడెనో, క్రొత్త నిబంధన కూడ అట్లే పరిశుద్ధాత్మ ప్రేరేపణచే వ్రాయబడెను. "ఏలయనగా ప్రవచనము ఎప్పుడును మనుష్యుని ఇచ్ఛనుబట్టి కలుగలేదుగాని, మనుష్యులు పరిశుద్ధాత్మ వలన ప్రేరేపింపబడినవారై దేవుని మూలముగ పలికిరి" అని పేతురు వ్రాసెను (2 పేతురు 1:21). పాత నిబంధన ఎంతైతే దేవుని వాక్యమైయున్నదో, క్రొత్త నిబంధన కూడా అంతే దేవుని వాక్యమై యున్నది. అయితే ఈనాడు మనం మన విశ్వాసము కొరకు, ఆచరణ కొరకు పాత నిబంధనను కాక క్రొత్త నిబంధనను అనుసరించ

వలయును. బైబిలును మనం సులభముగా అర్థము చేసికొనుటకు పాత క్రొత్త నిబంధనల యొక్క ప్రయోజనమును, స్థానమును, వాటి సంబంధమును తెలిసికొనుట ఎంతయో ప్రాముఖ్యము. ఈ నిబంధనల సంబంధమును గూర్చి తరువాత పాఠములో చూచుకొందాము.

యేసు క్రీస్తు తన ధర్మశాస్త్రమును, అనగా రక్షణ వాక్యమును మనకు ఇచ్చుటకు ఈ లోకమునకు వచ్చెను. "తండ్రి కుమారుని ప్రేమించుచున్నాడు గనుక ఆయన చేతికి సమస్తము అప్పగించియున్నాడు" (యోహాను 3:34). "మీరు దేవునియందు విశ్వాసముంచుచున్నారు. నా యందును విశ్వాసముంచుడి" అని ఆయన చెప్పుచున్నారు (యోహా 14:1). ఏలయనగా కుమారునియందు విశ్వాసముంచువాడే నిత్యజీవము గలవాడు. కుమారుని విధేయుడు కానివాడు జీవము చూడడుగాని దేవుని ఉగ్రత వానిమీద నిలిచియుండును" (యోహాను 3:36). దేవుని ఉగ్రత నుండి తప్పించుకొనుటకు, యేసుక్రీస్తు నందు విశ్వాసముంచి, మీ పాపముల నిమిత్తము మార్పు నొంది, క్రీస్తు నామమున మీ పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుడి. అట్లు మీరు చేసినయెడల క్రీస్తు తన సంఘములో మిమ్మును చేర్చుకొనును. ఆయన మీకు రక్షకుడుగను, మీరు ఉగ్రత నుండి తప్పించబడి రక్షింపబడిన వారగుదురు.



# 8. నిబంధనల సంబంధము

## (RELATIONSHIP OF THE COVENANTS)

శతాబ్దముల తరబడి దేవుడు తన ప్రజలతో మాటలాడెను. "పూర్వకాలమందు నానా సమయములలోను నానా విధములుగాను ప్రవక్తల ద్వారా మన పితరులతో మాటలాడిన దేవుడు, ఈ దినముల అంతమందు కుమారుని ద్వారా మనతో మాటలాడెను" అని బైబిలు చెప్పుచున్నది (హెబ్రీ 1:1, 2). ముందు ఆయన పితరులతో మాటలాడెను. గోత్రమునకు కర్తయైన గోత్రకర్తతో దేవుడు మాటలాడెను. గనుక బైబిలు నందలి మొదటి కాలమును, అనగా ఆదాము మొదలుకొని ఇశ్రాయేలు ప్రజలు బానిసత్వము నుండి విడిపింపబడి సీనాయ కొండకు వచ్చే వరకు ఉండిన కాలమును గోత్రకర్తల యుగము లేదా పితరుల యుగము అని మనం పిలువ వచ్చును. అట్లు దేవుడు పితరులతో మాటలాడుచు, వారితో ఒడంబడికలు లేక నిబంధనలు చేయుచు ఈ లోకము తన కుమారుని అంగీకరించు లాగున దేవుడు ప్రజలను సిద్ధపరచెను.

ఆయన ఆదాముతో మాటలాడెను, నోవహుతో మాటలాడెను. అబ్రహాముతో మాటలాడెను. అబ్రహాము తరువాత ఇస్సాకుతో, ఇస్సాకు తరువాత యాకోబుతో దేవుడు మాటలాడెను. ఈ విధముగా మన పితరులతో ఆయన మాటలాడెను. అటు తరువాత యాకోబు పేరును ఇశ్రాయేలుగా మార్చి ఇశ్రాయేలు సంతతిని, అనగా ఇశ్రాయేలీయులను ఒక జనాంగముగా చేసి దేవుడు వారితో ఒక మధ్యవర్తి ద్వారా మాట్లాడ సాగెను. దేవుడు ఇశ్రాయేలీయులతో మోషే ద్వారా ఒక నిబంధనను చేసెను. "కాగా మీరు నా మాట శ్రద్ధగా విని నా నిబంధన ననుసరించి

నడచిన యెడల మీరు సమస్త దేశ జనులలో నాకు స్వకీయ సంపాద్య మగుదురు. సమస్త భూమియు నాదేగదా. మీరు నాకు యాజక రూపమైన రాజ్యమునుగాను, పరిశుద్ధమైన జనముగాను ఉందురని చెప్పుము. నీవు ఇశ్రాయేలీయులతో పలుకవలసిన మాటలు ఇవే" అని దేవుడు మోషేతో చెప్పెను (నిర్గమ 19:5, 6). "మరియు యెహోవా మోషేతో ఇట్లనెను – ఈ వాక్యములను వ్రాసికొనుము. ఏలయనగా ఈ వాక్యములను బట్టి నేను నీతోను ఇశ్రాయేలీయులతోను నిబంధన చేసి యున్నాను" అనెను (నిర్గమ 3:27).

మనం ఇప్పటి వరకు చూచిన ఈ వాక్యములను బట్టి దేవుడు చేసిన ఈ నిబంధన మోషే ద్వారా ఇశ్రాయేలీయులకు ఇచ్చెనని గమనించ గలము. దానినే మనం సాధారణముగ మోషే ధర్మశాస్త్రము లేదా పాత నిబంధన గ్రంథము అని చెప్పుతూ యుంటాము. "మోషే ఇశ్రాయేలీయుల నందరిని పిలిపించి యిట్లనెను – ఇశ్రాయేలీయులారా, నేను మీ వినికిడిలో నేడు చెప్పుచున్న కట్టడలను, విధులను విని వాటిని నేర్చుకొని, వాటి ననుసరించి నడువుడి. మన దేవుడైన యెహోవా హోరేబులో మనతో నిబంధన చేసెను. యెహోవా మన పితరులతో కాదు, నేడు సజీవులమై యున్న మనతోనే యీ నిబంధన చేసెను" (ద్వితీ 5:1–3). దీనిని బట్టి మోషే ధర్మశాస్త్రము ఇశ్రాయేలీయులకే లేదా యూదులకే ఈయబడెను. అది అన్యజనులకు కాదు అని తేటబడుచున్నది. అయితే ఇశ్రాయేలీయులు "దేవుని నిబంధనను గైకొనకపోయిరి. ఆయన ధర్మశాస్త్రము ననుసరింప నొల్లకపోయిరి" (కీర్తన 78:10).

పాపము వలన కలుగు ఘోర దుస్థితిని ధర్మశాస్త్రము తెలియజేయ



లేకపోయెను. అది నీతిని కలుగజేయలేకపోయెను. అపోస్తలుడైన పౌలు ఇట్లనుచున్నాడు. "నేను దేవుని కృపను నిరర్థకము చేయను. నీతి ధర్మ శాస్త్రము వలనైతే ఆ పక్షమందు క్రీస్తు చనిపోయినది నిష్ప్రయోజనమే" (గలతి 2:21). మోషే ధర్మశాస్త్రము వలన పరిపూర్ణ విధేయత జూపుటకు ఒక మాదిరి లేకపోయెను. అది కేవలము ఇశ్రాయేలీయులతో చేయబడిన నిబంధన గనుక మిగిలిన వారందరు దానిని అనుసరించుటకు వీలు లేకపోయెను.

ఇట్టి బలహీనతలు పాతనిబంధన యందున్నవి కనుక దేవుడు ఒక క్రొత్త నిబంధనను చేయుదునని ఆయనే వాగ్దానము చేసెను. ఆయన ఇట్లు అనుచున్నాడు:"ఇదిగో నేను ఇశ్రాయేలువారితోను, యూదావారితోను క్రొత్త నిబంధన చేయు దినములు వచ్చుచున్నవి. ఇదే యెహోవా వాక్కు, అది ఐగుప్తులో నుండి వారిని రప్పించుటకై నేను వారిని చెయ్యి పట్టుకొనిన దినమున వారి పితరులతో నేను చేసిన నిబంధన వంటిది కాదు. నేను వారి పెనిమిటినైనను, వారు ఆ నిబంధనను భంగము చేసికొనిరి. ఇదే యెహోవా వాక్కు, ఈ దినములైన తరువాత నేను ఇశ్రాయేలు వారితోను యూదావారితోను చేయబోవు నిబంధన యిదే. వారి మనస్సులో నా ధర్మవిధి ఉంచెదను, వారి హృదయము మీద దానిని వ్రాసెదను. యెహోవా వాక్కు ఇదే. నేను వారికి దేవుడనై యుందును. వారు నాకు జనులగుదురు. నేను వారి దోషములను క్షమించి, వారి పాపములను ఇక నెన్నడును జ్ఞాపకము చేసికొనను. గనుక అల్పులేమి, ఘనులేమి అందరు నన్ను ఎరుగుదురు. ఇదే యెహోవా వాక్కు" (యిర్మియా 33:31–34).

యేసు క్రీస్తు ఈ లోకమునకు వచ్చి వాగ్దానము చేయబడిన క్రొత్త

నిబంధనను తన రక్తమువలన ముద్రవేసి మనకు ఇచ్చెను. ఆయన మోషే ధరశాస్త్రమును నెరవేర్చుట ద్వారా దాని స్థానమున క్రొత్త నిబంధనను ఇయ్యగలిగెను. "ధర్మశాస్త్రమునైనను, ప్రవక్తల ప్రవచనములనైనను కొట్టి వేయవచ్చితినని తలంచవద్దు. నెరవేర్చుటకే గాని కొట్టివేయుటకు నేను రాలేదు" అని ఆయన చెప్పెను (మత్తయి 5:17). ధర్మశాస్త్రమందలి షరతులన్నిటిని యేసు ప్రభువు నెరవేర్చెను. దానిని నెరవేర్చుట ద్వారా దానియొక్క ప్రయోజనము నిక లేకుండా ఆయన చేసెను. "అంతయు సమాప్తమాయెను" అని యేసు సిలువపై పలికి మరణించెను. ఆయన మరణించిన ఆ గడియలోనే దేవాలయపు తెర పైనుండి క్రిందికి చిరిగెను (మత్తయి 27:51). దేవాలయపు తెర చిరుగుట ద్వారా మోషే ధర్మ శాస్త్రము సమాప్తమాయెనని, మనకొక క్రొత్త ధర్మశాస్త్రము ఆరంభ మాయెనని మనకు గుర్తు అగుచున్నది. అపోస్తలుడైన పౌలు చెప్పిన దానిని మనం ఇప్పుడు చూద్దాం. కొలస్సయులకు వ్రాసిన పత్రిక 2:14లో అతడు ఇట్లు వ్రాయుచున్నాడు. "దేవుడు వ్రాతరూపకమైన ఆజ్ఞల వలన మనమీద ఋణముగాను, మనకు విరోధముగాను ఉండిన పత్రమును మేకులతో సిలువకు కొట్టి, దానిమీద చేవ్రాతను తుడిచివేసి, మనకు అడ్డము లేకుండా దానిని ఎత్తివేసెను". గనుక యేసుక్రీస్తు మోషే ధర్మ శాస్త్రమును సిలువకు మేకులతో కొట్టివేసెను. "ధర్మశాస్త్రము మోషే ద్వారా అనుగ్రహింపబడెను. కృపయు, సత్యమును యేసుక్రీస్తు ద్వారా కలిగెను" (యోహాను 1:17).

పాత నిబంధన యందు దేవుని ముఖ్య కార్యక్రమములో లేని సంగతులు అనేకము కలవు. "ధర్మశాస్త్రము రాబోవు మేలుల ఛాయ గలదియే గాని ఆ వస్తువుల నిజస్వరూపము గలది కాదు" (హెబ్రీ 10:1). పది ఆజ్ఞలును, మోషే ధర్మశాస్త్రమంతయును దేనికిని సంపూర్ణ సిద్ధిని



కలుగజేయలేదు. గనుక అంతకంటె శ్రేష్ఠమైన నిరీక్షణ దానివెంట ప్రవేశపెట్టబడెను (హెబ్రీ 7:19). ఆయన క్రొత్త నిబంధన చేయుదును అని చెప్పుట చేత మొదటిదానిని పాతదిగా చేసియున్నాడు. ఏది పాతగిలి ఉడిగిపోవునో, అది అదృశ్యమగుటకు సిద్ధముగా యున్నది అని పరిశు ద్ధాత్ముడు పౌలు ద్వారా పలికెను (హెబ్రీ 8:13). "ఆ రెండవ దానిని స్థిరపరచుటకు మొదటిదానిని ఆయన కొట్టి వేయుచున్నాడు" అని అతడు మరల వ్రాసెను. "ఏలయనగా ఆ మొదటి నిబంధన లోపము లేనిదైతే రెండవదానికి అవకాశము ఉండదు, ఉండనేరదు" (హెబ్రీ 8:7).

"కావున నా సహోదరులారా, మనము దేవుని కొరకు ఫలములను ఫలించునట్లు మృతులలో నుండి లేపబడిన క్రీస్తు అను వేరొకని చేరుటకై మీరును ఆయన శరీరము ద్వారా ధర్మశాస్త్రము విషయమై మృతులైతిరి" యని పౌలు రోమీయులకు వ్రాసెను (రోమా 7:4). మనము మృతులలో నుండిన మోషేనుగాక మృతులలో నుండి లేపబడిన ప్రభువును సేవింప వలెను. "ఇదిగో ఈయన నా ప్రియ కుమారుడు, ఈయన యందు నేనానందించుచున్నాను, ఈయన మాట వినుడు" యని యేసుని గూర్చి తండ్రియైన దేవుడు సాక్షమిచ్చెను (మత్తయి 17:5). ఇంతవరకు మనము గమనించిన వాక్యమునుబట్టి పాతనిబంధన దేనికిని సంపూర్ణసిద్ధిని కలుగజేయలేదు గనుక దేవుడు దానిని తీసివేసి మరొక క్రొత్త నిబంధనను ఇచ్చెనని గ్రహించాము. అనేకులు ఈ సంగతిని ఎరుగక పాతనిబంధనను ఈనాడు క్రైస్తవులు పాటించవలెనని చెప్పుదురు. పాత నిబంధన యొక్క ప్రయోజనము నెరవేర్చబడినది గనుక ఇకను అది అమలులో లేదు. "కాబట్టి మనము విశ్వామూలమున నీతిమంతులమని తీర్చబడునట్లు క్రీస్తునొద్దకు మనలను నడిపించుటకు ధర్మశాస్త్రము మనకు బాలశిక్షకు

డాయెను. అయితే విశ్వాసము వెల్లడియాయెను గనుక ఇక బాలశిక్షకుని క్రింద ఉండము" అని పౌలు వ్రాసెను (గలతి 3:24-25). గలతీయులకు వ్రాసిన పత్రిక అంతటిలోను, క్రీస్తును వదిలి తిరిగి ధర్మశాస్త్రమునొద్దకు వెళ్లుట బుద్ధిహీనతయని పరిశుద్ధాత్మ ద్వారా పౌలు బోధించెను. "మీలో ధర్మశాస్త్రము వలన నీతిమంతులని తీర్చబడువారెవరో, వారు క్రీస్తులో నుండి బొత్తిగా వేరుచేయబడియున్నారు. కృపలో నుండి తొలగిపోయి యున్నారు" అని అతడు బోధించెను (గలతి 5:4).

నేడు మన విశ్వాసమునకుగాని, ఆచరణకుగాని, మాదిరికగాని మనము క్రీస్తునే వెంబడింపవలెను. గాని మోషే ధర్మశాస్త్రమును కాదు. పాతనిబంధన దేవుని వాక్యమై యున్నదిగాని ఒక చట్టమువలె అది చెల్లుబడిలో లేదు. పాత నిబంధనను ఇంకనూ మనం అనుసరింపవలెను అని చెప్పు "వారి మనుస్సులు కఠినములాయెను గనుక నేటివరకును పాత నిబంధన చదువబడునప్పుడు అది క్రీస్తునందు కొట్టివేయబడెనని వారికి తేటపరచబడక ఆ ముసుకే నిలిచియున్నది" అని పౌలు చెప్పు చున్నాడు (2 కొరింథి 3:14). నేడు మన అనుసరణకు పాతనిబంధన లేదుగాని, మన పూర్వీకులు ఆశించిన ప్రకారము మనము చెడ్డవాటిని ఆశించకుందునట్లు ఈ సంగతులు మనకు దృష్టాంతములుగ యున్నవియని అపోస్తలుడైన పౌలు చెప్పుచున్నాడు. "ఈ సంగతులు దృష్టాంతములుగా వారికి సంభవించి యుగాంతమందున్న మనకు బుద్ధి కలుగుటకై వ్రాయబడెను" (1 కొరింథి 10:6, 11). "ఏలయనగా ఓర్పు వలనను, లేఖనముల వలన ఆదరణ వలనను మనకు నిరీక్షణ కలుగుటకై పూర్వమందు వ్రాయబడినవన్నియు మనకు బోధ కలుగు నిమిత్తము వ్రాయబడియున్నవి" యని గ్రహించవలెను (రోమా 15:4).



కృపయు, సత్యమును, విశ్వాసమును యేసు క్రీస్తు ద్వారా కలిగెను. క్రీస్తు యొక్క ధర్మశాస్త్రము నీతిని, నిత్యజీవమును కలుగజేయును. "ఏలయనగా పాపమువలన వచ్చు జీతము మరణము. అయితే దేవుని కృపావరము మన ప్రభువైన క్రీస్తు యేసునందు నిత్యజీవము" (రోమా 6:23). క్రీస్తు యొక్క ధర్మశాస్త్రము పాపముయొక్క ఘోరస్థితిని మనకు బోధించుచున్నది. అంతేకాదు, నీతివిషయములోను, భక్తి విషయములోను యేసుక్రీస్తును మనకు గొప్ప మాదిరిగా చూపించుచున్నది. "క్రీస్తు కూడ మీకొరకు బాధపడి మీరు తన అడుగుజాడల యందు నడుచుకొనునట్లు మీకు మాదిరి యుంచిపోయెను. ఆయన పాపము చేయలేదు. ఆయన నోటను ఏ కపటమును కనబడలేదు" అని పేతురు చెప్పెను (1 పేతురు 2:22).

యేసుక్రీస్తు యొక్క ధర్మశాస్త్రము అందరికీ వర్తించును. ఆయన మృతులలో నుండి తిరిగి లేచిన తరువాత "మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి. నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును. నమ్మనివానికి శిక్ష విధింపబడును" అని చెప్పెను. ఆ అజ్ఞాన కాలములను దేవుడు చూచిచూడనట్టుగా ఉండెను. ఇప్పుడైతే అంతటను, అందరును మారుమనస్సు పొందవలెనని మనుష్యులకు ఆజ్ఞాపించుచున్నాడు". గనుక "మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి. అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు" (మార్కు 16:15, 16, అపో.కా. 17:30, 2:38).

# 9. పాపము అనగా నేమి?

## (WHAT IS SIN?)

మానవ చరిత్ర యంతటిలోను దుఃఖముతో కప్పబడియున్న గొప్ప పర్వతశిఖరముల వంటి సంఘటనలు రెండు ఉన్నవి. వాటిలో మొదటిది మానవుని ఘోరదుస్థితి. రెండవది దేవుని దుఃఖపరిస్థితియని మనం చెప్పు కొనవచ్చును. కొన్ని వేల సంవత్సరముల క్రితము ఏదేను అను వనములో బహు విచారకరమైన సంఘటన భూమిపై మొదటిగా సంభవించెను – అక్కడ పాపము ఉద్భవించెను. రెండవది – అంతకన్నా బహుఘోరమైనది ఒక కొండపై జరిగెను. తన అనుచరులతో విసర్జించబడి, ఏకాకిగా దేవుని కుమారుడు పాపము కొరకు తన ప్రాణమును సిలువలో బలి యిచ్చెను. ఈ రెండు సంఘటనలు, అనగా అలనాడు మానవుడు పాపములో పడుట యేసుక్రీస్తు సిలువపై బలి అర్పించుట యనునవి, ఈ రెండును జరుగసరికి, జరిగిన ఆ ప్రదేశములకును, జరిగించబడిన సమయమునకు బహు వ్యత్యాసమున్నది. ఈ రెండు సంఘటనలకు మధ్య కొన్ని వేల సంవత్సరములు గడచినవి. మానవులలో అనేక తరములవారు వచ్చి వెళ్ళిరి. అయినను మానవజాతి ఇంకను పాపమందు కొనసాగింపబడుచునే యున్నది. అయితే రెండవ దుర్ఘటనకు మొదటి దుర్ఘటనయే కారణము. యుగముల తరబడి సాగుచున్న పోరాటము ఏదేను వనములో ప్రారంభమై, దానికి సాటియైన విరుగుడును, ఒక్కదానిని మాత్రమే కల్వరిపై ఎదుర్కొనినది. అట్లయినందున మీరు, నేను పాపమును ఎదుర్కొన నవసరము లేదని అనుకోవద్దు సుమీ!

మానవ జీవితంలో పాపము యొక్క ప్రభావము ప్రతి చోట



కన్పడుచున్నది. ప్రతివాడు దానికి జవాబుదారియై యున్నాడు. దీనిని మనం బైబిలునంతటా చూడగలం. పాపం మొదటి స్త్రీ పురుషులను దేవుడు చెప్పినదానికి వ్యతిరేకముగా చేయుటకు ప్రోత్సహించెను. పాపమువలన కయీను యొక్క చేతులు తన స్వంత తమ్ముని రక్తము వలన కలుషితము లాయెను. పాపము ఎనిమిది మందిని తప్ప లోకములోయున్న వారినందరినీ నాశనము చేసెను. ఆనాటి పాపలోకమునంతటినీ నాశనము చేయుటకు దేవుడు పంపిన గొప్ప జలప్రళయములో నోవహు, నోవహు కుటుంబము మాత్రమే రక్షింపబడగల్గిరి. పాపము సొదొమ, గొమొర్రాలను పట్టణములను శుభ్రముగా నాశనము చేసెను. పాపము ఇశ్రాయేలు ప్రజలలో ఎదురాడు స్వభావమును కల్పించెను. అందువలన వారు అరణ్యములో ఇంచుమించు 40 సంవత్సరములు తిరుగులాడవలసి వచ్చెను. ఇదంతా ఎందుకు? పాపము దేవుని కుమారుని సిలువ వేయించెను. ఆయన అపోస్తులులలో ఒక్కని తప్ప అందరిని ఘోరముగ హత్యగావించెను. ఇట్టి ఘోరమైన సంఘటనలను మనం బైబిలు నందుగాని, లేదా ప్రతిదినం చూచుచున్న సంఘటనల నుండిగాని ఎన్నిటినో చెప్పుకొనవచ్చును గాని ఇవి చాలును.

అది అట్లుండగా కొందరు పాపమే లేదని వాదించేవారున్నారు. దేవుడు లేడని వాదించేవారెట్లున్నారో పాపముకూడా లేదని వాదించే వారున్నారు. మన ఇండ్లకు తాళం వేయుట, డబ్బును జాగ్రత్తగా దాచుట ఈనాడు మనం చేస్తున్నాం అంటే, పాపమునకు భయపడియే కదా? మనం పాపము లేనివారమని చెప్పుకొనిన యెడల మనం అబద్ధికుల మవుతాము అని అపోస్తులుడైన యోహాను చెప్పుచున్నాడు. అతడీలాగు చెప్పుచున్నాడు "మనము పాపము లేనివారమని చెప్పుకొనిన యెడల, మనలను మనమే మోసపుచ్చుకొందుము. మరియు మనలో సత్యముండదు.

మన పాపములను మనము ఒప్పుకొనిన యెడల, ఆయన నమ్మదగిన వాడును, నీతిమంతుడును గనుక ఆయన మన పాపములను క్షమించి సమస్త దుర్నీతి నుండి మనలను పవిత్రులుగా చేయును" (1 యోహాను 1:8-10). లేఖనములను బట్టి మన ప్రతి దినానుభవాన్ని బట్టి పాపము లేదు అని నిరూపించడం కష్టమే. పాపమును దాని పేరు చొప్పున పిలుచుట అత్యవసరం. కొందరు పాపమును, పాపముగా ఎంచనందున అది పాపము కాకుండ పోదు. విషం ఉన్న ఒక సీసాపై అది పంచదార అని మనం వ్రాసిపెట్టవచ్చును. గాని ఆ సీసాలోని విషం మ్రింగిన యెడల చావు తప్పదుగదా? అట్లే పాపాన్ని మనం పంచదార పొరలతో కప్పిపుచ్చ వచ్చును గాని ఆ పొరల వెనుక మహాచేదైనది, అతిఘోరమైనది దాగియున్నది. అదే పాపము. ఈ లోకంలోయున్న దుఃఖమంతయు, వేదనలన్నియు, సిగ్గు అంతయు కలిసి ఒక్క మాటలో మనం చెప్పుకొనవచ్చును - పాపం. అది మానవ జాతినంతటినీ ఆవరించిన ఘోరమైన వ్యాధి. దానిని మనం ముందుగానే తెలిసికొని యుండుట అతి ప్రాముఖ్యం.

పాపం అనగా యేమిటి? పాపమనగా యేమిటో మనకు తెలియజెప్పడానికి లేఖనములయందు రకరకాల మాటలు వినియోగింప బడినవి. ఇశ్రాయేలు రాజగు దావీదు పాపమును గూర్చిన తన తలంపును ఒక విన్నపము రూపముగా వ్రాసెను. దానిని మనం కీర్తనల గ్రంథములో చూడగలం. అతడిట్లు చెప్పుచున్నాడు. "దేవా నీకృప చొప్పున నన్ను కరుణింపుము. నీ వాత్సల్య బాహుళ్యము చొప్పున నా అతిక్రమములను తుడిచివేయుము. నా దోషము పోవునట్లు నన్ను బాగుగా కడుగుము. నా పాపము పోవునట్లు నన్ను పవిత్రపరచుము. నా అతిక్రమములు నాకు తెలిసేయున్నవి. నా పాపమెల్లప్పుడు నా యెదుట నున్నది" (కీర్తనలు



51:1-3). ఈ ప్రార్థనలో దావీదు రాజు ఆత్మీయోద్రేకముచే మూడు మాటలను సరిసమానముగ వినియోగించుచున్నట్లు మనం చూడగలం. అవి నా దోషము, నా అతిక్రమము, నా పాపము అనునవి.

దోషము అనగా దుర్మార్గత. అంటే సరియైన, తిన్ననిదైన మార్గము నుండి తొలగిపోవుటయని అర్థమగుచున్నది. అందుకే, "మనమందరము గొర్రెలవలె త్రోవ తప్పిపోతిమి. మనలో ప్రతివాడును తనకిష్టమైన త్రోవకు తొలిగెను" అని యెషయా ప్రవక్త చెప్పెను (యెషయా 53:6). మనం దేవుని వాక్యమును విడిచిపెట్టినప్పుడు, సరియైన మార్గము నుండి తొలగి పోవుట జరుగును. మన జీవిత మార్గదర్శిగా ఈయబడిన దేవుని వాక్య ప్రకారము మన జీవితములో మనం నడుచుకొనకపోయినప్పుడు, త్రోవ తప్పిన గొర్రెలవలె యుండి పాపములో పడుదుము. సమస్త దుర్నీతియును పాపము అని అపోస్తలుడైన యోహాను వ్రాసెను (1 యోహాను 5:7). నిజముగా యేసుక్రీస్తు మనందరి దోషములను, దుర్నీతిని మన కొరకు సిలువలో మోసెను. యెహోవా మనయందరి దోషములను ఆయన మీద మోపెను. అతడు దౌర్జన్యమునొందెను. బాధింపబడినను అతడు నోరు తెరువలేదు. వధకు తేబడు గొర్రెపిల్లయు, బొచ్చు కత్తిరించు వాని యెదుట గొర్రెయు మౌనముగా నుండునట్లు అతడు నోరు తెరవలేదు అని యెషయా యేసును గూర్చి ముందుగనే ప్రవచించెను (యెషయా 53:7). "ఎందుకనగా మన మాయనయందు దేవుని నీతి యగునట్లు పాపమెరుగని ఆయనను మనకోసము పాపముగా చేసెను" (2 కొరింథి 5:21).

అతిక్రమము అనగా అతిక్రమించుట, అంటే హద్దు మీరిపోవుట లేక దాటిపోవుట. "క్రీస్తు బోధయందు నిలిచి యుండక దానిని విడిచి ముందుకుసాగు ప్రతివాడును దేవుని అంగీకరింపనివాడు. ఆ బోధయందు

నిలిచి యుండువాడు తండ్రిని, కుమారుని అంగీకరించువాడు" (2 యోహా:9) అని వాక్యము చెప్పుచున్నది. పాపము చేయు ప్రతివాడును ఆజ్ఞను అతిక్రమించును. "ఆజ్ఞాతిక్రమమే పాపము" అని దైవవేదము చెప్పుచున్నది (1 యోహాను 3:4). ఆదాము, హవ్వలు ఏదేను వనంలో ఉన్నప్పుడు, "ఈ తోటలోని ప్రతి వృక్షఫలమును నీవు నిరభ్యంతరముగా తినవచ్చును. అయితే మంచి చెడ్డల తెలివినిచ్చు వృక్షఫలములను తినకూడదు. నీవు వాటిని తిను దినమున నిశ్చయముగా చచ్చెదవు" అని దేవుడు నరుని కాజ్ఞాపించెను (ఆది 1:17). ఇట్లు దేవుడు వారికొక చట్టమునిచ్చెను. కాని వారు దేవుని చట్టమునకు అవిధేయులైరి. అందువల్లన వారు దేవుని దృష్టిలో పాపము చేసిరి.

దేవుడు అవిధేయతను ఎన్నడును సహింపనివాడు. లేఖనములను మీరి మనం ఏమియు చేయరాదని దేవుడు హెచ్చరించుచున్నప్పుడు, క్రీస్తును, క్రీస్తు బోధను, ఆయన సంఘమును వీడి మానవకల్పిత సిద్ధాంతముల ననుసరించుట పాపమగును.

దావీదు రాజు వినియోగించిన 3వ పదము 'పాపము' అనునది. "ఏ భేదమును లేదు, అందరును పాపము చేసి దేవుడు అనుగ్రహించు మహిమను పొందలేకపోవుచున్నారు" అని బైబిలు బోధించుచున్నది (రోమా 3:23). పాపము మనలను దేవుని నుండి వేరు చేయుచున్నది. "రక్షింప నేరక యుండునట్లు యెహోవా హస్తము కురుచకాలేదు, విననేరక యుండునట్లు ఆయన చెవులు మందము కాలేదు. మీ దోషములు మీకును మీ దేవునికిని అడ్డముగా వచ్చెను. మీ పాపములు ఆయన ముఖమును మీకు మరుగు పరచెను. గనుక ఆయన ఆలకింపకున్నాడు" అని ప్రవక్తయైన



యేషయా చెప్పుచున్నాడు (యెషయా 59:1-2). పాపము వలన వచ్చు జీతము మరణము అని బైబిలు బోధించుచున్నది (రోమా 6:23). అది సామాన్య భౌతిక మరణము కాదుగాని, పాపము వలన వచ్చు మరణము అంతకన్నా ఘోరమైనది. అది నిత్యాగ్నిలో ఆత్మపడు వేదనయై యున్నది. దేవుని నుండి వేరు పరచబడుట వలన వచ్చు మరణమది. అయితే మన మందరము సాధారణముగ భౌతికముగ మరణించు మరణము, అలనాడు ఆదాము పాపము చేయుటవలన కలిగిన ఫలితమిది. మొదటి మనుష్యుడు పాపము చేయగా దేవుడు మానవజాతికందరికి యిచ్చిన తీర్పు అది. "ఏలయనగా నీవు నేల నుండి తీయబడితివి. నీవు మన్నే గనుక తిరిగి మన్నైపోవుదువని" దేవుడు పలికెను (ఆది 3:19). దీనిని బట్టి మనమందరము ఆదాము చేసిన పాపమును వారసత్వముగా పొందుటలేదు. గాని, అతడు చేసిన పాపఫలితమును అనుభవించుచున్నాము.

మనం పాపమును వారసత్వపు రీత్యా ఎన్నడును పొందము. దేవుని వాక్యము ఈలాగు చెప్పుచున్నది. "పాపము చేయువాడే మరణము నొందును. తండ్రి యొక్క దోషశిక్షను కుమారుడు మోయుటలేదు అని కుమారుని దోషశిక్షను తండ్రి మోయడు. నీతిపరుని నీతి ఆ నీతిపరునికే చెందును. దుష్టుని దుష్టత్వము ఆ దుష్టునికే చెందును" (యెహెజ్కేలు 18:20). "అందుకు యేసు పాపము చేయు ప్రతివాడును పాపమునకు దాసుడని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను అనెను" (యోహాను 8:34). వ్యక్తిగతముగ మనము దేవునికి వ్యతిరేకముగా చేయునది పాపము. క్షమించబడని మీ పాపములు ఈనాడు మీకును మీ దేవునికిని, మీకును, పరలోకమునకును మధ్య అడ్డముగా నిలబడియున్నవి. పాపవిమోచన పొందవలెనంటే యేసుక్రీస్తు తప్ప మరియే నిరీక్షణయు మానవజాతికి

ఈనాడు లేదు. పాపములోబడి నశించుచు, మరణించుచున్న వారిని వెదకి రక్షించుటకు వచ్చితిని అని యేసుక్రీస్తు చెప్పుచున్నాడు. మనలను తిరిగి దేవునియొద్దకు చేర్చు నిమిత్తము ఆయన సిలువపై తన పరిశుద్ధ రక్తమును విమోచన క్రయధనముగా నిచ్చియున్నాడు. అందువలన పాపములోబడి కృంగి కృశించుచున్న మనలనందరినీ ఆయన పిలుచుచున్నాడు. "ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్త జనులారా, నాయొద్దకు రండి. నేను మీకు విశ్రాంతి కలుగజేతును. నేను సాత్వికుడను. దీనమనస్సు గలవాడను, గనుక మీ మీద నా కాడి ఎత్తికొని నాయొద్ద నేర్చుకొనుడి. అప్పుడు మీ ప్రాణములకు విశ్రాంతి దొరకును. ఏలయనగా నా కాడి సుళువును, నా భారము తేలికగాను ఉన్నవి" (మత్తయి 11:28). నీవు ఆయన పిలుపును ఈరోజున వినగల్గితివి గనుక ఆయన కోరు రీతిగ ఆయన దేవుని కుమారుడు అని నీ హృదయమందు విశ్వాసముంచుము. మనము ఆయన యందు విశ్వాసముంచని యెడల మన పాపములోనే నశింతుము అని ఆయన చెప్పుచున్నాడు. అటు తరువాత పాపముల విషయమై మారుమనస్సు పొంది, ఆయన నామమును మనుష్యుల యెదుట ఒప్పుకొని, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందవలెనని ఆయన కోరుచున్నాడు. ఆయన మాటలను విని విధేయత చూపిన వారి పాపములను ఆయన తప్పక క్షమించును సుమా! గనుక ఆయనకు లోబడుటకు నీవు వెనుకాడవనియే నా విశ్వాసము (యోహా 8:24, లూకా 13:5, మత్త 10:32, అపో.కా. 2:38).



# 10. మానవునికి అవసరమయిన విమోచన

## (MAN'S NEED OF REDEMPTION)

మానవుడు దేవుని స్వభావమందు, దేవుని పోలిక చొప్పున చేయబడినవాడు. దేవుడు భౌతిక కాయుడు కాదు. ఆయన ఆత్మీయుడు ఆత్మయై యున్నవాడు. అందువలన మానవుడు దేవుని ఆత్మీయ స్వరూపములో చేయబడినవాడు. మానవుడు యోచనాశక్తి, జ్ఞానము, భావములు, ఇచ్ఛ, వాంఛ, నిశ్చయత మొదలగు గుణములను కలిగినవాడు. అతడు బాధ్యతాయుక్తుడు, మంచి చెడ్డల నెరిగినవాడు. వాటి విచక్షణను ఎరిగినవాడు, అంతరాత్మను, మనసాక్షిని గలవాడు.

అయితే మానవుడు అనేకసార్లు తన మనస్సాక్షికిని, తన దేవునికిని అవిధేయత చూపుటకు నిశ్చయించుకొనుట జరుగుచున్నది. మానవజాతి యంతటిలోను మొదటి స్త్రీ పురుషులు ఆదాము, హవ్వలు పాపము నారంభించిరి. వారు దేవుని యెడల చూపిన అవిధేయత యందు మానవులందరు కొనసాగుచునే యున్నారు. "ఇందును గూర్చి వ్రాయబడిన దేమనగా – నీతిమంతుడు లేడు, ఒక్కడును లేడు, గ్రహించు వాడెవడును లేడు. దేవుని వెదుకువాడెవడును లేడు. అందరును త్రోవతప్పి యేకముగా పనికిమాలిన వారైరి. మేలు చేయువాడు ఒక్కడైనను లేడు". "ఏ బేధమును లేదు. అందరును పాపము చేసి దేవుడు అనుగ్రహించు మహిమను పొందలేక పోవుచున్నారు" (రోమా 3:10, 23). మానవులు పాపము చేయుటచే కలుగు జీతము భౌతిక, ఆత్మీయ మరణములై యున్నవి (రోమా 6:23).

మానవుడు పాపము చేయుటవలన శాపమునకు లోనై యున్నాడు.

– మరణము. “ధర్మశాస్త్రము విధించిన క్రియలకు సంబంధులందరు శాపమునకు లోనైయున్నారు. ఎందుకనగా ధర్మశాస్త్ర గ్రంథమందు వ్రాయబడిన విధులన్నియు చేయుట యందు నిలకడగా ఉండని ప్రతివాడును శాపగ్రస్తుడు అని వ్రాయబడియున్నది” (గలతి 3:10, 11). ఈ శాపము నుండి దేవుని సహాయము లేనిదే మానవుడు తనకు తాను విడుదల పొందలేడు. “పాపము చేయు ప్రతివాడును పాపమునకు బానిసయైయున్నాడు” అని యేసు చెప్పెను (యోహాను 8:34). అందువలన ఈ పాపపు బానిసత్వము నుండి విడిపించుటకు మానవునికి ఒక సహాయకారి, విమోచనకర్త, రక్షకుడు విడుదల చేయించువాడు అవసరమై యున్నాడు. మానవులందరు పాపులేయని మనం అంగీకరించక తప్పదు.

పాపమును మనం వారసత్వపు హక్కువలె సంపాదించుకొనము గాని ఇతరులు చేసిన పాపమునకు ప్రతిఫలము ఒక్కోసారి మనం అనుభవించుట జరుగును. ఒకడు దొంగతనము చేయుటవలన జైలులో వేయబడెననుకొందాము. దొంగతనం చేసినందున శిక్ష అతనికే విధింపబడును. శిక్షను భరించువాడు కూడా అతడే. గాని తన పిల్లలు అయితే ఇంటివద్ద ఉండి తినడానికి తిండి లేక బాధపడుతూ యుంటారు. మరలా, పిల్లలు దొంగలు కాకపోయినను, తండ్రి చేసిన పనినిబట్టి పిల్లలు కూడా సిగ్గును భరించవలసి వచ్చును. ఇందు విషయమై బైబిలు చెప్పునదేమంటే, “పాపము చేయువాడే మరణము పొందును. తండ్రి యొక్క దోష శిక్షను కుమారుడు మోయుటలేదని, కుమారుని దోషశిక్షను తండ్రి మోయడు. నీతిపరుని నీతి ఆ నీతిపరునికే చెందును. దుష్టుని దుష్టత్వము ఆ దుష్టునికే చెందును” (యెహెజ్కేలు 18:20). మనము



చేయు పాపమునకు మనము బాధ్యులము. “అయితే నీవు నీ సహోదరునికి తీర్పు తీర్చనేల? నీ సహోదరుని నిరాకరింపనేల? మన మందరము దేవుని న్యాయపీఠము ఎదుట నిలుతుము. నాతోడు, ప్రతి మోకాలును నా యెదుట వంగును, ప్రతి నాలుకయు దేవుని స్తుతించును అని ప్రభువు చెప్పుచున్నాడు” అని వ్రాయబడియున్నది. కనుక మనలో ప్రతివాడును తన్ను గూర్చి దేవునికి లెక్క యొప్పగింపవలెను” (రోమా 14:10–12). ఆదాము హవ్వలు పాపము చేసినప్పుడు, ఆదాము హవ్వను నిందించెను. హవ్వ సర్పమును నిందించెను. అయితే దేవుడు ఆ ముగ్గురిని నిందించి శిక్షించెను.

దేవుని ఆజ్ఞను అతిక్రమించుట పాపము. దేవుని ఆజ్ఞలకు మరికొంత కలుపుటగాని, తీసివేయుటగాని పాపము (ద్వితీ 4:2, ప్రకటన 22:18–19). దేవుని చిత్తమును జరిగించకుండ యుండి ఆయనపై తిరుగుబాటు చేయుట పాపము (రోమా 2:4–7, మత్తయి 7:21). దేవుని ఆజ్ఞల స్థానముననే మరొకటి చేయుట పాపము (మార్కు 7:7–9). మేలైనది చేయనెరిగియు ఆలాగున చేయనివానికి పాపము కలుగును (యాకోబు 4:17). దేవుని వాక్యమును సరిగ గ్రహింపక దానిని అపార్థము చేసికొని, మార్పుచేసి, దుర్భోధలను బోధించుట పాపము (2 పేతురు 3:16). దేవుని వాక్యము విషయమై అజ్ఞానము కలిగియుండుట పాపము (లేవీ 5:17, అపో.కా. 17:30). దేవుని ఆజ్ఞలను విని మనకు ఇష్టము వచ్చిన వాటికి లోబడి మిగిలిన వాటిని నిర్లక్ష్యము చేసిన యెడల అది మనకు పాపము. “నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును” అని యేసు చెప్పినప్పుడు మనం నమ్మినంత మాత్రముననే రక్షణ పొందగలము అని అనుకొనుటగాని, అట్లు బోధించుటగాని పాపము. బాప్తిస్మము పొందుటకు

నాకు ఇష్టము లేదు గనుక నేను నమ్ముదును గాని బాప్తిస్మమును పొందను అని తలంచుట పాపము. దయ్యములును యేసును నమ్మి వణుకుచున్నవి. అయితే అవి రక్షింపబడగలవా? (యాకో 2:9). మనకు వర్తించని ఆజ్ఞలకు విధేయత చూపుట కూడా పాపము కాగలదు. మనం ఇప్పుడు క్రీస్తు యుగంలో యున్నాము గనుక క్రొత్త నిబంధన ప్రకారము నడుచుకొనవలెను. గాని మోషే ధర్మశాస్త్రమును బట్టికాదు. క్రీస్తు సంఘము స్థాపించబడిన ఆరంభములో "కొందరు యూదయ నుండి వచ్చి మోషే నియమించిన ఆచారము చొప్పున సున్నతి పొందితేనేగాని రక్షణ పొందలేరని బోధించిరి" (అపో.కా. 15:1). అప్పుడు అపోస్తలులును, పెద్దలును ఈ సంగతిని గూర్చి ఆలోచించుటకు కూడి వచ్చిరి. బహుతర్కము జరిగిన తరువాత పేతురు లేచి వారితో ఇట్లనెను. "మన పితరులైనను, మనమైనను మోయలేని కాడిని శిష్యుల మెడమీద పెట్టి మీరెందుకు దేవుని శోధించుచున్నారు? ప్రభువైన యేసు కృపచేత మనము రక్షణ పొందుదుమని నమ్ముచున్నాము గదా?" (అపో.కా. 15:10-11).

పాపమువలన కలుగు ఫలితమేమి? భరింపరాని సిగ్గు కలుగును. ఆదాము హవ్వలు పాపము చేసి చెట్ల చాటున దాగుకొనిరి-సిగ్గు వలన. పాపమువలన బహు పిరికితనము వచ్చును. "ఎవరు తరుమకుండగనే దుష్టుడు పారిపోవును. నీతిమంతులు సింహమువలె ధైర్యముగా నుందురు" అని బైబిలు బోధించుచున్నది (సామెతలు 28:1). పాపము అంధత్వమును, అజ్ఞానమును కలుగజేయును, మనుష్యులను వాత వేయబడిన మనస్సాక్షి గలవారగునట్లు తయారు చేయును. వారిని బానిసలుగా చేసికొని సంకెళ్ళతో బంధించును. మానవులను నిస్సారముగ తయారు చేయును. మానవులను దేవుని నుండి వేరుచేయును. "మీ దోషములు మీకును మీ



దేవునికిని అడ్డముగా వచ్చెను. మీ పాపములు ఆయన ముఖమును మీకు మరుగుపరచెను" అని యెషయా ప్రవక్త వ్రాసెను (యెష 59:1-2). పాపము వలన దేవుని ఉగ్రత మనపై వచ్చును. "దుర్నీతి చేత సత్యమును అడ్డగించు మనుష్యుల యొక్క సమస్త భక్తి హీనత మీదను దుర్నీతి మీదను దేవుని కోపము పరలోకము నుండి బయలుపరచబడుచున్నది" (రోమా 1:18). చివరకు పాపము నుండి విముక్తి పొందలేనివారికి నిత్య నరకము తథ్యము. "ఎవని పేరైనను జీవగ్రంథమందు వ్రాయబడినట్లు కనబడనియెడల వాడు అగ్ని గుండములో పడవేయబడును" (ప్రకటన 20:15).

పాపము చేయు ప్రతివాడును పాపమును దాచిపెట్టుటకు ప్రయత్నం చేయును. "అతిక్రమములను దాచిపెట్టువాడు వర్ధిల్లడు. వాటిని ఒప్పుకొని విడిచిపెట్టువాడు కనికరము పొందును" అని దేవుని వాక్యము చెప్పుచున్నది (సామె 23:13). అయితే పాపములను మానవులు ఎందుకు దాచిపెట్టుదురు? మానవులు సహజంగా ప్రేమింపబడాలనే ఆశ కలిగినవారు. వారు దేవునిచేగాని, తోటి మానవులచేగాని తిరస్కరింపబడడానికి భయపడుదురు. అందువలన పాపమును సాధ్యమైనంత మట్టుకు దాచిపెట్టుదురు. అయితే యెహోవా కనుదృష్టికి మరుగైనది ఏదియునులేదు. సరిగదా ఎవరి పాపము వారిని పట్టుకొనును అని దైవగ్రంథము బోధించుచున్నది (సంఖ్యా 32:23). మన పాపము ఎల్లప్పుడు మన యెదుటే ఉండును (కీర్తన 51:6). గనుక మనం ఏమి విత్తుదుమో ఆ పంటనే కోయుదమనెడి భీతి మనలో లేకపోలేదు. అందువలన పాపమువలన వచ్చు శిక్ష నుండి తప్పించుకొనవలెననెడి ఆశ కలిగి యున్నవారము, మానవులైన మనము. మనం దినదినము చేయుచున్న పాపముల భారము మరింత ఎక్కువగుటచే పాపము నుండి

విముక్తిని పొందుట యెట్లు? నా ఆత్మశుద్ధిని చిత్తశుద్ధిని సాధించుట యెట్లు? మోక్షమునకు చేరగల్గుట యెట్లు అని మనలో ప్రతివారు తప్పక ఆలోచించుట జరుగుచున్నది. అయితే మనలను మోక్ష రాజ్యమునకు నడిపించు రక్షకుడు ఒకే ఒక్కడున్నాడు. ఆయన యేసుక్రీస్తు. "క్రీస్తుకూడ మీ కొరకు బాధపడి, మీరు తన అడుగుజాడల యందు నడచుకొనునట్లు మీకు మాదిరి యుంచి పోయెను. ఆయన పాపము చేయలేదు. ఆయన నోటను ఏ కపటమును కనబడలేదు. ఆయన దూషింపబడియు బదులు దూషింపలేదు. ఆయన శ్రమ పెట్టబడియు బెదిరింపక న్యాయముగా తీర్పుతీర్చు దేవునికి తన్ను తాను అప్పగించుకొనెను. మనము పాపముల విషయమై చనిపోయి, నీతి విషయమై జీవించునట్లు ఆయన తాను తన శరీరమందు మన పాపములను మ్రానుమీద మోసికొనెను. ఆయన పొందిన గాయముల చేత మీరు స్వస్థత నొందితిరి. మీరు గొర్రెలవలె దారి తప్పిపోతిరిగాని ఇప్పుడు ఆత్మల కాపరియు, అధ్యక్షుడునైన ఆయనవైపు మళ్ళియున్నారు" అని పేతురు వ్రాయుచున్నాడు (1 పేతురు 2:21-25).

ప్రయాసపడి పాపభారము మోసికొనుచున్న సమస్తమైన వారలారా, నాయొద్దకు రండి అని యేసుక్రీస్తు మిమ్మును పిలుచుచున్నాడు. నేడు మీరు ఆయన పిలుపును అంగీకరించిన యెడల, ఆయనయందు విశ్వాసముంచి, మార్పునొందిన జీవితాన్ని జీవించుటకు నిశ్చయించుకొని ఆయన నామమును బట్టి ప్రార్థనచేసి, బాప్తిస్మము పొంది, మీ పాపములను కడిగి వేసికొనండి. అప్పుడు మీకు శాంతి సమాధానములు తప్పక లభించును (యోహా 14:1, రోమా 2:4, అపో.కా. 22:16).



# 11. క్రీస్తు ద్వారా దేవుని విమోచన మార్గము
## (GOD'S PLAN OF REDEMPTION THROUGH CHRIST)

ఇంతకుముందు మీరు చదివిన రేడియో పాఠములలో మానవునియొక్క పతనము మీకు తెలియజేయబడినది. మానవుడు స్వాభావికముగా పాపియై యున్నాడు. అతడు పాపమునకు బానిస అయిపోయి వున్నాడు. అతడు దానికి బానిస గనుక తనకు తానే విడుదల పొందలేని స్థితిలో యున్నాడు. దేవుని న్యాయ చట్టప్రకారం అతడు మరణించుటకు శపించబడిన వాడైయున్నాడు. దేవుడు విధించు ఈ శిక్ష బహు న్యాయమైనది. దేవుడే దానిని విధించెను గనుక అది న్యాయమైనది.

అయితే దేవుడు మానవుని యెడల ప్రేమ కలిగినవాడైయున్నాడు. ఆయన ప్రేమ బహులోతైనది. మానవుడు పాపమువలన మరణించుటకు సిద్ధముగా యుంటే దేవుడు అతనియెడల జాలి కలిగినవాడై యున్నాడు. ఆయన సృష్టించిన మనుష్యుల యెడల ఆయన కరుణ కలిగినవాడై యున్నాడు. అందువలన మానవుడు మరణించకుండగా, పాపపు శిక్ష నుండి తొలగించబడుటకు దేవుడే ఒక మార్గమును అతనికొరకు నెలకొల్పెను. అది యేసుక్రీస్తు ద్వారా ఆయన మానవులకిచ్చిన విమోచన మార్గము. ఈరోజు మనం ఆ విమోచన మార్గమును గూర్చి కొంత తెలిసికొందాం.

మానవుని విమోచించు నిమిత్తము ఆయన జగత్తు పునాది వేయబడక మునుపే ప్రేమచేత క్రీస్తులో నిర్ణయించుకొనెను. (ఎఫెసీ 1:4). ఆదాము హవ్వలు పాపములో బడగానే, వారిని విమోచించు మార్గమును దేవుడు వారికే తెలియపరచెను. ఆయన సర్పమును శపించుచు, "మరియు స్త్రీకిని, నీ సంతానమునకును ఆమె సంతానమునకును వైరము

కలుగజేసెదను. నిన్ను తలమీద కొట్టును, నీవు దానిని మడిమె మీద కొట్టుదువని" చెప్పెను (ఆది 3:15). సాతాను యొక్క బలమును, అంటే మరణమును జయించినవాడే యేసుక్రీస్తు. ఆయన కన్యయైన మరియకు జన్మించిన స్త్రీ సంతానము.

అబ్రహాముకు దేవుడు ఈ విమోచన మార్గమును బయలపరచెను: "మరియు నీవు నామాట వినినందున భూలోకములోని జనములన్నియు నీ సంతానము వలన ఆశీర్వదించబడును" అని యెహోవా అబ్రహాముకు ప్రమాణము చేసెను (ఆది 22:18). "ఆయన అనేకులను గూర్చి అన్నట్లు – సంతానములకును అని చెప్పక ఒకని గూర్చి అన్నట్లే – నీ సంతానమునకును అనెను. ఆ సంతానము క్రీస్తు" (గలతీ 3:16)

ప్రవక్తల ద్వారా దేవుడు తన విమోచన మార్గాన్ని ప్రజలకు తెలియపరచెను. యెషయా ప్రవక్త ఇట్లు చెప్పుచున్నాడు : "కాబట్టి ప్రభువు తానే యొక సూచనను మీకు చూపును. ఆలకించుడి, కన్యక గర్భవతియై కుమారుని కని అతనికి ఇమ్మానుయేలను పేరు పెట్టును" (యెషయా 7:14). "ఏలయనగా మనకు శిశువు పుట్టెను. మనకు కుమారుడు అనుగ్రహింపబడెను. ఆయన భుజము మీద రాజ్యభారముండును. ఆశ్చర్యకరుడు, ఆలోచనకర్త బలవంతుడైన దేవుడు, నిత్యుడగు తండ్రి, సమాధానకర్తయగు అధిపతియని అతనికి పేరు పెట్టబడును" (యెష 9:6) అని ప్రవక్తలు ప్రవచించిరి.

దేవుడు పంపించబోవు విమోచనకర్తను గూర్చి చెప్పబడిన ఈ సంగతులన్నియు యేసుక్రీస్తు యొక్క రాకడయందు నెరవేరినవి.

క్రీస్తు ఈ లోకములో జన్మించగానే ఆయనే లోకరక్షకుడు అని



చాటించబడెను. గొర్రెల కాపరులు పొలములో ఉండి తమ మందను కాచుకొనుచుండగా ప్రభువు దూత – "భయపడకుడి, ఇదిగో ప్రజలందరికిని కలుగబోవు మహా సంతోషకరమైన సువర్తమానము నేను మీకు తెలియజేయుచున్నాను. దావీదు పట్టణమందు నేడు రక్షకుడు మీకొరకు పుట్టియున్నాడు. ఆయన ప్రభువైన క్రీస్తు" అని వారికి చెప్పెను.

యేసుక్రీస్తు చేసిన బోధలనుబట్టి ఆయనే రక్షకుడు అని మనం గ్రహించగలము. ఇదిగో ఈయనే లోకపాపమును మోసికొనిపోవు దేవుని గొర్రెపిల్ల అని యేసునుగూర్చి యోహాను సాక్ష్యమిచ్చెను. "దేవుడు లోకము నెంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టినవానియందు విశ్వాస ముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను. లోకము తన కుమారుని ద్వారా రక్షణ పొందుటకేగాని లోకమునకు తీర్పు తీర్చుటకు దేవుడాయనను లోకములోనికి పంపలేదు". "నామాట విని నన్ను పంపిన వానియందు విశ్వాసముంచువాడు నిత్యజీవము గలవాడు. వాడు తీర్పులోనికి రాక మరణములో నుండి జీవములోనికి దాటియున్నాడు". "లేఖనములయందు మీకు నిత్యజీవము కలదని తలంచుచు వాటిని పరిశోధించుచున్నారు. అవే నన్ను గూర్చి సాక్ష్యమిచ్చుచున్నవి". "పునరుత్థానమును జీవమును నేనే. నాయందు విశ్వాసముంచువాడు చనిపోయినను బ్రదుకును. బ్రతికి నాయందు విశ్వాసముంచు ప్రతివాడును ఎన్నటికిని చనిపోడు". "నేను లోకమునకు తీర్పు తీర్చుటకు రాలేదుగాని లోకమును రక్షించుటకే వచ్చితిని"యని యేసు బోధించెను (యోహాను 3:16, 17, 5:24, 39-40, 11:25, 36, 12:47). గనుక ఆయన చేసిన గంభీరమైన బోధలను బట్టి కూడా మనం ఆయనే రక్షకుడు అని గ్రహించగలము.

యేసుక్రీస్తు యొక్క మరణము ద్వారా ఆయన రక్షకుడు అని మనకు విశదీకరించబడినది. ఆయన తన రక్తమునుద్దేశించి, "ఇది నా రక్తము అనగా పాపక్షమాపణ నిమిత్తము అనేకుల కొరకు చిందింప బడుతున్న నిబంధన రక్తము" అని చెప్పెను. "యెరూషలేము మొదలుకొని సమస్త జనములలో ఆయన పేరట మారుమనస్సును, పాపక్షమాపణయు ప్రకటింపబడును అని వ్రాయబడియున్నది". "నీతిమంతుని కొరకు సహితము ఒకడు చనిపోవుట అరుదు. మంచివానికొరకు ఎవడైన ఒకవేళ చనిపోవ తెగింపవచ్చును. అయితే దేవుడు మనయెడల తన ప్రేమను వెల్లడిపరచుచున్నాడు. ఎట్లనగా మనమింకను పాపులమై యుండగానే క్రీస్తు మనకొరకు చనిపోయెను. కాబట్టి ఆయన రక్తము వలన ఇప్పుడు నీతిమంతులముగా తీర్చబడి, మరింత నిశ్చయముగా ఆయన ద్వారా ఉగ్రత నుండి రక్షింపబడుదుము" (మత్తయి 26:28, లూకా 24:47, రోమా 5:8,9)

యేసుక్రీస్తు ప్రవచింపబడిన రీతిగ ఒక కన్యకు జన్మించెను. ఆయన నీతిని బోధించెను. ఏ పాపము లేకయే పాపము కొరకై మరణించెను. లేఖనముల ప్రకారము ఆయన సమాధిని జయించి తిరిగి లేచెను. గనుక దేవుని కుమారుడని, లోక రక్షకుడని మహిమా ప్రభావములతో నిరూపింపబడెను. విమోచనకర్తను అనుగ్రహించెదను అని దేవుడు చేసిన వాగ్దానముల నన్నిటిని యేసుక్రీస్తు ద్వారా మనము మనకు సంభవింపబోవు ఉగ్రత నుండి తప్పించుకొను మార్గమును దేవుడు బయలుపరచెను. గనుక మానవునికి మేలు సంభవించెను.

దేవుని ధర్మశాస్త్రము పరిశుద్ధమైనది. దానికి వ్యతిరేకముగా



ప్రవర్తించువానిని అది శిక్షించును. "ఎవడైనను ధర్మశాస్త్ర మంతయును గైకొని, ఒక ఆజ్ఞవిషయములో తప్పిపోయిన యెడల, ఆజ్ఞలన్నిటి విషయములో అపరాధియగును'' (యాకోబు 2:10). దేవుడు యథార్థవంతుడు గనుక ఆయన చట్టము నుల్లంఘించినవారిని ఆయన సహింపజాలడు. అట్లయిన ప్రతి మనుష్యుడు కూడ శిక్షింపబడవలెను గదా. ఆ శిక్ష మరణమేగదా. అయితే దేవుడు మానవుని ప్రేమించు చున్నాడు. మానవుడు పాపమువలన వచ్చు శిక్ష నుండి తప్పించబడవలె నంటే అతనికి బదులుగా మరియొకడు ఆ శిక్షను భరించవలసియున్నది. అవును యేసు ప్రభువునే దేవుడు మనకు బదులుగా మనందరి పాపముల నిమిత్తమై శిక్షించెను. ''మన యతిక్రమ క్రియలనుబట్టి ఆయన గాయపరచబడెను. మన దోషములనుబట్టి నలుగగొట్టబడెను. మన సమాధానార్థమైన శిక్ష ఆయన మీద పడెను". "ఏలయనగా మరణము నొందునట్లు అతడు తన ప్రాణమును ధారపోసెను. అతిక్రమము చేయువారిలో ఎంచబడినవాడాయెను. అనేకుల పాపమును భరించుచు తిరుగుబాటు చేసినవారిని గూర్చి విజ్ఞాపనము చేసెను" (యెషయా 53:5-12). "ఎందుకనగా మనమాయన యందు దేవుని నీతి అగునట్లు పాపమెరుగని ఆయనను మన కోసము పాపముగా చేసెను" (2 కొరింధి 5:21).

నిజానికి మన ఒక్కొక్కనిపై రావలసిన మరణశిక్షను యేసుక్రీస్తు తన సిలువలో మనందరి కొరకు భరించెను. దేవుని కృపవలన ప్రతి మనుష్యుని కొరకు ఆయన మరణము ననుభవించి దేవుని ప్రేమను, కృపను మనయెడల వ్యక్తపరచెను.

దేవుడు పాపమును ద్వేషించి, పాపిని ప్రేమించుచున్నాడు. అందువలన నశించుచున్న ఈ పాపిని ఆయన రక్షింపవలెనని కోరుచున్నాడు. దేవుడు యథార్థవంతుడు. అందువలన ఆయన పాపిని నీతిమంతునిగా ఎంచుచూ తన యథార్థతను నెలకొల్పు విధానమును కనుగొనెను. మనందరి పాపముల నిమిత్తమై యేసుక్రీస్తుని బలియిచ్చి ఆయన మరణ పునరుత్థానముల ద్వారా మనలను నీతిమంతులనుగా ఎంచుటకు ఆయన నిశ్చయించుకొనెను. దేవుని యెదుట పాపులమైన మనము నీతిమంతులముగా తీర్చబడవలెనంటే, యేసుక్రీస్తు నందు విశ్వాసముంచి, మనకు బదులుగా ఆయన అర్పించబడెను అని మనము అంగీకరించవలెను.

యేసుక్రీస్తుకు మనయెడల ఉన్న ప్రేమ, కరుణ, కటాక్షములు గొప్పవి. అందువలననే ఆయన దేవుడై యుండియు నరావతారుడై నరులను రక్షించుటకు ఈ లోకమునకు వచ్చెను. నరావతారుడై యుండియు ఏ పాపమును చేయకుండగ పరిపూర్ణ జీవితమును జీవించెను. అందువలన పాపమునకు విరుగుడుగా పరిపూర్ణ బలియాగముగా తన్ను తాను అర్పించుకొనగలిగెను. భక్తుడైన పౌలు ఇట్లు చెప్పుచున్నాడు. "క్రీస్తు యేసునకు కలిగిన యీ మనస్సు మీరును కలిగియుండుడి. ఆయన దేవుని స్వరూపము కలిగినవాడై యుండి, దేవునితో సమానముగా ఉండుట విడిచిపెట్టకూడని భాగ్యమని యెంచుకొనలేదు గాని, మనుష్యుల పోలికగా పుట్టి, దాసుని స్వరూపము ధరించుకొని, తన్ను తానే రిక్తునిగా చేసికొనెను. మరియు ఆయన ఆకారమందు మనుష్యునిగా కనబడి, మరణము పొందునంతగా అనగా సిలువ మరణము పొందునంతగా విధేయత చూపినవాడై తన్ను తాను తగ్గించుకొనెను" (ఫిలిప్పీ 2:5-8).



యేసు మరణించి పునరుత్థానుడై లేచుటతో దేవుడు మనయెడల ఏర్పరచిన విమోచన కార్యక్రమము సంపూర్ణమాయెను. క్రీస్తు మృతులలో నుండి లేపబడియున్నాడు. మనుష్యుని ద్వారా మరణము వచ్చెను గనుక మనుష్యుని ద్వారానే మృతుల పునరుత్థానము కలిగెను. ఆదామునందు అందరు ఏలాగు మృతిపొందుచున్నారో, అలాగుననే క్రీస్తునందు అందరు బ్రతికింపబడుదురు" (2 కొరింథి 15:20-22).

మనము యేసునుగూర్చిగాని, ఆయన క్షమాపణ మార్గమును గూర్చిగాని వినలేనియెడల దేవుడు మనయెడల చూపిన కృప వ్యర్థమగును. మనము పాపము నుండి విమోచన పొందవలెనంటే యేసుక్రీస్తు ఆజ్ఞలను గైకొనవలెను. "నన్ను నిరాకరించి నా మాటలను అంగీకరింపనివానికి తీర్పు తీర్చు వాడొకడు కలడు. నేను చెప్పిన మాటయే అంత్యదినమందు అతనికి తీర్పు తీర్చును" అని యేసు చెప్పెను (యోహాను 12:48). ఆయన యేమి చెప్పుచున్నాడు? యేసు దేవుని కుమారుడు అని నమ్మవలెనని చెప్పుచున్నాడు. మనం చేసిన పాపముల నిమిత్తము మారుమనస్సు పొందవలెనని చెప్పుచున్నాడు. ఆయన నామమును మనుష్యుల యెదుట ఒప్పుకొని, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుము అని చెప్పుచున్నాడు. మీరు యేసు మాటలను విని ఆయన చెప్పురీతిగ చేయుదురని నా అభిలాష, నా ప్రార్థనయును.

# 12. కృప ద్వారా విశ్వాసము వలన రక్షణ
## (SALVATION BY GRACE THROUGH FAITH)

మృతులలో నుండి సజీవుడై లేచిన యేసు ప్రభువుని సేవించుటకు దేవుడు మనలను పిలుచుచున్నాడు. ఎంత ఘోర పాపినైనను యేసు రక్షించును. అయితే మనము యేసును ప్రభువుగాను, రక్షకునిగాను అంగీకరించుటకు ఇష్టపడవలెను.

యేసుప్రభువు దయచేయు రక్షణ ఆయన కృపవలన మనకు ఇచ్చుచున్నాడు. మనం ఈనాడు రక్షింపబడవలె నంటే క్రీస్తు ద్వారానేగాని ధర్మశాస్త్రము వలన కాదు. పౌలు ఇట్లు చెప్పుచున్నాడు. "నేను దేవుని కృపను నిరర్థకము చేయను. నీతి ధర్మశాస్త్రము వలనైతే ఆ పక్షమందు క్రీస్తు చనిపోయినది నిష్ప్రయోజనము" (గలతి 3:21). ధర్మశాస్త్రము ద్వారా రక్షణ పొందవలెనని కోరువాడు ధర్మశాస్త్రము నంతటియందు పరిపూర్ణముగ నిలుకడగా యుండవలెను. "ధర్మశాస్త్రము విధించిన క్రియలకు సంబంధులందరు శాపమునకు లోనైయున్నారు. ఎందుకనగా – ధర్మశాస్త్ర గ్రంథమందు వ్రాయబడిన విధులన్నియు చేయుటయందు నిలుకడగా ఉండని ప్రతివాడును శాపగ్రస్తుడు అని వ్రాయబడియున్నది'' (గలతి 3:10) "ధర్మశాస్త్రము వినువారు దేవుని దృష్టికి నీతిమంతులు కారుగాని, ధర్మశాస్త్రమును అనుసరించి ప్రవర్తించువారే నీతిమంతులుగా ఎంచబడుదురు" (రోమా 2:13). విశ్వాసము లేకుండా మన క్రియలను బట్టి మాత్రమే మనము రక్షింపబడగల్గిన యెడల దేవుని యెదుట మనము అతిశయించడానికి వీలుండునుగదా!

అయితే ధర్మశాస్త్రమును పరిపూర్ణముగ అనుసరించ గలిగినవాడు



ఎవడును లేడు. అందరును ధర్మశాస్త్రమును అతిక్రమించి పాపమునకు లోనైయున్నారు. "నీతిమంతుడు లేడు, ఒక్కడును లేడు, గ్రహించు వాడెవడును లేడు, దేవుని వెదకువాడెవడును లేడు" (రోమా 3:10,11). "ఏ భేదమును లేదు, అందరును పాపము చేసి దేవుడు అనుగ్రహించు మహిమను పొందలేక పోవుచున్నారు" (రోమా 3:23). "ధర్మశాస్త్ర సంబంధమైన క్రియల మూలముగా ఏ మనుష్యుడును ఆయన దృష్టికి నీతిమంతుడని తీర్చబడడు. ధర్మశాస్త్రము వలన పాపము అనగా ఎట్టిదో తెలియబడుచున్నది" (రోమా 3:20). "మనుష్యుడు యేసుక్రీస్తునందలి విశ్వాసము వలననేగాని ధర్మశాస్త్ర సంబంధమైన క్రియలమూలమున నీతిమంతుడుగా తీర్చబడడని యెరిగి మనమును ధర్మశాస్త్ర సంబంధమైన క్రియల మూలమునగాక క్రీస్తునందలి విశ్వాసము వలననే నీతి మంతులమని తీర్చబడుటకై యేసు క్రీస్తునందు విశ్వాసముంచి యున్నాము. ధర్మశాస్త్ర సంబంధ క్రియల మూలమున ఏ శరీరియు నీతిమంతుడని తీర్చబడడుగదా" అని పౌలు చెప్పుచున్నాడు (గలతి 2:15-16).

ధర్మశాస్త్రము వలన ఎవడును రక్షింపబడలేనందున, దేవునియొక్క కృపాకటాక్షము వలననే మనకు రక్షణ కలుగుచున్నది. అందుకు అపోస్తలుడైన పౌలు ఇట్లు చెప్పుచున్నాడు. "మీరు విశ్వాసము ద్వారా కృపచేతనే రక్షింపబడియున్నారు. ఇది మీ వలన కలిగినదికాదు. దేవుని వరమే. అది క్రియల వలన కలిగినది కాదు. గనుక ఎవడును అతిశయపడ వీలులేదు. మరియు వాటియందు మనము నడుచుకొనవలెనని దేవుడు ముందుగా సిద్ధపరచిన సత్క్రియలు చేయుటకై మనము క్రీస్తుయేసు నందు సృష్టించబడినవారమై ఆయన చేసిన పనియైయున్నాము" (ఎఫెసీ

2:8-10). మానవుడు తన క్రియల వలన మాత్రమే రక్షించుకొనజాలడు. అతడు రక్షింపబడవలెనంటే దేవుని కృపవలననేగాని, తన స్వనీతినిబట్టి కాదు.

దేవుడు తన కృపద్వారా మనకు రక్షణనిచ్చుచున్నాడు. అయితే ఆయన కృప షరతులు లేనిదికాదు. అది షరతుల మీద ఆధారపడి యున్నది. ఆయన కృప షరతులు లేనిదైతే అందరూ రక్షింపబడుదురు. ఆయన అనుగ్రహించు కృప షరతులతో కూడినది. ఆ కృపకు మనం పాత్రులము కావలెనంటే, మనము చేయవలసినవి, నిర్వర్తించవలసినవి కొన్ని సంగతులు ఉన్నవి. మానవుడు ఈనాడు రక్షింపబడవలెనంటే, ఆ రక్షణను దేవుడు తన కృపద్వారాను మానవుని విశ్వాసము ద్వారాను అనుగ్రహించుచున్నాడు. దేవుని యొక్క కృప అందరికొరకు ఉన్నది. అయితే అది విశ్వాసులకు మాత్రమే ప్రయోజనకారియగును.

మానవుడు రక్షింపబడవలనంటే అతడు దేవునియందు విశ్వాసముంచుట మాత్రమే కాదు, గాని తనకుగా తాను రక్షించుకొనలేని బలహీనుడను అని గ్రహించవలెను. అట్లు గ్రహించిన తరువాత అతడు మానవునికి బదులుగా అర్పింపబడిన క్రీస్తునందు సంపూర్ణమైన విశ్వాసముంచి, తన పాపములను విడనాడి, దేవునితట్టు తిరుగవలెను. అప్పుడు క్రీస్తునందున్న విశ్వాసమువలన విధేయతలను బట్టి దేవుని కృప రక్షించును. అవిధేయుని దేవుని కృప రక్షించదు.

ఆలాగని రక్షణ విశ్వాసము వలన మాత్రమే లభించును అని మనం తలంచరాదు. విశ్వాసము వలన మనం రక్షించబడుదుము. నిజమే. గాని విశ్వాసము ఒక్కటి మాత్రమే రక్షించుటలేదు. విధేయత చూపించు



విశ్వాసము వలన మనం రక్షించబడగలము. మనం పుణ్యకార్యములు చేసినంత మాత్రముననే రక్షించబడలేము. క్రీస్తునందలి విశ్వాసము లేకుండా అట్టి క్రియలు ఎన్నిచేసిన నిష్ప్రయోజనమే. మరల, మనలను దేవుని కృప రక్షించును. దానికి తిరుగులేదు. అయితే కృప ఒక్కటి మాత్రమే మనలను రక్షించదు. దేవుని పక్షమున కృప ఉన్నట్లయితే మానవుని పక్షమున విధేయత చూపించు విశ్వాసముండవలెను. అప్పుడు మాత్రమే మానవుడు క్రీస్తుయేసు నందలి విశ్వాసము ద్వారా దేవుని కృపవలన రక్షింపబడగలడు.

మనము రక్షింపబడవలెనంటే, దేవునికి పరిపూర్ణ విధేయత చూపు విశ్వాసము అవుసరము. ఆ విశ్వాసము ఆయన ఆజ్ఞలకు లోబడునట్టి విశ్వాసము అయి యుండవలెను. మానవుల రక్షణార్ధమై దేవుని కృప క్రీస్తుయేసు ద్వారా బయలుపరచబడెను. మానవుడైతే రక్షణ పొందుటకు క్రీస్తు ఆజ్ఞలకు లోబడవలెను. "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును" అని యేసు చెప్పెను (మార్కు 16:16). రక్షణ పొందవలెనంటే యేసును నమ్మవలెను. బాప్తిస్మము పొందవలెను అను షరతులను యేసు చెప్పుచున్నాడు. "మీరు మారు మనస్సు పొంది మీలో ప్రతివాడును పాపక్షమాపణ నిమిత్తము యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి అని అపో.కా. 2:38 చెప్పుచున్నది. బాప్తిస్మము పొందకముందు ఒకడు యేసు క్రీస్తునందు విశ్వాసముంచవలెను. మారు మనస్సు పొందవలెను అని మనకు అర్ధమగుచున్నది. అటు తరువాత రక్షణ కలుగునట్లు నోటితో యేసునందున్న విశ్వాసమును ఒప్పుకొనవలెనని వాక్యము చెప్పుచున్నది (రోమా 10:9-10). గనుక దేవుని కృపవలన మనం రక్షింపబడవలనంటే కనీసం మనం ఈ నాలుగు షరతులకు

లోబడవలెను - క్రీస్తు యేసు దేవుని కుమారుడు అని నమ్మవలెను. పాపముల విషయమై మారు మనస్సు పొందవలెను. యేసు, ప్రభువు అని నోటితో ఒప్పుకొనవలెను. పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందవలెను.

రక్షణ పొందుటకు యేసుక్రీస్తు నందు విశ్వాసముంచితేనే చాలును. మిగిలిన వాటిని ఏమియు చేయనవుసరం లేదు అని దయచేసి తలంచవద్దు. విశ్వాసము మాత్రమే మనలను రక్షించదు. ఆయన విధేయత చూపు విశ్వాసమును మనయొద్ద నుండి కోరుచున్నాడు. భక్తుడైన యాకోబు ఈ విధంగా చెప్పుచున్నాడు. "మీరు వినువారు మాత్రమైయుండి మిమ్మును మీరు మోసపుచ్చుకొనకుండ, వాక్యప్రకారము ప్రవర్తించువారునై యుండుడి. ఎవడైనను వాక్యమును వినువాడై యుండి దాని ప్రకారము ప్రవర్తింపని వాడైతే, వాడు అద్దములో తన సహజ ముఖమును చూచుకొను మనుష్యుని పోలియున్నాడు. వాడు తన్ను చూచుకొని అవతలికిపోయి తానెట్టివాడో వెంటనే మరచిపోవునుగదా?" (యాకోబు 1:22-24).

మనం రక్షణ పొందుటకు విశ్వాసము ఒక్కటి మాత్రమే చాలదు అని అతడు మరల ఇట్లనుచున్నాడు. "నా సహోదరులారా, క్రియలు లేనప్పుడు ఎవడైనను తనకు విశ్వాసము కలదని చెప్పినయెడల ఏమీ ప్రయోజనము? అట్టి విశ్వాసము అతనిని రక్షింపగలదా?". "ప్రాణము లేని శరీరము ఏలాగు మృతమో అలాగే క్రియలు లేని విశ్వాసము మృతము" (యాకోబు 2:14, 26).

గనుక మిత్రులారా, మీకున్న విశ్వాసము యెట్టిది? రక్షణ పొందగోరుచున్నారా? అయితే దేవుని కృప మిమ్మును రక్షించుటకు



సమృద్ధిగా యున్నది. మీరు మీ పాపముల నుండి రక్షించుకొనగోరుచున్నట్లయితే యేసునకు లోబడుచు విశ్వాసముతో ఆయన యొద్దకు రండి. నేడు అనేకులు యేసునందు రహస్యముగా విశ్వాసము కలిగినవారు ఉన్నారు. అనేకులు యేసును నమ్మి, బాప్తిస్మము పొందకుండాయున్నారు. అట్టివారు ముందుకు వచ్చి పౌలువలె తడవు చేయక, లేచి ఆయన నామమును బట్టి ప్రార్థన చేసి తమ పాపములను కడుగుకొనుడని ఆయన సెలవిచ్చుచున్నారు.

నేడు మీరు ఆయన ఆజ్ఞలకు లోబడుటకు సిద్ధముగా ఉన్నయెడల మీకు దగ్గరగాయున్న క్రీస్తుసంఘమును దర్శించండి. మీకు బాప్తిస్మమిచ్చుటకు వారు తగిన ఏర్పాట్లను తక్షణమే చేయగలరు. లేదా మీ కోరికను మాకు ఇప్పుడే ఒక ఉత్తరము వ్రాసి తెలియజేయండి.

దేవుని ప్రేమ, ఆయనయొక్క కృప మనయెడల విస్తరించుచుండగా, ఆయన పిలుపును మనం తిరస్కరించరాదు. ఆయన ఆహ్వానమును మీరు తప్పక అంగీకరిస్తారనియే నా విశ్వాసము.

# 13. రక్షణ పొందుటకు మానవుడు ఏమి చేయవలెను?

### (WHAT MUST MAN DO TO BE SAVED?)

మానవుడు పాపియని ఇంతకు ముందు పాఠములలో మనం గ్రహించితిమి. అతడు పాపపు బానిసయై యున్నట్లు కూడా మనం గమనించితిమి. అయితే పాపము నుండి విముక్తిపొందుట యెట్లు? మోక్షమునకు చేరుటకు నాకు ఉన్న మార్గమేమిటియని తనలో తాను తలంచుచునే యుంటాడు. రక్షణ పొందుటకు నేనేమీ చేయవలెను? అనే ప్రశ్నను మీరు కూడా అనేకసార్లు ఆలోచించుచూ యుంటారు. అవునుగదా!

పాపములో యుండి నశించుచున్న వారిని వెదకి రక్షించడానికి యేసుక్రీస్తు ఈ లోకమునకు వచ్చాడు. ఆయన దేవుడై యుండియు, నరులను రక్షించుటకు నరావతారియై ఈ లోకమునకు వచ్చాడు. ఆయన సిలువపై బలి అర్పింపబడుట ద్వారా దేవుడు పాపులను రక్షించుటలో తన విధిని నిర్వర్తించుకొన్నాడు. అయితే పాపియైన మానవుడు ఇప్పుడు రక్షింపబడవలెనంటే తన యెడల తనకున్న విధిని ఈ మానవుడు నిర్వర్తించవలెను. రక్షణపొందవలెను అంటే అది నిజానికి మానవునిలోనే యున్నది. "మూర్ఖులగు ఈ తరమువారికి వేరై రక్షణ పొందుడి" అని పేతురు హెచ్చరించుచున్నాడు. రక్షణను మానవుడు తనకుగా తాను సంపాదించుకొనలేడు. దేవుని కృప లేనిదే మానవుడు రక్షింపబడనేరడు అని మనం ఇదివరకొకసారి చెప్పుకున్నాము. మనం దానదాయ క్రియలు చేసి రక్షణను సంపాదించుకొనలేము. "మీరు విశ్వాసము ద్వారా కృపచేతనే రక్షింపబడియున్నారు. ఇది మీవలన కలిగినదికాదు, దేవుని వరమే అది క్రియల వలన కలిగినది కాదు గనక ఎవడును అతిశయపడ వీలులేదు"



అని పౌలు చెప్పుచున్నాడు (ఎఫెసి 2:8-9). మనం దేవుని కృపచేతనే రక్షింపబడుదుము. అయితే పాపియైన మానవుడు ఆ కృపను పొందుటకు దేవునికి విధేయత చూపవలెను. దేవునికి విధేయత చూపవలెనో లేదో అనునది మానవుని నిశ్చయతకు వదిలివేయబడినది. అతడు రక్షింపబడవలెనంటే దేవునికి విధేయత చూపుట అత్యవసరమని బైబిలు బోధించుచున్నది.

"ప్రభువా, ప్రభువా అని నన్ను పిలుచు ప్రతివాడును పరలోక రాజ్యములో ప్రవేశింపడుగాని, పరలోకమందున్న నా తండ్రి చిత్తప్రకారము చేయువాడే ప్రవేశించును" అని యేసు చెప్పెను (మత్త 7:21).

యేసుప్రభువు తనకు విధేయులైన వారందరికిని నిత్యరక్షణకు కారకుడాయెను (హెబ్రీ 5:10). గనుక ఈనాడు ఎవరైనను రక్షణ పొందవలెనంటే వారు యేసు క్రీస్తునందు విశ్వాసముంచి ఆయనకు విధేయులై యుండవలెను.

రక్షణపొందవలెనంటే మొదటిగా మనము యేసు క్రీస్తును దేవుని కుమారుడని విశ్వసింపవలెను. ఆయన దేవుని కుమారుడు అని నిరూపించుటకొరకు దేవుడే ఆయన ద్వారా అనేక అద్భుతములు, మహత్కార్యములు చేయించెను. "నేను ఆయనను (అనగా దేవుడను) అని మీరు విశ్వసింపని యెడల మీరు మీ పాపములోనే యుండి చనిపోవుదురు" అని యేసు చెప్పెను (యోహా 8:24). అయితే ఈ విశ్వాసము ఎట్లు కలుగును? అని మీరు అడగవచ్చును. "కాగా వినుట వలన విశ్వాసము కలుగును. వినుట క్రీస్తును గూర్చిన మాట వలన కలుగును" అని రోమా 10:17లో వ్రాయబడియున్నది. గనుక యేసును

గూర్చిన సువార్త వినుటవలన మనకు విశ్వాసము కలుగును తరువాత ఆయన వాక్యమును చదువుటద్వారా కూడా విశ్వాసము కలుగును. “మరియు అనేకమైన ఇతర సూచక క్రియలను యేసు తన శిష్యులయెదుట చేసెను. అవి యీ గ్రంథమందు వ్రాయబడియుండలేదు గాని, యేసు దేవుని కుమారుడైన క్రీస్తు అని మీరు నమ్మునట్లును, నమ్మి ఆయన నామమందు జీవము పొందునట్లును ఇవి వ్రాయబడెను” అని యోహాను సువార్త 20:30, 31 వచనములు చెప్పుచున్నవి.

గనుక రక్షణ పొందవలెనంటే ఒకడు దేవుని యందు, యేసు క్రీస్తునందు విశ్వాసము ఉంచవలెను. “విశ్వాసము లేకుండ దేవునికి ఇష్టుడైయుండుట అసాధ్యము. దేవుని యొద్దకు వచ్చువాడు ఆయన యున్నాడనియు, తన్ను వెదకువారికి ఫలము దయచేయు వాడనియు నమ్మవలెను” అని బైబిలు బోధించుచున్నది. “నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును. నమ్మనివానికి శిక్షవిధింపబడును” అని యేసు చెప్పెను (మార్కు 16:16).

విశ్వాసముంచిన తరువాత ఒకడు మారు మనస్సు పొందవలెనని యేసుక్రీస్తు చెప్పెను. “మీరు మారుమనస్సు పొందనియెడల మీరందరును నశింతురు” అని ఆయన చెప్పెను (లూకా 13:4). మారు మనస్సు అనగా యేమిటి? మారుమనస్సు అనగా - పాపముల విషయమై మనస్సును మార్చుకొనుటయే. పాపములను విసర్జించి, దేవుని సేవ చేయుదును అని నిశ్చయించుకొనుటయే, మారుమనస్సు. “దైవ చిత్తానుసారమైన దుఃఖము రక్షణార్థమైన మారుమనస్సును కలుగజేయును” అని అపోస్తులుడైన పౌలు వ్రాయుచున్నాడు (2 కొరింథి 7:10).



అందరు యేసు ప్రభువునందు విశ్వాసముంచవలెను అని దేవుడు ఎట్లు కోరుచున్నాడో, అట్లే తమ పాపముల విషయమై అందరూ మారుమనస్సు పొందవలెనని దేవుడు కోరుచున్నాడు. “కొందరు ఆలస్యమని యెంచుకొనునట్లు ప్రభువు తన వాగ్దానమును గూర్చి ఆలస్యము చేయువాడు కాడుగాని యెవడును నశింపవలెనని యిచ్ఛయింపక, అందరు మారుమనస్సు పొందవలెనని కోరుచు మీ యెడల దీర్ఘశాంతము గలవాడై యున్నాడు” అని అపో పేతురు చెప్పుచున్నాడు (2 పేతురు 3:9). “ఆ అజ్ఞాన కాలములను దేవుడు చూచి చూడనట్టుగా ఉండెను. ఇప్పుడైతే అంతటను, అందరును మారుమనస్సు పొందవలెనని మనుష్యులకు ఆజ్ఞాపించుచున్నాడు” (అపో.కా. 17:30). “మీరు మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి” అని పేతురు హెచ్చరించుచున్నాడు (అపో.కా 2:38).

ఒక అవిశ్వాసి ఎట్లు రక్షింపబడలేడో అట్లే తన పాపముల విషయమై మనస్సు మార్చుకొనలేని మనుష్యుడు రక్షింపబడ నేరడు. “దేవుని అనుగ్రహము మారుమనస్సు పొందుటకు నిన్ను ప్రేరేపించుచున్నదని యెరుగక ఆయన అనుగ్రహైశ్వర్యమును, సహనమును, దీర్ఘశాంతమును తృణీకరించుదువా? నీ కాఠిన్యమును, మార్పుపొందని నీ హృదయమును అనుసరించి, ఉగ్రతదినమందు, అనగా దేవుని న్యాయమైన తీర్పు బయలుపరచబడు దినమందు, నీకు నీవే ఉగ్రతను సమకూర్చుకొనుచున్నావు. ఆయన ప్రతి వానికి వానివాని క్రియల చొప్పున ప్రతిఫలమిచ్చును” అని దేవుని వాక్యము నిన్ను మరల ఈనాడు హెచ్చరించుచున్నది (రోమా 2:4-6).

రక్షణపొందవలెననిన యేసు ప్రభువు దేవుని కుమారుడు అని మనుష్యులయెదుట మనం ఒప్పుకొనవలెను. “యేసు ప్రభువని నీ నోటితో ఒప్పుకొని దేవుడు మృతులలో నుండి ఆయనను లేపెనని నీ హృదయమందు విశ్వసించిన యెడల నీవు రక్షింపబడుదువు. ఏలయనగా నీతికలుగునట్లు మనుష్యుడు హృదయములో విశ్వసించును, రక్షణ కలుగునట్లు నోటితో ఒప్పుకొనును” అని పరిశుద్ధాత్ముడు పౌలుద్వారా చెప్పుచున్నాడు (రోమా 10:9-10). యేసుక్రీస్తు ఇట్లనుచున్నాడు. “మనుష్యుల యెదుట నన్ను ఒప్పుకొనువాడెవడో, పరలోకమందున్న నా తండ్రియెదుట నేనును వానిని ఒప్పుకొందును” అని ఆయన చెప్పెను (మత్తయి 10:32). మన పాపములనైతే దేవునియొద్ద ఒప్పుకొనవలెనుగాని, క్రీస్తునందలి మన విశ్వాసము నయితే మనుష్యుల యెదుట ఒప్పుకొనవలెను.

యేసుక్రీస్తునందు విశ్వాసము కలిగి, పాపముల విషయమై మారుమనస్సు పొంది, క్రీస్తు నామమును బహిరంగముగా ఒప్పుకొనిన తరువాత, రక్షణ పొందుటకు ఒకడు బాప్తిస్మము పొందవలెను. అనేకులు బాప్తిస్మము పొందనవుసరమే లేదని చెప్పుదురు కాని యేసుక్రీస్తు అట్లు చెప్పుటలేదు. “నమ్మి బాప్తిస్మము పొందిన తరువాతనే గాని, దానికి ముందుకాదు. మరల “మీరు మారుమనస్సు పొంది, బాప్తిస్మము పొందిన తరువాతనేగాని, దానికి ముందుకాదు అని గ్రహించుడి.

ఒకడు రక్షింపబడవలెనంటే అతడు యేసునందు విశ్వాసియై, మారుమనస్సు నొంది, యేసును ఒప్పుకొని, క్రీస్తు లోనికి బాప్తిస్మము పొందిన తరువాతనే రక్షింపబడగలడు. బాప్తిస్మములో ఆయన మానవుని పాపములను క్రీస్తు రక్తము ద్వారా కడిగివేయును. “గనుక నీవు తడవు



చేయుట ఎందుకు? లేచి ఆయన నామమును బట్టి బాప్తిస్మము పొంది, నీ పాపములను కడిగివేసుకొనుము” అని దేవుని గ్రంథము ఈనాడు నిన్ను హెచ్చరించుచున్నది (అపో.కా 22:16). “దానికి సాదృశ్యమైన బాప్తిస్మము ఇప్పుడు మిమ్మును రక్షించుచున్నది” యని కూడా ఆ గ్రంథము చెప్పుచున్నది.

రక్షించు బాప్తిస్మము యెట్టిది? మారుమనస్సు నొందిన విశ్వాసి, తన పాపక్షమాపణ నిమిత్తమై పొందునట్టిది. అది క్రీస్తును ధరించుకొనుటకు, రక్షించబడుటకై పొందునట్టిది. అది నీటిలో ముంచడమైనట్టిది. అది ఒకని రక్షించి క్రీస్తు సంఘమందు చేర్చునట్టిది.

గనుక మిత్రులారా! మిమ్మును మీరు, నేను రక్షింపబడితినాయని ప్రశ్నించుకొనుడి. నేడు మీరు రక్షణ పొందవలెనంటే అది మీకు సాధ్యమే. క్రీస్తును విశ్వసించి ఆయనకు సంపూర్ణ విధేయతను చూపించుడి. ఆయనే మీ రక్షణ మార్గము. ఆయనను నమ్మి బాప్తిస్మము పొందుడి. అప్పుడు మీరు రక్షింపబడగలరు (మార్కు 16:16).

# 14. నశించిన దానిని వెదకుట
## (SEEKING THE LOST)

నేను బొంబాయి నగరములో యుంటున్నప్పుడు ఒక సంగతి జరిగినది. సముద్రములోపడి మునిగిపోవుచున్న ఒక మనిషిని యౌవనస్థుడు ఒకడు తక్షణమే సముద్రములోనికి దుమికి రక్షించుట జరిగినది. అతడు మునిగిపోవుచుండగా అనేకులు చూచుచున్నను, ఒక యౌవనస్థుడు మాత్రమే అతనిని రక్షించుటకు ముందుకు వెళ్ళెను. ఒక పవిత్రప్రాణము నాశనము కాకుండ ఈ యౌవనస్థుడు చేసిన ఈ క్రియ గొప్ప ధైర్యసాహసములు గల క్రియయని వార్తాపత్రికలలో ప్రచురించబడెను. ఈ యౌవనస్థుని యొక్క ధైర్యసాహసములను గూర్చి మనం చదువునప్పుడుగాని, వినినప్పుడుగాని, మన హృదయాలలో ప్రగాఢమైన సంతోషము ఉద్భవించును. అయితే ఇంతకన్నా గంభీరమైనట్టియు, ఆశ్చర్యకరమైనట్టియు రక్షణ బైబిలునందు మనకున్నది-పాపము అను మహాసముద్రములోపడి మునిగిపోవుచున్న స్త్రీ పురుషుల యొక్క రక్షణ అందులో మనకున్నది. నశించినదానిని వెదకి రక్షించుటకు వచ్చిన మనుష్య కుమారుని గూర్చి క్రొత్త నిబంధన బోధించుచున్నది.

లూకా వ్రాసిన సువార్త 19వ అధ్యాయములో ఒక చక్కని సంగతిని గూర్చి వ్రాయబడినది. అది యేసుక్రీస్తు ఈ లోకములో యుంటుండగా జరిగిన ఒక సంఘటన. ఆయన తన కరుణను ఒక వింతయైనవానిపై చూపించుట ఆనాడు జరిగినది. అతడు సుంకపు గుత్తదారుడు. జక్కయ్య పొట్టివాడైనను యేసును చూడగోరెను. “అప్పుడు యేసు ఆ త్రోవను రానైయుండెను గనుక అతడు ముందుగా పరుగెత్తి, ఆయనను చూచుటకు ఒక మేడిచెట్టు ఎక్కెను. యేసు ఆ చోటికి వచ్చినప్పుడు కన్నులెత్తి చూచి



– జక్కయ్యా త్వరగా దిగుము, నేడు నేను నీయింట నుండవలసియున్నదని అతనితో చెప్పెను. అతడు త్వరగా దిగి సంతోషముతో ఆయనను చేర్చుకొనెను. అందరూ అదిచూచి – ఈయన పాపియైన మనుష్యునివద్ద బసచేయ వెళ్ళెనని చాల సణుగుకొనిరి. జక్కయ్య నిలువబడి – ప్రభువా, నా ఆస్థిలో సగము బీదలకిచ్చుచున్నాను. నేనెవరియొద్దనైనను అన్యాయముగా దేనినైనను తీసికొనిన యెడల అతనికి నాలుగింతలు మరల చెల్లింతునని ప్రభువుతో చెప్పెను. అందుకు యేసు – ఇతడు అబ్రహాము కుమారుడే. ఎందుకనగా నేడు ఈ యింటికి రక్షణ వచ్చియున్నది. నశించినదానిని వెదకి రక్షించుటకు మనుష్య కుమారుడు వచ్చెనని అతనితో చెప్పెను'' (లూకా 19:1-10). పాపియైన ఒక మనుష్యుని యింటిలో యేసు ప్రభువు తాను ఈ లోకమునకు ఎందుకు వచ్చినది తెలియజేసెను – నశించిన దానిని వెదకి రక్షించుటకు ఆయన ఈ లోకమునకు వచ్చెను.

మానవజాతి అంతయును నశించిపోవచున్నది. అది దేవుని గృహమునుండి, సత్యనిధులలో నుండి, పరిశుద్ధ మార్గము నుండి, ఆనంద జలముల నుండి తొలగిపోయి నాశనమైపోవుచున్నది. ఐతే యీలాగున నాశనమై పోవుచున్న మానవులను రక్షించుటకు యేసుక్రీస్తు ఈ లోకమునకు వచ్చెను. త్రోవతప్పి తొలగిపోయి, నాశనమగుటకన్నా ఘోరమైన దుర్గతి ఈ లోకములో వేరొకటిలేదు. సముద్ర మధ్యలో దిక్సూచిని కోల్పోయి నాశనమగుచు, మునిగిపోవడానికి సిద్ధముగా నున్న ఓడను ఒక్కమారు ఆలోచించుము, లేదా ప్రయాణము చేయుచూ దట్టమైన అడవులలో త్రోవ తప్పిపోయి, క్రూరమృగముల భయముతో నాశనమునకు పోవుచున్న ప్రయాణీకుని గమనించుము. పెద్దపెద్ద పట్టణములలో క్రొత్త మనుష్యులను మోసగించువారి వలన, తప్పుత్రోవలోనికి మరల్చబడిన యాత్రికుని

గమనించుము. ఈ లోకములో మనము ఇట్టి అనేక సందర్భములను గమనించవచ్చును. తగిన సమయములో సహాయము అందలేకపోవుటచే నాశనమైనవారనేకులున్నారు. అయితే యేసుప్రభువు ఆత్మీయముగా నాశనమైపోవుచున్న వారిని వెదకి రక్షించుటకు ఈ లోకమునకు వచ్చెను. పరలోకపు చరిత్రలో ఒక దినము ఉన్నది – ఆ దినమున, దేవుడు సృజించిన లోకము పాపకూపములో కూలిపోయినదని ప్రకటన చేయబడెను. దేవుని స్వరూపమందు, దేవుని పోలిక చొప్పున చేయబడిన మానవజాతి నాశనములో పడెనని ప్రకటించబడెను. వారు దేవుని సత్యమును, జ్ఞానమును విడనాడి, తమ పరలోక గృహమును విడనాడి, పాపమునందును, కల్మష మునందును తిరుగులాడుటకు నిశ్చయించుకొనిరి యని ప్రకటింపబడిన దినము అది. ఆదాము, హవ్వలు ఏదేనులో పాపము చేసిన దినము అది.

సర్వసృష్టికి కర్తయైన దేవుని సహవాసము నుండి తొలగింపబడిన మానవుని దుస్థితిని దేవుడు ఎరిగియున్నాడు. దేవుడు లేకుండా మానవుడు ఆత్మీయ అంధకారంలో మునిగియున్నాడు. అవిశ్వాసము వలన అతడు అంతకంతకు అధోగతికి పాలైపోవుచున్నాడు. అయితే ఈ పాపపు లోకము నుండి మానవుని విమోచించుటకు దేవుడొక మార్గమును ఏర్పాటు చేసెను. అందువలన ఆయన తన అద్వితీయ కుమారుని ఈ లోకమునకు పంపెను. ఆయన మనలను వెదకి రక్షించు నిమిత్తము యేసును దేవుడు ఈ లోకమునకు పంపెను. పాపపు సముద్రములో పడి కొట్టుకొనుచుండగా మనలను వెదకి రక్షించుటకు యేసుక్రీస్తు ఈ లోకమునకు వచ్చెను.

ఆయన ఈ లోకమునకు ఎందుకు వచ్చెనో ఆయనే తన బోధ ద్వారాను, క్రియలద్వారాను మనకు అనేక రీతులుగ తెలియపరచెను.



వంద గొర్రెలు కలిగి, వానిలో ఒక్క దానిని పోగొట్టుకొనిన గొర్రెల కాపరిని గూర్చి ఆయన మనకు బోధించెను. ఆయన ఇట్లనుచున్నాడు. “మీలో ఏ మనుష్యునికైనను నూరు గొర్రెలు కలిగియుండగా వాటిలో ఒకటి తప్పిపోయిన యెడల అతడు తొంబది తొమ్మిదింటిని అడవిలో విడిచిపెట్టి, తప్పిపోయినది దొరుకువరకు దానిని వెదక వెళ్ళడా? అది దొరికినప్పుడు సంతోషముతో దానిని తన భుజముల మీద వేసికొని యింటికి వచ్చి తన స్నేహితులను పొరుగువారిని పిలిచి – మీరు నాతోకూడ సంతోషించుడి. తప్పిపోయిన నా గొర్రె దొరికినదని వారితో చెప్పను గదా. అటువలె మారుమనస్సు అక్కరలేని తొంబది తొమ్మిది నీతిమంతుల విషయమై కలుగు సంతోషము కంటె మారుమనస్సు పొందు ఒక పాపివిషయమై పరలోకమందు ఎక్కువ సంతోషము కలుగును” (లూకా 15:3–7).

ఆయన బోధించుచూ మరియొక ఉపమానము చెప్పెను. “ఏ స్త్రీకైనను పది వెండి నాణెములుండగా వాటిలో ఒక నాణెము పోగొట్టుకంటే ఆమె దీపము వెలిగించి యిల్లు ఊడ్చి అది దొరుకు వరకు జాగ్రత్తగా వెదకదా? అది దొరికినప్పుడు తన చెలికత్తెలను, పొరుగువారిని పిలిచి–నాతో కూడా సంతోషించుడి, నేను పోగొట్టుకొనిన నాణెము దొరికినదని వారితో చెప్పునుగదా. అటువలె మారుమనస్సు పొందు ఒక్క పాపివిషయమై దేవుని దూతల ఎదుట సంతోషము కలుగునని మీతో చెప్పుచున్నాననెను” (లూకా 15:8–10).

వంద గొర్రెలలో తప్పిపోయిన ఒక్క గొర్రెను వెదుకుచూ వెళ్ళిన గొర్రెల కాపరివలెను, పోగొట్టుకొనిన వెండి నాణెమును జాగ్రత్తగా వెదకిన స్త్రీవలెను, పాపములో పడిపోయిన వారిని వెదకి రక్షించుటకు యేసుక్రీస్తు ఈ లోకమునకు వచ్చెను. తప్పిపోయిన గొర్రెను అడవులలో వెదకుచూ

వెళ్ళిన గొర్రెల కాపరియొక్క ప్రేమ ఎంత గొప్పదో అట్లే పరలోకము నుండి మనలను వెదకుచూ వచ్చిన యేసుక్రీస్తు యొక్క ప్రేమ అంత గొప్పది. గొర్రెయొక్క క్షేమము నిమిత్తము, ఆయన దానిని కనుగొనువరకు దానిని వెదకుచూ వెళ్ళెను. పోగొట్టుకొనబడిన వెండి నాణెమును ఒక స్త్రీ జాగ్రత్తగా వెదుకుటలో – దేవుని యెదుట ప్రతి ఆత్మకు ఉన్న విలువ బహు గొప్పదియని అర్ధమగుచున్నది. యేసు బోధించిన ఈ గొప్ప ఉపమానములలో మన హృదయములను కరిగించునంత ప్రేమ అందు కన్పడుచున్నది. మనలో ఏ ఒక్కడు నశింపవలెనని ఆయన ఇష్టపడుటలేదు. ఆయన నీతిని బట్టి నశించుచున్న మనలను వెదకి రక్షించుటకు ఆయన ఈ లోకమునకు వచ్చెను.

యేసుక్రీస్తు పాపిని ప్రేమించి పాపమును ద్వేషించెను. స్వనీతిపరులైన పరిసయ్యులు, శాస్త్రులు – ఆయన పాపుల యొద్ద బసచేయుటకు వెళ్ళెనని సణుగుకొనిరి. ఒకసారి భోజనమునకు యేసు కూర్చుండియుండగా "ఇదిగో సుంకరులను, పాపులును అనేకులు ఆయన యొద్దను, ఆయన శిష్యుల యొద్దను కూర్చుండిరి. పరిసయ్యులు అది చూచి – మీ బోధకుడు సుంకరులతోను, పాపులతోను కలిసి యెందుకు భోజనము చేయుచున్నాడని ఆయన శిష్యుల నడిగిరి. ఆయన ఆ మాట విని – రోగులకేగాని ఆరోగ్యము గలవారికి వైద్యుడక్కర లేదుగదా. అయితే నేను పాపులను పిలువవచ్చితిని గాని నీతిమంతులను పిలువ రాలే" దని ఆయన చెప్పెను (మత్తయి 9:10–13). అవును, నిజమే ఆత్మీయ వైద్యుడైన యేసుక్రీస్తు పాపపు రోగము నుండి మనలను విడుదల చేయుటకు వచ్చియున్నాడు. ఆయన గ్రుడ్డివారికి చూపునిచ్చెను, కుంటివారికి నడువ శక్తినిచ్చెను. కుష్టురోగులను స్వస్థపరచెను, చెవిటివారికి వినుటకు శక్తినిచ్చెను, చనిపోయినవారిని



లేవదీసెను, దయ్యములను వెళ్ళగొట్టెను. పాపములను క్షమించెను. నిశ్చయముగా ఆయన పాపులను వెదకవచ్చెను.

చివరిగా కాలము పరిపూర్ణమయినప్పుడు మనందరి పాపప్రాయ శ్చిత్తార్ధబలిగా తన్ను తాను సిలువలో అర్పించుకొనెను. పాపములో పడి నశించుచున్న మనము ఆయన యందు రక్షింపబడగలుగునట్లు మన నిమిత్తము ఆయన మరణించెను. మనము విమోచింపబడ గలుగునట్లును, మనలను నిత్యమూ ప్రేమించుచున్న దేవుని దొడ్డిలో మనలను తిరిగి చేర్చగలుగునట్లును ఆయన మన నిమిత్తము బలియాయెను. దేవుడే మనలను కనుగొనుట ఆశ్చర్యము కదా? మనము దేవుని వెదకుట మనకే మేలు కదా? ఆయన ఎల్లప్పుడు నశించువారిని వెదుకుచూ యున్నాడు గనుక, మనము ఆయనను నిజముగా వెదకిన యెడల ఆయన తప్పక మనకు దొరుకును.

యేసుక్రీస్తు నీ కొరకు ఇంకను వెదుకుచునేయున్నాడు. నాయొద్దకు ఈనాడు రమ్ము అని నిన్ను పిలుచుచున్నాడు. నీ హృదయపు తలుపునొద్ద ఆయన నిలబడి తట్టుచున్నాడు. నీ కొరకు ఆయన ఈనాడు కనిపెట్టు చున్నాడు. నీ హృదయమును తెరచి ఆయనను లోపలికి రమ్ము అని ఈనాడే పిలువగలవా? యేసుక్రీస్తు నందు విశ్వాసముంచి, నీ పాపముల నిమిత్తమై మారు మనస్సు పొంది, ఆయన యెడల నీకున్న విశ్వాసమును ఒప్పుకొని, నీ పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుట ద్వారా నీవు ఆయనను నీ హృదయములోనికి ఆహ్వానించగలవు. నీవు అట్లు చేసిన యెడల ఈ పాపలోకమునుండి ఆయన నిన్ను రక్షించును. అప్పుడు నీవు ఆయనవాడవు, ఆయన నీవాడును అగును. ఆయనను ఈనాడే అంగీకరించవా?

# 15. ప్రవచింపబడిన సంఘము
## (THE CHURCH AS FORETOLD)

సంఘమును గూర్చి ఈరోజు మనం కొంత తెలిసికొన బోవుచున్నాము.

సంఘము క్రొత్త నిబంధన సంస్థయని మనం తెలిసికొనవలెను. క్రీస్తు తన స్వరక్తమిచ్చి తన సంఘమును సంపాదించెను అని కూడా మనం ఎరిగిన సంగతియే. అయితే క్రీస్తుసంఘము అకస్మాత్తుగా ఈ లోకములో అవతరించలేదు. సంఘస్థాపనమును గూర్చి దేవుడు ముందుగా ఆలోచించి, ప్రవక్తల ద్వారా ప్రవచించి, తన కుమారుని ద్వారా స్థాపించెను.

జగత్తు పునాది వేయబడక మునుపే దేవుడు సంఘమును నిర్ణయించెను. పౌలు ఇట్లు చెప్పుచున్నాడు "మన ప్రభువైన యేసుక్రీస్తు యొక్క తండ్రియగు దేవుడు స్తుతింపబడునుగాక. ఆయన క్రీస్తునందు పరలోక విషయములలో ఆత్మసంబంధమైన ప్రతి ఆశీర్వాదమును మనకు అనుగ్రహించెను. ఎట్లనగా తన ప్రియునియందు తాను ఉచితముగా మన కనుగ్రహించిన తన కృపామహిమకు కీర్తి కలుగునట్లు తన చిత్తప్రకారమైన దయా సంకల్పము చొప్పున, యేసుక్రీస్తు ద్వారా తనకు కుమారులనుగా స్వీకరించుటకై మనలను ముందుగా తన కోసము నిర్ణయించుకొని మనము తన యెదుట పరిశుద్ధులమును, నిర్దోషులమునై యుండవలెనని జగత్తు పునాది వేయబడక మునుపే ప్రేమచేత ఆయన క్రీస్తులో మనలను ఏర్పరచుకొనెను" (ఎఫెసీ 1:3-6). ప్రపంచములు నిర్మించబడక ముందే దేవుడు సంఘమును గూర్చి ఆలోచించునట్లు దీనివలన మనం గ్రహించుకొనగలము.



దేవుడు తన ప్రవక్తల ద్వారా సంఘమును గూర్చి అనేకసార్లు ప్రచురించెను. "అంత్యదినములలో పర్వతములపైన యెహోవా మందిర పర్వతము, పర్వత శిఖరమున స్థిరపరచబడి కొండలకంటె ఎత్తుగా ఎత్తబడును. ప్రవాహము వచ్చినట్లు సమస్త అన్యజనులు దానిలోనికి వచ్చెదరు" అని యెషయా ప్రవక్త ప్రవచించెను. "ఆ రాజులకాలములో పరలోకమందున్న దేవుడు ఒక రాజ్యమును స్థాపించును. దాని కెన్నటికిని నాశనము కలుగదు. ఆ రాజ్యము దానిని పొందిన వారికిగాక మరెవరికిని చెందదు. అది ముందు చెప్పిన రాజ్యములన్నిటిని పగులగొట్టి నిర్మూలము చేయునుగాని అది యుగముల వరకు నిలుచును" అని దానియేలు ప్రవచించెను (దానియేలు 2:44). ఆ దినములలో నేను సర్వజనుల మీద నా ఆత్మను కుమ్మరింతునని యోవేలు ద్వారా దేవుడు ప్రవచించెను. "నీ గర్భములో నుండి వచ్చిన నీ సంతతిని హెచ్చించి రాజ్యమును అతనికి స్థిరపరచెదను. అతడు నా నామ ఘనతకొరకు ఒక మందిరమును కట్టించును. అతని రాజ్యసింహాసనమును నేను నిత్యముగా స్థిరపరచెదను" అని దావీదుకు యెహోవా వాగ్దానము చేసెను (2 సమూ 7:13).

ఇంతవరకు మనము చూచిన ప్రవచనములలో దేవుడు స్థాపింపబోవు రాజ్యము యొక్క కొన్ని సూచనలు మనకు కనిపించుచున్నవి. ఆ రాజ్యమే క్రీస్తుసంఘము అని క్రొత్త నిబంధన మనకు విశదపరచుచున్నది. దేవుడు స్థాపింపబోవు రాజ్యము చివరిదినములలో స్థాపింపబడును. అది పర్వత శిఖరముపైన స్థాపించబడును. సమస్త జనులు దానిలోనికి ప్రవేశింతురు. సమస్త జనుల మీద దేవుని ఆత్మ కుమ్మరించబడుట ద్వారా అది స్థాపించబడును. అది ఆనాటి నాలగవ భూసామ్రాజ్య కాలమున స్థాపించబడును, అది రాజ్యములన్నిటిని

నిర్మూలించునుగాని అది యుగయుగములు నిలుచును అని ఇప్పటివరకు గ్రహించాము.

యేసుక్రీస్తు కంటే కొంచెము ముందుగా బాప్తిస్మమిచ్చు యోహాను వచ్చి దేవుని రాజ్యము ఆసన్నమైయున్నదని బోధించెను (మత్తయి 3:2). యేసుక్రీస్తు కూడా అది త్వరలో స్థాపింపబడబోవుచున్నదని బోధించెను. ఆయన రాజ్యము యొక్కయు, సంఘము యొక్కయు లక్షణములను మనము అర్థము చేసికొనగల్గునట్లు యేసుప్రభువు అనేక ఉపమానముల ద్వారా ఆయన సంఘమును గూర్చి బోధించెను. చివరిగా పేతురుతో ఆయన ఇట్లు వాగ్దానము చేసెను. "మరియు నీవు పేతురువు – ఈ బండ మీద నా సంఘమును కట్టుదును, పాతాళ లోకద్వారములు దాని యెదుట నిలువనేరవు అని నీతో చెప్పుచున్నాననెను" (మత్తయి 16:18). "మరియు ఆయన – ఇక్కడ నిలిచియున్నవారిలో కొందరు దేవుని రాజ్యము బలముతో వచ్చుట చూచువరకు మరణము రుచి చూడరని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను అనెను" (మార్కు 9:1). యేసుక్రీస్తు పునరుత్థానుడైన తరువాత తన అపోస్తులులకు అనేకసార్లు కన్పడెను. "ఆయన వారి మనస్సు తెరచి, క్రీస్తు శ్రమపడి మూడవ దినమున మృతులలో నుండి లేచుననియు, యెరూషలేము మొదలుకొని సమస్త జనములలో ఆయన పేరట మారు మనస్సు, పాపక్షమాపణయు ప్రకటించబడుననియు వ్రాయబడి యున్నది. ఈ సంగతులకు మీరే సాక్షులు, ఇదిగో నా తండ్రి వాగ్దానము చేసినది మీ మీదికి పంపుచున్నాను. మీరు పై నుండి శక్తి పొందువరకు పట్టణములో నిలిచియుండుడని వారితో చెప్పెను" (లూకా 24:46-49).

యోహాను యొక్కయు, క్రీస్తు యొక్కయు బోధల ద్వారా మనం



ఇప్పుడు మరికొన్ని సత్యములను దేవుని రాజ్యమును గూర్చి లేదా సంఘమును గూర్చి తెలిసికొంటిమి. అవేమంటే, అంత్యదినములు ప్రారంభింపబడెను. దేవుని రాజ్యము సమీపించి యుండెను. నా సంఘమును నేను కట్టుదుని అని యేసు వాగ్దానము చేసెను. క్రీస్తుతో కూడనున్న వారి జీవితకాలంలోనే అది జరుగును. అది వచ్చినప్పుడు బలముతో వచ్చును. సమస్త జనములలో మారుమనస్సు పాపక్షమాపణ క్రీస్తు పేరట ప్రకటించబడును, అది యెరూషలేములో ఆరంభమగును. అపోస్తలులు యెరూషలేములో పై నుండి శక్తిని పొందెదరు.

ఈ సంగతులన్నియు ఎప్పుడు, ఎక్కడ నెరవేరెనో అక్కడ, అప్పుడు దేవుని సంఘము స్థాపించబడెనని మనం ఇట్టే గమనించగలము.

అపోస్తలుల కార్యములు 2వ అధ్యాయమును మనం చూచిన యెడల ఈ సంగతులన్నియు, పెంతెకోస్తు అను పండుగ దినమున యెరూషలేములో నెరవేరినట్లు మనం చూడగలము.

యేసుక్రీస్తు చనిపోయి, సమాధి చేయబడి, మూడవ దినమున తిరిగి లేచి, పరలోకమున కెక్కిపోయిన తరువాత, అపోస్తులులందరు యెరూషలేములో యుండి ఆయన చేసిన వాగ్దానము కొరకు కనిపెట్టుచుయుండిరి. అప్పుడు గొప్ప శబ్దముతో వారందరు పరిశుద్ధాత్మతో నింపబడినవారైరి. ఆ కాలమున ఆకాశము క్రింద నుండి ప్రతి జనములో నుండి వచ్చిన భక్తిగల యూదులు యెరూషలేములో కాపురముండిరి. ఈ జనులు గుంపులు గుంపులుగా కూడిరాగా పేతురు వారికి మొట్టమొదటిగా మారు మనస్సును, పాపక్షమాపణను యేసుక్రీస్తు నామమును ప్రకటించెను. కాబట్టి అతని వాక్యమును వినినవారు

బాప్తిస్మము పొందిరి. ఆ దినమున ఇంచుమించు మూడువేల మంది చేర్చబడిరి.

అపోస్తలుల కార్యములు 2వ అధ్యాయమును మీరు అనేకసార్లు చదువవలెనని మరియొకసారి కోరుచున్నాను. దానిని చదువుట ద్వారా దేవుడు ముందుగానే వాగ్దానము చేసిన రీతిగ తన సంఘమును క్రీస్తుద్వారా స్థాపించినట్లు ఇట్టే గమనించగలము.

అంత్యదినములలో యెరూషలేము నుండి యెహోవా వాక్కు బయలు వెళ్ళును. అని యెషయా ప్రవచించెను. యెరూషలేములో మొట్టమొదటి సువార్త ప్రసంగమును పేతురు చేసెను. యెహోవా మందిర పర్వతము లేదా క్రీస్తు సంఘము యెషయా ప్రవచించిన రీతిగనే యెరూషలేము నందు ఆరంభమాయెను. ఆ నాలుగవ భూరాజుల కాలములో దేవుని రాజ్యము ఆరంభమాయెను. ఆ నాలుగవ భూరాజుల కాలములో దేవుని రాజ్యము స్థాపించబడెను. అది క్రీస్తు శకము 33వ సంIIలో స్థాపించబడెను.

అంత్యదినములయందు జనులందరి మీద నా ఆత్మను కుమ్మరించెదను అని యోవేలు చేసిన ప్రవచనము పెంతెకోస్తు పండుగదినమున నెరవేరెను. యోవేలు ప్రవక్త ద్వారా చెప్పబడిన సంగతి యిదే అని పేతురు ఆనాడు వారికి చెప్పెను. దేవుని రాజ్యము బలముతో పరిశుద్ధాత్ముడు రాగా శక్తితో ఆరంభమాయెను.

ఇట్లు అనేక రీతులుగ ప్రభువు తన సంఘమును గూర్చి చేసిన వాగ్దానములన్నియును పెంతెకోస్తు దినమున యెరూషలేమునందు నెరవేరెను. గనుక ఆ దినమున క్రీస్తు సంఘము స్థాపించబడెను. దీనిని



బట్టి మనం క్రీస్తు సంఘపు ఆరంభ లక్షణములను, గురుతులను కొన్ని సేకరించవచ్చును.

క్రీస్తు సంఘమును స్థాపించినవాడు – యేసుక్రీస్తు. అది మానవుని చేత స్థాపించబడలేదు. అది యెరూషలేమున ఆరంభమాయెను. అది పెంతెకోస్తు దినమున ఆరంభమాయెను. అది క్రీస్తు శకము 33వ సంవత్సరమున ఆరంభమాయెను. క్రీస్తు దానికి పునాది, క్రీస్తే దానికి శిరస్సు, క్రీస్తే దానికి రక్షకుడు, గనుక సంఘము నూటికి నూరుపాళ్ళు క్రీస్తుదే.

రక్షింపబడిన ప్రతివారిని ప్రభువే ఆ సంఘముతో చేర్చుకొనును. "నమ్మి బాప్తిస్మము పొందినవారిని" ఆయన రక్షించును. నీవు దేవుని సంఘసభ్యుడవు కావలెనంటే యేసునందు విశ్వాసముంచి, మారుమనస్సు పొంది, ఆయనను ఒప్పుకొని, నీ పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందవలెను. అట్లు చేయని యెడల దేవుడు మనలను తప్పక శిక్షించును సుమా! క్రీస్తు సంఘమునందు క్రీస్తుచే చేర్చబడుటకు నీవు త్వరపడవలెనని నిన్ను హెచ్చరించుచున్నాను.

# 16. క్రొత్త నిబంధన సంఘము
## (THE NEW TESTAMENT CHURCH)

లేఖనములలో చెప్పబడిన సంఘమును గూర్చి నేటి క్రైస్తవ లోకములో గొప్ప వాగ్వివాదములు జరుగుచున్నవి. మతగురువులు, విద్యావేత్తలు, విమర్శకులు, సామాన్య ప్రజలు, అందరూ ఈ వివాదములో పాల్గొనుచునే యున్నారు. పోపులను వారును, వారిక్రిందనున్న మతాధికారులను వారికిష్టము వచ్చిన సూత్రములను బోధించియున్నారు. అనేక సభలు, సమావేశములు జరిపించి, రకరకాల తీర్మానములు జారీ చేయుట జరిగినది. అయితే వీరందరు, ఈ అంశముపై ప్రభువును మాత్రము మరచిపోవుట జరిగినది. అందువలన క్రొత్త నిబంధన సంఘమును గూర్చి మనం తెలిసికొనుటకు లేఖనములు తమకు తామే జవాబు ఇచ్చుకొను రీతిగ ఈ దినం మనకీయబడిన ఈ కొద్ది సమయమును వినియోగించెదము. ఈ అంశముపై ప్రభువైన యేసును, ఆయన అపోస్తులులును చెప్పిన మాటలను మనం దైవ గ్రంథము నుండి ఎత్తిచూపించుటకు ప్రయత్నం చేయుదము. సంఘము బైబిలు సంస్థ గనుక సంఘమును గూర్చిన సత్యము అంతయును బైబిలునందు ఉన్నదని తప్పక ఒప్పుకొనవలెను.

'సంఘము' అను పదము క్రొత్తనిబంధన యంతటిలోను అనేకసార్లు మనకు కన్పడగలదు. అందువలన 'సంఘము' అనునది తప్పక క్రొత్త నిబంధన సంస్థయని మనము తప్పక గ్రహించుకొనవలెను.

సంఘమును గూర్చి మొట్టమొదటిగా మనము మత్తయి వ్రాసిన సువార్త 16వ అధ్యాయము 18వ వచనములో చదువగలము. మనుష్య కుమారుడెవడని జనులు చెప్పుకొనుచున్నారు? అని యేసు తన శిష్యులను



ఒకసారి అడుగగా – అందుకు సీమోను పేతురు – నీవు సజీవుడవగు దేవుని కుమారుడవైన క్రీస్తువు అని చెప్పెను. అందుకు యేసు పేతురుతో – పరలోకమందున్న నా తండ్రి ఈ సంగతి నీకు బయలుపరచెనే కాని నరులు నీకు బయలుపరచలేదు. మరియు నీవు పేతురువు. ఈ బండమీద నా సంఘమును కట్టుదును. పాతాళలోక ద్వారములు దాని యెదుట నిలువనేరవు అని నేను నీతో చెప్పుచున్నాను అనెను. సంఘము అను పదము మొట్టమొదటిగా ఇక్కడ యేసుక్రీస్తు వినియోగించుట మనం చూస్తున్నాము. యేసు "ఈ బండమీద నా సంఘమును కట్టుదును" అని చెప్పగా, ఆ బండ పేతురు అని అనేకులు అపార్థము చేసికొనుచున్నారు. మనము 1 కొరింథి 10:4లో చూచిన, ఆ బండ క్రీస్తే అని వాక్యము చెప్పుచున్నది. యేసుక్రీస్తు సజీవుడైన దేవుని కుమారుడు అను గొప్ప సత్యముపై క్రీస్తు సంఘము నిర్మించబడియున్నది. యేసు దేవుని కుమారుడు అనే గొప్ప సత్యముపై క్రైస్తవ్యమంతయును ఆధారపడియున్నది.

'నా సంఘమును నేను కట్టుదును' అని చెప్పినవాడు యేసుక్రీస్తే. ఆయన చెప్పిన రీతిగ ఆయన సంఘమును కట్టిన యెడల ఆ సంఘము క్రీస్తు సంఘమే అవునుగాని మరొకరి సంఘము కాదు. ఆయన మాటలను ఆయన నెరవేర్చెనా? అవును నెరవేర్చెను అని మనమందరము ఒప్పుకొనక తప్పదు. అట్లయిన సంఘము ఆయనదే గాని మరొకరిది కాదు.

అపోస్తలుడైన పౌలు ఏమి చెప్పుచున్నాడో ఇప్పుడు చూద్దాం. "ఆయన బలాతిశయము చేత క్రీస్తును మృతులలో నుండి లేపి, సమస్తమైన ఆధిపత్యముకంటెను, అధికారము కంటెను, ప్రభుత్వము కంటెను, ఈ యుగమందు మాత్రమేగాక రాబోవు యుగమునందును పేరు పొందిన

ప్రతినామము కంటెను, ఎంతో హెచ్చుగా పరలోకమునందు ఆయనను తన కుడి పార్శ్వమును కూర్చుండబెట్టుకొని యున్నాడు. మరియు సమస్తమును ఆయన పాదముల క్రింద ఉంచి, సమస్తము పైని ఆయనను సంఘమునకు శిరస్సుగా నియమించెను. ఆ సంఘము ఆయన శరీరము. సమస్తమును పూర్తిగా నింపుచున్నవాని సంపూర్ణతయై యున్నది" (ఎఫెసీ 1:20-23).

యేసు దేనికి శిరస్సుగా నియమింపబడియున్నాడు? ఆయన శరీరమైన సంఘమునకు శిరస్సైయున్నాడు. కొలస్స 1:18 ఏమి చెప్పుచున్నది? "సంఘము అను శరీరమునకు ఆయనే శిరస్సు" అని చెప్పుచున్నది. ఈ వచనములలో శరీరము, సంఘము అను పదములు సరిసమానముగ వినియోగింపబడినవి. అంటే ఆ రెండు, ఒకేదానిని సూచించుచున్నవి. క్రీస్తు శిరస్సైయుండగా, సంఘము ఆయన శరీరమైయున్నది. గనుక అది క్రీస్తు సంఘము.

అపోస్తలుడైన పౌలు మరల ఇట్లు చెప్పుచున్నాడు. "అటువలె మీరు క్రీస్తు యొక్క శరీరమై యుండి వేరువేరుగా అవయవములై యున్నారు" (1 కొరింధి 12:27). క్రీస్తుయొక్క శరీరము ఎవరు? కొరింధులోని క్రైస్తవులు అదే అయియున్నారు అని పౌలు బోధించెను. శరీరము సంఘమై యున్నందునను, సంఘము శరీరమైయున్నందునను, సభ్యులు ఆ శరీరమై యున్నందునను, సభ్యులే క్రీస్తు సంఘమైయున్నారు. సంఘము అను శరీరమునకు క్రీస్తే శిరస్సు. ఆయన శరీరముకాని మరి దేనికిని ఆయన శిరస్సుకాదు. ఆయన శరీరము లేదా సంఘము ఆయన నామము ధరించును.



ఒకని శరీరమునకు శిరస్సుకు ఎట్టి సంబంధమున్నదో, క్రీస్తుకు కూడా ఆయన శరీరమైన సంఘముతో అట్టి సంబంధమున్నది. శరీరము నుండి మనం శిరస్సును వేరుచేసిన, ఆ శరీరము నిర్జీవమైనదగును. అట్లే సంఘము నుండి క్రీస్తును వేరు చేసిన, ఆ సంఘము శిరస్సు లేనిదై నిర్జీవమైనదగును.

ఇంకా మనం క్రొత్త నిబంధనలో చూచిన యెడల ఒక భర్తకును, భార్యకును ఎట్టి సంబంధమున్నదో, అట్లే క్రీస్తుకును, సంఘమునకును సంబంధమున్నది. పౌలు ఇట్లు చెప్పుచున్నాడు. "క్రీస్తు సంఘమునకు శిరస్సైయున్నలాగున పురుషుడు భార్యకు శిరస్సై యున్నాడు. క్రీస్తే శరీరమునకు రక్షకుడై యున్నాడు" (ఎఫెసీ 5:23). వివాహితయైన ప్రతి స్త్రీయు తన భర్త పేరు చొప్పున పిలువబడును గదా. అట్లే సంఘము కూడ తన భర్తయైన క్రీస్తు పేరున పిలువబడును. ఏలయనగా సంఘము క్రీస్తుది. అట్లుగాక మనం సంఘమునకు రకరకాల పేర్లను పెట్టి పిలిపించుకొనుచున్న యెడల ఆ సంఘము క్రీస్తు సంఘము ఎట్లు కాగలదు?

క్రీస్తు కూడా సంఘమును ప్రేమించి దానికొరకు తన్ను తాను అప్పగించుకొనెను. ఆయనను ప్రేమించి ఆయన ఆజ్ఞలను గైకొనుచు, ఆయన నామమును ధరించి నమ్మకముగా ఉన్న సంఘము దగ్గరకు ఆయన మరల వచ్చుచున్నాడు. యేసుక్రీస్తు తన సంఘము కొరకు వచ్చుచున్నాడు. అనేక సంఘములు ఆయన కొరకు ఎదురు చూచుచుండ వచ్చునుగాని, ఆయన నామమును ధరించి, ఆయనను నమ్మకముగనున్న సంఘమునే ఆయన పరలోకమునకు కొనిపోవును. అందుకే యేసు

ఇట్లనుచున్నాడు. "ప్రభువా ప్రభువా అని నన్ను పిలుచు ప్రతివాడును పరలోక రాజ్యములో ప్రవేశింపడుగాని పరలోకమందున్న నా తండ్రి చిత్తప్రకారము చేయువాడే ప్రవేశించును. ఆ దినమందు అనేకులు నన్ను చూచి ప్రభువా, ప్రభువా మేము నీ నామమును ప్రవచింపలేదా? నీ నామమున దయ్యములను వెళ్లగొట్టలేదా? నీ నామమున అనేక అద్భుతములు చేయలేదా? అని చెప్పుదురు. అప్పుడు నేను మిమ్మును ఎన్నడును ఎరుగను. అక్రమము చేయువారలారా, నా యొద్ద నుండి పొందని వారితో చెప్పుదును" (మత్తయి 7:21-23).

సంఘము క్రీస్తుయొక్క శరీరమై యుండగా, ప్రతి క్రైస్తవుడు అందు వేర్వేరు అవయవములై యున్నారు (1 కొరింథి 12:27). "అయితే దేవుడు అవయవములలో ప్రతి దానిని తన చిత్తప్రకారము శరీరములో నుంచెను" (1 కొరింథి 12:8). అవయవములు అనేకములైనను శరీరమొక్కటే (1 కొరింథి 12:20). ఎన్ని శరీరములున్నవి? ఒక్కటే ఒక్క శరీరమున్నది. ఆ శరీరమే సంఘము గనుక, ఒకే ఒక్క సంఘము ఉన్నది. ఈ శరీరములోనికి అవయవములైన సభ్యులెట్లు వచ్చారు? "దేవుడు అవయవములలో ప్రతిదానిని తన చిత్తప్రకారము శరీరములో ఉంచెను". సంఘములోనికి సభ్యులను దేవుడే చేర్చును. ఏ మానవుడు చేర్చలేడు. ఆ సంఘము క్రీస్తు శరీరము, సభ్యులు క్రీస్తువారు. వారే క్రీస్తు సంఘము.

రక్షించబడిన ప్రతివారిని ప్రభువు తన సంఘముతో చేర్చును అని వాక్యము చెప్పుచున్నది. క్రీస్తు సంఘమునకు రక్షకుడు గనుక, రక్షింపబడినవారందరు ఆయన సంఘములోనే యుంటారు అని మనం సహజముగా గ్రహించుకొనగలము. ఆయన తన సంఘమునకే



రక్షకుడుగాని వేరొక సంఘమునకు కాదు. గనుక నీవు క్రీస్తు సంఘ సభ్యునివి అవుట చాల ప్రాముఖ్యము. రక్షణ పొందుచున్న ప్రతివారిని ప్రభువు తన సంఘముతో చేర్చుచున్నయెడల వారిలో ఎవరినీ వేరొక సంఘముతో చేరుటకు ఆయన వదిలివేయడుగదా? గనుక నీవు ఆయన సంఘములో గాక వేరొక సంఘములో యున్నయెడల నీ ఆత్మరక్షణను గూర్చి దయచేసి మరియొకసారి ఆలోచించుకొనవలెను.

"నమ్మి బాప్తిస్మము పొందువాడు రక్షింపబడును" అని యేసుక్రీస్తు చెప్పెను. పెంతెకోస్తు అను పండుగ దినమున మొట్టమొదటిగా సువార్త బోధింపబడెను. దానిని నమ్మినవారు, పేతురును మిగిలిన అపోస్తులులను, అయ్యా రక్షణ పొందుటకు మేమేమి చేయవలెను అని అడిగారు. నమ్మిన మీరు మారు మనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడును యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందవలెను. అని పేతురు చెప్పెను. కాబట్టి అతని వాక్యమును అంగీకరించినవారు బాప్తిస్మము పొందిరి. ఆ దినమున ఇంచుమించు మూడు వేల మంది చేర్చబడిరి. మరియు ప్రభువు రక్షణ పొందుచున్నవారిని అనుదినము వారితో, అనగా సంఘముతో చేర్చుచుండెను (అపో.కా. 2:36-47).

గనుక మిత్రులారా, మీరు కూడ అట్లు చేసినయెడల మిమ్మును కూడా ప్రభువు ఈనాడే తన సంఘముతో చేర్చుకొనును. మన రక్షకుడైన క్రీస్తు సంఘములో యుండుటకంటే మిన్నయైన భాగ్యము మరేమున్నది?

# 17. క్రీస్తు సంఘము
## (THE CHURCH OF CHRIST)

ప్రపంచమందంతటను ఈనాడు అనేక సంఘములున్నవి. అవన్నియు యేసుక్రీస్తు సంఘములేయని వారు చెప్పుకొనుచూయుంటారు. వీటిలో ఉన్న ఒక విశేషము ఏమంటే, ఆయా సంఘములవారు ఒకదానికంటే మరియొక దానికి వేరుగాయున్న బోధలను, సిద్ధాంతములను వారు బోధించుచూ, అనుసరిస్తూ యుంటారు. నిజానికి వారి వివిధ బోధలవలన నేడు క్రైస్తవలోకము అంతయును విభజింపబడియున్నది. ఈలాగున విడిపోయియున్న శాఖలలో ఏది నిజమైన క్రీస్తు సంఘము? ఏది నిజమైన క్రీస్తు శరీరము? అనే ప్రశ్నలు మీకు తరుచు రావచ్చును.

దేవుడు తన సంఘమును స్థాపించుట కొరకు గొప్ప క్రియలను చేసెను. చివరకు తన కుమారుని సంఘము కొరకు బలిగా అర్పించెను. సర్వలోకమునందున్న సర్వమానవుల కొరకు ఆయన ఒకే ఒక్క సంఘమును స్థాపించెను. ఈ సంఘము శాఖోపశాఖలుగా విడిపోవలెనని ఆయన ఎన్నడును కోరలేదు. సరిగదా యేసుక్రీస్తు తన అనుచరుల యొక్క ఐక్యత కొరకు ప్రార్థించెను. “తండ్రీ నాయందు నీవును, నీయందు నేనును ఉన్నలాగున, వారును మనయందు ఏకమై యుండవలెనని వారి కొరకు మాత్రము నేను ప్రార్థించుటలేదు; వారి వాక్యము వలన నాయందు విశ్వాసముంచు వారందరును ఏకమై యుండవలెనని వారికొరకును ప్రార్థించుచున్నాను” అని ఆయన ప్రార్థించెను (యోహాను 17:20-21). కొరింథులో యున్న సంఘములో చీలికలు రాగా అపోస్తలుడైన పౌలు వాటిని ఖండించెను : “సహోదరులారా, మీరందరు ఏకభావముతో మాటలాడవలెననియు, మీలో



కక్షలు లేక, యేకమనస్సుతోను, ఏక తాత్పర్యము తోను, మీరు సన్నద్ధులై యుండవలెననియు, మన ప్రభువైన యేసుక్రీస్తు పేరట మిమ్మును వేడుకొనుచున్నాను”. “క్రీస్తు విభజింపబడి యున్నాడా? పౌలు మీకొరకు సిలువవేయబడెనా? పౌలు నామమున మీరు బాప్తిస్మము పొందితిరా?” యని అతడు వారి నడిగెను (1 కొరింథి 1:10-13).

యేసుక్రీస్తు ఒకే ఒక్క సంఘమును స్థాపించెను. “నా సంఘమును నేను కట్టుదును” అని ఆయన చెప్పెను. “శరీరము ఒక్కటే”యని వాక్యము చెప్పుచున్నది. ఆ శరీరము సంఘము అని కూడా అది చెప్పుచున్నది. గనుక క్రీస్తుకు ఉన్న సంఘము ఒక్కటే. అయితే ఆ ఒక్కటే సంఘము ఏది? అది ఏమైయున్నది? (మత్త 16:18; ఎఫె 4:4; కొలస్స 1:18).

క్రీస్తు సంఘము ఒక డినామినేషన్ కాదు, అది అనేక డినామినేషన్ల కలయిక అంతకుముందే కాదు. అది క్రైస్తవ మతశాఖ కాదు. అది కేథలిక్ సంఘము కాదు, ప్రొటెస్టాంట్ సంఘము కూడా కాదు. అది ఒక తెగ కాదు. అది ఒక మనుష్యునితో ఆరంభించబడలేదు. దానికి ఒక మానవుడు అధికారిగా లేడు. మానవుల ఆధిపత్యమున అది నడుచుకొనదు. అది మనుష్యుల పేరులను అసలే ధరించదు. మనుష్యులు వ్రాసిన పుస్తకములను బట్టి అది నడువదు. అది రాజకీయముగాగాని, సాంఘికముగాగాని ఉన్న ఒక సంస్థకాదు; అయితే అదేమిటి? అని మీరడుగవచ్చును. అదే క్రీస్తు సంఘము. అదే బైబిలు సంఘము, అదే నిజసంఘము.

సంఘము అను పదము ‘ఎక్లీషియా’ అను గ్రీకు పదము నుండి వచ్చినది. ఎక్లీషియా అనగా పిలువబడినవారు అని అర్థము. గనుక సంఘములో ప్రత్యేకముగా పిలువబడినవారుందురు. క్రీస్తు సంఘములో,

క్రీస్తు సువార్త ద్వారా పిలువబడినవారుంటారు. "ఆయన మనలను అంధకార సంబంధమైన అధికారములో నుండి విడుదల చేసి తాను ప్రేమించిన తన కుమారుని యొక్క రాజ్య నివాసులనుగా చేసెను" అని అపోస్తలుడైన పౌలు వ్రాసెను (కొలస్స 1:13).

క్రీస్తు సంఘమును స్థాపించెను. నా సంఘమును నేను కట్టుదును. పాతాళలోక ద్వారములు దానియెదుట నిలువనేరవు అని యేసుక్రీస్తు చెప్పెను (మత్తయి 16:18). సంఘమును కట్టినవాడాయనే గనుక సంఘము ఆయనదే. ప్రభువు తన స్వరక్తమిచ్చి ఈ సంఘమును సంపాదించెను (అపో.కా 20:28). గనుక ఏం సంఘమైనను క్రీస్తు ద్వారా నిర్మించబడక పోయిన యెడల అది క్రీస్తు సంఘమెట్లు కాగలదు?

సంఘమునకు పునాది యేసుక్రీస్తే. "వేయబడినది తప్ప, మరియొక పునాది ఎవడును వేయనేరడు; ఈ పునాది యేసు క్రీస్తే" అని పౌలు వ్రాయుచున్నాడు (1 కొరింథి 3:11). ముఖ్యమైన మూలరాయి కూడా క్రీస్తే. "క్రీస్తు యేసే ముఖ్యమైన మూలరాయియై యుండగా అపోస్తలులును, ప్రవక్తలును వేసిన పునాది మీద మీరు కట్టబడియున్నారు" అని ఎఫెసులోని క్రీస్తు సంఘమునకు పౌలు వ్రాసెను (ఎఫెసి 2:20).

క్రీస్తు సంఘము యెరూషలేములో ఆరంభింపబడునని దేవుడు యెషయా ద్వారా ప్రవచించెను (యెషయా 2:3). అది యెరూషలేములోనే ఆరంభమాయెనని అపోస్తలుల కార్యములు 2వ అధ్యాయములో మనకు తేటగా కన్పడుచున్నది. నీవు సభ్యత్వము కలిగియున్న సంఘము ఎక్కడ ఆరంభమాయెను? అది యెరూషలేములో, పెంతెకోస్తు అను పండుగ దినమున కానియెడల అది క్రీస్తుసంఘము కాదు.



క్రీస్తు సంఘము మొదటి శతాబ్దములో 33వ సంవత్సరమున యెరూషలేములో స్థాపించడెను. క్రీస్తే దానిని స్థాపించెను గనుక ఆ సంఘము నీదిగాని, నాదిగాని, మరియే మానవునిదిగాని కాదు. అది ఇంగ్లాండు దేశములో ఆరంభించలేదు. గనుక అది Church of England కాదు. అది అమెరికాలో ఆరంభించలేదు. అందువలన అది ఒక అమెరికా సంఘము కాదు. అది ఇంచుమించు రెండువేల సంవత్సరముల క్రితమే ఆరంభమాయెను గనుక అది ఒక క్రొత్త సంఘము కాదు.

నిజమైన సంఘము దానిని స్థాపించినవాని నామమును ధరించును. సంఘమును స్థాపించినవాడు క్రీస్తు. దాని శిరస్సు క్రీస్తు. దాని రక్షకుడు క్రీస్తు. దాని పునాది క్రీస్తు. ముఖ్య మూలరాయి క్రీస్తు అని క్రొత్తనిబంధన మనకు విపులముగా బోధించుచున్నది. సంఘమునకును క్రీస్తుకును ఇట్టి సన్నిహిత సంబంధమున్నది గనుక సంఘము ఆయన నామమునే ధరించవలెను గదా? "క్రీస్తు సంఘములు మీకు వందనములు చెప్పుచున్నవి" అని పౌలు రోమా 16:16లో వ్రాసెను. క్రొత్త నిబంధనలోని సంఘము, దేవుని సంఘము (1 కొరింథి 1:2), సజీవముగల దేవుని సంఘము (1 తిమోతి 3:15). ప్రభువు సంఘము (అపో.కా. 20:28). క్రీస్తు సంఘము (రోమా 16:16) అని వివరించబడియున్నది.

క్రీస్తు సంఘమునకు శిరస్సై యున్నాడు. సంఘము ఆయనయొక్క ఆత్మీయ శరీరమైయున్నది (కొలస్స 1:18). భూసంబంధమైన వ్యక్తి ఎవడును దీనికి భూమిపై అధికారిగా లేడు. "పరలోకమందును భూమిమీదను నాకు సర్వాధికార మీయబడియున్నది" అని యేసు చెప్పెను

(మత్తయి 28:18). గనుక క్రీస్తు సంఘమునకు భూమిపై ఒక ముఖ్యకేంద్రము (Head quarter) లేదు.

క్రీస్తు సంఘము మానవులచే వ్రాయబడిన ఒక విశ్వాస ప్రమాణ పుస్తకమును (Creed book) అనుసరించి నడువదు. సంఘ విశ్వాసమునకును, ఆచరణకు అది క్రొత్త నిబంధన ననుసరించి నడుచును. బైబిలు ఏమి పల్కునో దానినే అది బోధించును, బైబిలు సంగతులను అది బైబిలు పేర్లతో పిలుచును. "దైవావేశము వలన కలిగిన ప్రతి లేఖనము ఉపదేశించుటకును, ఖండించుటకును, తప్పుదిద్దుటకును, నీతియందు శిక్ష చేయుటకును ప్రయోజనకరమై యున్నది" గనుక అది మానవ కల్పిత గ్రంధముల ననుసరింపదు (2 తిమోతి 3:17).

క్రీస్తు సంఘ సభ్యులు క్రైస్తవులు అని మాత్రమే పిలువబడుదురు. క్రొత్త నిబంధనలో మీరు క్రైస్తవులను గూర్చి చెప్పబడుట చూడగలరు. అంతియొకయలో క్రీస్తు శిష్యులు మొదట క్రైస్తవులనబడిరి అని అపో.కా 11:26లో మనము చూడగలము. అందువలన క్రీస్తు సంఘ సభ్యులు కేవలం క్రైస్తవులు అని మాత్రమే పిలువబడుదురు. వారు కేథలిక్ క్రైస్తవులు, ప్రొటెస్టాంట్ క్రైస్తవులు కాదు,వారి ఒక డినామినేషన్ క్రైస్తవులు అంతకుముందే కాదు గాని వారు కేవలం క్రైస్తవులు మాత్రమే. రకరకాలైన క్రైస్తవులను గూర్చి బైబిలు బోధించుట లేదు.

ప్రపంచమంతటా వేలకొలదియున్న వ్యక్తిగత సంఘములతో (అంటే డినామినేషన్లతో కాదు) క్రీస్తు సంఘము ఏర్పడియున్నది. ప్రతి స్థానిక క్రీస్తు సంఘము క్రీస్తునందు స్వతంత్రము కలిగియున్నది. అయితే ఈ స్థానిక సంఘములన్నియును ప్రేమ చేతను, ఏకాభిప్రాయము చేతను కలిసి బంధింపబడియున్నవి.



అపోస్తలుల కాలములో ఈ సంఘ సభ్యులగుటకు ఒకే ఒక మార్గము ఉండెను. యేసు క్రీస్తు సువార్తను వినినవారు దానిని విశ్వసించి, వారి పాపములను గూర్చి మారుమనస్సు నొంది, క్రీస్తును ఒప్పుకొని, వారి పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందిరి. అట్లు వారు రక్షింపబడినందున సంఘముతో ప్రభువుచే చేర్చబడిరి. నీవు కూడా యేసు నందు విశ్వసించి, మారు మనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందిన యెడల, ఈనాడే యేసుక్రీస్తు నిన్ను తన సంఘముతో చేర్చును.

# 18. ఆరాధనామూర్తి
## (THE OBJECT OF WORSHIP)

ప్రియమిత్రులారా! నేడు మీతో రేడియో ద్వారా మాటలాడుటకు నాకు లభించిన ఈ మంచి సమయమును గూర్చి చాలా సంతోషించుచున్నాను. మీరు దేవుని సత్యమును వినుటకును, గ్రహించుకొనుటకును నిశ్చయించుకొని నందున నాకు మిక్కిలి ఆనందము కలుగుచున్నది. కొన్ని దినముల వెనుక ఒకసారి మానవుడు భక్తిపూరితుడని నేను చెప్పియుంటిని. అవును, అది మన అందరియెడల నిజమేకావచ్చును. మనము మనకంటె గంభీరుడై, ఉన్నతుడైనవానిని పూజ చేయవలెననెడి కోరికగలవారము. మన మాయన ఆధీనతలో యుండి ఆయన మనలను దీవించవలెననియు, మన దినదిన జీవితాయాత్రలో ఆయన మనలను కాపాడి నడిపించవలెననియు మన కోరికయై యున్నది. ఆయన మహాశక్తిమంతుడు గనుక మన మాయనను ఆరాధించెదము. 'ఆరాధన' అను ఈ అంశమును నేడు మనము విపులముగ పఠించెదము. ఆరాధన అనగానేమి? ఎవరిని ఆరాధించవలెను? ఎట్లు ఆరాధించవలెనను అంశములను మనము నేడు గమనించుదము.

దేవునినిగాని లేక పరిశుద్ధుడైన పవిత్రమైన మూర్తినిగాని భక్తిపూర్వకముగా పూజించి గౌరవించుట 'ఆరాధన'యని యనవచ్చును. మానవుడు ఆత్మీయౌన్నత్యమును పొందుటకది ఒక క్రియయైయున్నది. మానవుడు భగవంతునితో లీనమగుటకు 'ఆరాధన' ఒక సాధనమైయున్నది. దేవుని గ్రంధమైన బైబిలు ఆరాధనకొక గొప్ప ప్రాముఖ్యత నొసగుచున్నది. ఆరాధనయను పదము బైబిలునందు ఇంచుమించు 191 మారులు



ఉపయోగించబడెను. అది పాత నిబంధనలో 113 మారులు, క్రొత్త నిబంధనలో 78 మారులు కన్పడును.

ఆది నుండియు మానవులు దేవుని నారాధించు స్వభావము కలవారని చరిత్ర మనకు తెలియజేయుచున్నది. మానవుని కంటె దేవుడు మిన్నయైన వాడనియు శక్తిమంతుడు అనియు వారు గ్రహించినందున వారాయన నారాధింప మొదలిడిరి. అయితే మానవుడు స్వాభావికముగా ఆరాధించుట ఎట్లో ఎరుగనివాడు. ఆదిలో దేవుడు మానవునితో ప్రత్యక్ష సంబంధమును కలిగియుండిన కాలములో దేవుడు మానవునికి ఆరాధించు విధానమును గరపియుండెననుట నమ్మతగినది. పరిశుద్ధుల సభలో ఆయన మిక్కిలి భీకరుడనియు పూజింప తగినవాడనియు బైబిలు దేవుని గూర్చి బోధించుచున్నది. "మన దేవుడైన యెహోవాను ఘనపరచుడి. ఆయన పాదపీఠము ఎదుట సాగిలపడుడి. ఆయన పరిశుద్ధుడు" అని దావీదు రాజు పరిశుద్ధాత్మ వలన పలికెను (కీర్తన 99:5).

దేవుడెవరు? ఆయన ఎక్కడ నుండి వచ్చెను? అను మొదలగు ప్రశ్నలను మనము తరుచు ఎదుర్కొనుచూ యుంటాము. ఇట్టివానికి జవాబు చెప్పుట కూడ అంత సులభమయిన పనికాదు. బ్రహ్మాండమైన ఈ విశ్వమంతయును ఎట్లు కలిగెనో అది మానవ ఊహాతీతమైనది. గంభీరమైన విశ్వమంతటికిని కారణమైన ఒక ఆదిశక్తి యుండి తీరవలెను. అయితే ఆ శక్తి ఎవరు? ఏదైన నిర్జీవమైన దానినుండి జీవముద్భవించుట అసాధ్యము గనుక ఆ శక్తి సజీవుడైనవాడై యుండవలెను. అందువలననే ప్రపంచములు దేవుని వాక్యము వలన నిర్మాణమైనవనియు అందునుబట్టి దృశ్యమైనది కనబడెడు పదార్థములచే నిర్మింపబడలేదనియు విశ్వాసము

చేత గ్రహించుకొనుచున్నాము. దేవుడు ఆదియును అంతమునై యున్నాడని బైబిలు బోధించుచున్నది. ఆయన ఎల్లప్పుడూ ఉండువాడు. అట్టి గంభీరమైనవానిని అంగీకరించు మానవులు ఆయనను భక్తిపూర్వకముగ గౌరవించుట మొదలిడిరి. ఆదిలో మానవుడు ఒకే దేవుని ఆరాధించెడివాడని చరిత్ర కూడ మనకు బోధించుచున్నది. ఆ తరువాత దినములు గడచినకొలది మానవులు సత్యమార్గము నుండి తొలగిపోయి వారి ఇచ్ఛానుసారముగ దేవుండ్లను సృజించి పూజించిరి.

నేడు మానవులు దేవుండ్లవలె పూజించు కొన్ని సంగతులను మనమిప్పుడు పరిశీలించుదాం. పురాతనమైనట్టియు నమ్మతగినట్టి యునగు బైబిలు గ్రంథము ననుసరించి మన పరిశీలన కొనసాగించుదాం.

ప్రపంచములో ప్రకృతి నారాధించువారున్నారు. హిందువుడొకడు ప్రాతఃకాలమునే లేచి తూర్పుదిక్కుననున్న గంభీర సూర్యగ్రహమునకు మ్రొక్కును. దాని వెనుకనున్న సృష్టికర్తను జ్ఞప్తికి తెచ్చుకొనకుండగ అతడు దాని నారాధించును. అయితే మానవుడు ప్రకృతిని ఆరాధించుట యుక్తమైన పనియేనా? ఈ ప్రకృతి యంతయు దేవునిచే సృజించబడెనని బైబిలు చెప్పుచున్నది. ప్రకృతి దేవుని సృష్టియై యున్నది. సూర్యుని, చంద్రుని, భూమిని, నక్షత్రములను మనము చూస్తూయుంటాము. అయితే వాటన్నిటికిని సృష్టికర్తయనే వాడెవడు లేకనే అవి అకస్మాత్తుగా వచ్చిపడెననుట బుద్ధిహీనత యగును. సర్వసృష్టికర్తయైన వాని నెరిగి ఆయనను పూజించుటకు బదులు, కొందరు సృష్టమునే పూజించుచున్నారు. దైవసృష్టి అంతటి మీదను భూమిపై మానవునికి దేవుడు అధికారము ననుగ్రహించెనని, బైబిలు నుడువుచున్నది. మానవుడెల్లప్పుడు దేవునికి



భయపడి, ఆయనను పూజించు నిమిత్తము సృష్టింపబడెను. అందువలన సృష్టికర్తకు బదులు సృష్టిని మనము పూజింపరాదు. “అట్టివారు దేవుని సత్యమును అసత్యమునకు మార్చి సృష్టికర్తకు ప్రతిగా సృష్టమును పూజించి సేవించిరి” యని బైబిలు చెప్పుచున్నది (రోమా 1:19-25).

మానవుడు దైవసృష్టిని పూజింపరాని యెడల అతడు మానవ సృష్టినే పూజింపవచ్చునా? మన స్వహస్తకృతము లైనదానిని దేనిని కూడ మనము దేవునివలె యంగీకరించుట మానవ జ్ఞానమునకు విభిన్నముగ నున్నది. దేవుడు మానవుని సృజించెను గాని మానవుడు దేవుని సృజింపలేదు. నేటి ప్రపంచములో అనేకులు బంగారు వెండి రాతి విగ్రహములను ఆరాధించుచున్నారు. అయితే ఈ విగ్రహములన్నియును మానవ హస్తకృతములని మరచిపోకుడి. ఇప్పుడు వాని విషయమై బైబిలు ఏమి చెప్పుచున్నదో విందము. “అన్యజనుల విగ్రహములు వెండి బంగారువి, అవి మనుష్యుల చేతిపనులు. వాటికి నోరుండియు పలుకవు. కన్నులుండియు చూడవు. చెవులుండియు వినవు. వాటి నోళ్ళలో ఊపిరి లేశమైనను లేదు. వాటిని చేయువారును, వాటియందు నమ్మికయుంచు వారందరును వాటితో సమానులగుదురు” (దా.కీర్త 135:15-18).

అపోస్తలుడైన పౌలు ఒకమారు ఏథెన్సు అను పట్టణమున కేగెను. ఆ పట్టణము విగ్రహములతో నిండియుండుట చూచినందున అతని ఆత్మపరితాపము పట్టలేకపోయెను. నిజ దేవునిని గూర్చిన సత్యమును అతడు వారికిట్లు బోధించెను; “ఏథెన్సు వారలారా, మీరు సమస్త విషయములలో అతి దేవతాభక్తిగలవారై యున్నట్టు నాకు కనబడుచున్నది. నేను సంచరించుచు మీ దేవతా ప్రతిమలను

చూచుచుండగా ఒక బలిపీఠము నాకు కనబడెను. దానిమీద – తెలియబడని దేవునికి అని వ్రాయబడి యున్నది. కాబట్టి మీరు తెలియక దేనియందు భక్తి కలిగియున్నారో దానినే నేను మీకు ప్రచురపరచుచున్నాను. జగత్తును అందలి సమస్తమును నిర్మించిన దేవుడు, తానే ఆకాశమునకును, భూమికిని ప్రభువై యున్నందున, హస్తకృతములైన ఆలయములలో నివసింపడు. ఆయన అందరికిని జీవమును, ఊపిరిని సమస్తమును దయచేయువాడు గనుక, తనకు ఏదైనను కొదువ యున్నట్టు మనుష్యుల చేతులతో సేవింపబడువాడు కాదు. మరియు యూవద్భూమి మీద కాపురముండుటకు ఆయన యొకని నుండి ప్రతి జాతి మనుష్యులను సృష్టించి, వారొక వేళ దేవునిని తడవులాడి కనుగొందురేమోయని, తన్ను వెదకు నిమిత్తము నిర్ణయకాలమును, వారి నివాస స్థలము యొక్క పొలిమేరలను ఏర్పరచెను. ఆయన మనలో ఎవనికిని దూరముగా నుండువాడు కాదు. మన మాయనయందు బ్రతుకుచున్నాము. చలించుచున్నాము, ఉనికిని కలిగియున్నాము. అటువలెనే మనమాయన సంతానమని మీ కవీశ్వరులలో కొందరు చెప్పుచున్నారు. కాబట్టి మనము దేవుని సంతానమైయుండి మనుష్యుల చమత్కార కల్పనలవలన మల్చబడిన బంగారమునైనను వెండినైనను రాతినైనను దైవత్వము పోలియున్నదని తలంపకూడదు (అపో.కా 17:22-29). గనుక మిత్రులారా, మానవ హస్తకృతములగు విగ్రహములు దేవుండ్లు కావనియు, వాటిని మనము పూజింపరాదనియు గ్రహించుడి.

మనము దైవసృష్టినిగాని, మానవ సృష్టినిగాని ఆరాధించరాని యెడల మన సాటిమానవుని పూజింపవచ్చునా? ఈ ప్రశ్నను కొంతసేపు జాగ్రత్తగా ఆలోచించుడి. నీ పొరుగువానిని దేవునివలె నెంచుచు, నీవు



అతనికి చేయు సేవను ఉదాహరణ కొఱకు ఊహించుము. నీ సాటి మానవుడే దేవుడయిన యెడల అతడు చేయు పనులలో నీవు చేయరానివేమిటి? జీవిత స్థాయిలో అతడు నీకంటె మిన్నయైనవాడా? కాదు. అతడు నీతో సాటియైన వాడేగదా? అయితే అట్టివానిని కూడ మనము దేవుడని పూజింపరాదు. ఒకసారి కొర్నేలియను భక్తిపరుడు అపోస్తలుడైన పేతురు నారాధింప మొదలిడిన సంగతి బైబిలునందొకటి వ్రాయబడి యున్నది. పేతురు దేవునిచే ఏర్పరచు కొనబడినవాడని అతడెరుగును. రక్షకుడైన యేసుక్రీస్తుని గూర్చి మరింత విపులముగ వినునట్లు కొర్నేలీ దేవుని దూత ఆజ్ఞానుసారముగ పేతురును తన యింటికి పిలిపించెను. అయితే పేతురు అతని యింటికి రాగానే కొర్నేలీ తనకున్న గౌరవమును మిన్నగా ప్రకటింపనెంచి అతని పాదములపై పడెను. అయితే పేతురు పరిశుద్ధాత్మ ద్వారా "లేచి నిలువుము. నేను కూడ నరుడనే" అని పలికెను. ఇంకొక మాటలో మానవుడు సాటి మానవుని ఆరాధించుటను దేవుడు ఖండించెనని మనము గ్రహించుకొనవలసి యున్నది (అపో.కా. 10:26).

పైన చెప్పుకొన మూడింటిని మనము ఆరాధింపరాని యెడల, దేవుని దూతలను ఆరాధింపవచ్చునా? అపోస్తలుడైన యోహాను ఒకమారు దేవుని దూతను పూజించుచు నమస్కరింప మొదలిడగా, అతడు తిరస్కరింపబడెను. ఆ విషయమై యోహాను ఇట్లు వ్రాయుచున్నాడు. "యోహాను నేను ఈ సంగతులను వినినవాడను. చూచినవాడను. నేను విని చూచినప్పుడు వాటిని నాకు చూపుచున్న దూత పాదములయెదుట నమస్కారము చేయుటకు సాగిలపడగా అతడు వద్దుసుమీ, నేను నీతోను, ప్రవక్తలైన నీ సహోదరులతోను ఈ గ్రంథమందున్న వాక్యములను

గైకొనవారితోను సహదాసుడను. దేవునికే నమస్కారము చేయుమని చెప్పెను" (ప్రక 22:8-9). అలాగని మనము సాతానుని సేవింపరాదండి! సాతానుడు దైవ వ్యతిరేకి. దేవుని కుమారుడైన యేసుక్రీస్తు తన అస్త్రముల నది ప్రయోగింప యత్నించెనొకసారి. అయితే సాతానా, పొమ్ము ప్రభువైన నీ దేవునికి మ్రొక్కి ఆయనను మాత్రము సేవింపవలెను అని వ్రాయబడి యున్నదని" చెప్పి క్రీస్తు దానిని ఖండించెను (మత్తయి 4:10).

ఇంతవరకు మానవులు ఆరాధించు ఆయా సంగతులను మనము పరిశీలించి యుంటిమి. ప్రభువైన దేవుని తప్ప మరి ఎవరిని మనము పూజించి, సేవింపరాదని నేర్చుకొంటిమి. దైవమానవ సృష్టములను కాని, సాటి మానవుని కాని, దేవదూతను కాని, చివరకు సాతానునికాని మనము ఆరాధింపరాదని గ్రహించితిమి. అయితే బైబిలు బయలుపరచు దేవుడు ఏమి పలుకుచున్నాడో ఇప్పుడు విందము. నిర్గమ కాండము 20వ అధ్యాయము 2వ వచనము నుండి 6వ వచనము వరకు చదువుదము. "నీ దేవుడైన యెహోవాను నేనే.... నేను తప్ప వేరొక దేవుడు నీకు ఉండకూడదు. పైన ఆకాశమందేగాని యుండు దేని రూపమునయినను, విగ్రహము నయినను నీవు చేసికొనకూడదు. ఏలయనగా నీ దేవుడైన యెహోవా నగు నేను రోషముగల దేవుడను. నన్ను ద్వేషించువారి విషయములో మూడు నాలుగు తరముల వరకు తండ్రుల దోషము కుమారుల మీదికి రప్పించుచు, నన్ను ప్రేమించి, నా ఆజ్ఞలను గైకొనువారిని వెయ్యి తరములవరకు కరుణించువాడనై యున్నాను''.

పరమందున్న అట్టి నిజదేవుని ఆత్మతోను సత్యముతోను ఆరాధించవలెనని ఆయన మనకు బోధించెను. నిజానికి బైబిలు



బయలుపరచు దేవుడు నిజమైనవాడే. "దేవతలనబడిన వారును ప్రభువులన బడినవారును అనేకులున్నారు. మనకు ఒక్కడే దేవుడున్నాడు... అయితే అందరియందు ఈ జ్ఞానము లేదని" పరిశుద్ధాత్ముడు పౌలు ద్వారా పలికెను (1 కొరింధి 8:5-7). సత్యదేవుడైన నిన్నును, నీవు పంపిన యేసుక్రీస్తును ఎరుగుటయే నిత్యజీవమని యేసుక్రీస్తు చెప్పెను (యోహా 17:3).

గనుక ప్రియ మిత్రుడా! నీ ఆరాధనమూర్తి యెట్టివాడు? ఆయన సజీవుడైన దేవుడా? కానియెడల నీవు తప్పక బైబిలు గ్రంధమును పఠించుము. నీవు దేవుని నారాధించుచున్న యెడల, ఆ దేవుడు బైబిలు చెప్పునట్టి సజీవుడైన దేవుడు కానియెడల, నీ ఆరాధన వ్యర్ధమని గ్రహించుము. ఇదియే నా ప్రేమపూర్వకమైన హెచ్చరిక!

# 19. దైవారాధన
## (WORSHIP OF GOD)

ఆది నుండియు మానవులు దేవుని నారాధించు స్వభావము కలవారని మనం ఇదివరకే తెలిసికొనియున్నాము. మనము దేవుని నెరిగి, ఆయనను మహిమపరచవలెనని ఆయనకు కృతజ్ఞతాస్తుతులు చెల్లింపవలెనని దేవుడు కోరుచున్నాడు. దేవుని యెడల మనకున్న భక్తి విశ్వాసములన్నియును మనము ఆయనకు చేయు ఆరాధనలో తేటతెల్లమగును. దేవుని మనము ఆరాధించునప్పుడు నిష్కపటముగను, యథార్థముగను ఆరాధించవలెను.

యేసుప్రభువు ఇట్లనుచున్నాడు: "అయితే యథార్థముగా ఆరాధించువారు, ఆత్మతోను, సత్యముతోను తండ్రిని ఆరాధించుకాలము వచ్చుచున్నది; అది ఇప్పుడును వచ్చేయున్నది; తన్ను ఆరాధించువారు అట్టివారే కావలెనని తండ్రి కోరుచున్నాడు; దేవుడు ఆత్మ గనుక ఆయనను ఆరాధించువారు ఆత్మతోను, సత్యముతోను ఆరాధింపవలెను" (యోహాను 4:24).

మానవులు దేవుని వెదకుటయేగాక, ఆయనకు ఇష్టులై యుండుటకు ఆయనను వెదుకవలయును. "విశ్వాసము లేకుండ దేవునికి ఇష్టుడై యుండుట అసాధ్యము; దేవునియొద్దకు వచ్చువాడు ఆయన యున్నాడనియు, తన్ను వెదకువారికి ఫలము దయచేయువాడనియు నమ్మవలెను" (హెబ్రీ 11:6). "అడుగుడి మీకియ్యబడును, వెదకుడి మీకు దొరుకును, తట్టుడి మీకు తీయబడును. అడుగు ప్రతివాడును పొందును, వెదకువానికి దొరకును, తట్టువానికి తీయబడును" అని యేసుక్రీస్తు చెప్పెను (మత్తయి 7:7-8).

దేవుని వెదకువారు దేవుని చిత్తము చొప్పుననే వెదుక వలెనుగదా? అట్లే మనము చేయు ఆరాధన దేవునికి ఇష్టపూర్వకముగా యుండవలెనని,



దేవుడు చెప్పినట్లే దానిని మనము చేయవలెను. లేనియెడల మన స్వంత అభిలాషల చొప్పున దేవుని సేవించి, ఆరాధించ ప్రయత్నించిన యెడల అట్టివి వ్యర్థమగును. భక్తుడైన యాకోబు ఇట్లు చెప్పుచున్నాడు. "ఎవడైనను నోటికి కళ్ళెము పెట్టుకొనక తన హృదయమును మోసపరచుకొనుచు భక్తిగలవాడడని అనుకొనినయెడల వాని భక్తి వ్యర్థమే" (యాకోబు 1:26). మరల యేసు ప్రభువు ఇట్లనుచున్నాడు, "ఈ ప్రజలు తమ పెదవులతో నన్ను ఘనపరుచుదురు గాని, వారి హృదయము నాకు దూరముగా ఉన్నది; మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములని బోధించుచు, వారు నన్ను వ్యర్థముగా ఆరాధించుచున్నారు" (మత్తయి 15:7-9). మనము చూచిన ఈ రెండు వచనముల బట్టి వ్యర్థమైన భక్తి, వ్యర్థమైన ఆరాధన చేయుట సాధ్యమేయని దేవుడు మనకు విశదీకరించుచున్నాడు. వ్యర్థము అనగా ప్రయోజనము లేనిది, పనికిరానిది అని అర్థము. గనుక దేవునికి మనము చేయు సేవ ప్రయోజనకరముగా నుండునట్లు మనము జాగ్రత్తపడవలయును. ఆయనకు ప్రీతికరమైన సేవను చేయు నిమిత్తము మనము దేవుని వాక్యమును చదివి తద్వారా దేవుని సేవింపవలయును. "దేవుని యెదుట యోగ్యునిగాను, సిగ్గుపడనక్కర లేని పనివానిగాను, సత్యవాక్యమును సరిగా ఉపదేశించువానిగాను నిన్ను నీవే దేవునికి కనపరచుకొనుటకు జాగ్రత్తపడుము" అని పరిశుద్ధాత్ముడు పౌలు ద్వారా ఈనాడు మనలను హెచ్చరించుచున్నాడు (2 తిమోతి 2:15).

దేవుని ఆరాధించువారు ఆత్మతోను, సత్యముతోను ఆరాధింపవలెను అని యేసుప్రభువు చెప్పెను. గనుక ఆయనను ఆరాధింపవలెను అని యేసుప్రభువు చెప్పెను. గనుక ఆయనను ఆరాధింపవలెనినిన సత్యమును ముందు మనం తెలిసికొనవలెను. సత్యమనగా నేమి? అని మీరడుగవచ్చును.

దేవుని వాక్యమే సత్యము. "సత్యమందు వారిని ప్రతిష్ఠచేయుము; నీవాక్యమే సత్యము" అని యేసు ప్రభువు దేవుని వాక్యమును గూర్చి పలికెను. మరల ఆయన, "నేను మార్గమును; సత్యమును, జీవమునై యున్నాను" అని చెప్పుచున్నాడు. గనుక మనము దేవుని ఆరాధించునపుడు దేవునియొక్కయు, దేవుని కుమారుడైన క్రీస్తు యొక్కయు వాక్యము ననుసరించి ఆరాధింపవలెను.

సత్యము ఎల్లప్పుడు పరిపూర్ణమైనది. పరిపూర్ణ సత్యము దోషము లేనిది. అందువలన అది ఎల్లప్పుడు ఏకీభావమునే వ్యక్తపరచుగాని, స్వయం విరుద్ధ సంగతులనది బోధింపదు. సత్య వాక్యమయిన బైబిలును మనము చదువునప్పుడు అందులో మనకు కన్పడు ఆరాధన క్రమము, ఆరాధన యంతము ఏకభావమునే వ్యక్తపరచునుగాని, వేర్వేరు వ్యక్తులకు వేర్వేరు సంగతులనది బోధించదు. దేవుని వాక్య ప్రకారము లేనిదల్లా అసత్యము అని మనము గ్రహించవలయును. మనము అసత్యమును ద్వేషించి సత్యమును ప్రేమింపవలెను. అపోస్తలుడైన పౌలు ఇట్లు వ్రాయుచున్నాడు: "దుర్నీతిని పుట్టించు సమస్త మోసముతోను, నశించుచున్న వారితో సాతాను కనబరచు బలమును అనుసరించి యుండును. ఇందుచేత సత్యమును నమ్మక దుర్నీతియందు అభిలాష కలవారు అందరును శిక్షావిధి పొందుటకై అబద్ధమును నమ్మునట్లు మోసము చేయుశక్తిని దేవుడు వారికి పంపుచున్నాడు" (2 థెస్స 2:10-12). దుర్నీతి నుండియు, పాపము నుండియు మనము విడుదల పొందవలెనినన మనము సత్యమును తెలిసికొని, దానిని పాటించవలయును. యేసు ఇట్లు చెప్పుచున్నాడు. "మీరు నా వాక్యమందు నిలిచివారైతే నిజముగా నాకు శిష్యులైయుండి సత్యమును గ్రహించెదరు; అప్పుడు సత్యము మిమ్మును స్వతంత్రులనుగా చేయును" (యోహా 8:31-32). మనము దేవునికి చేయు సేవ లేదా



ఆరాధన సత్యవాక్యము ననుసరించి యుండవలెను. నిష్కపట హృదయము మనకు ఉన్నంత మాత్రమును అది సరిపోదు. మనకు తోచిందల్లా దైవారాధనలోనికి మనము తీసికొనిరాకూడదు.

మనము చేయు సత్యారాధన యెట్లుండవలెను అని మనం అడగవచ్చును.

మొదటిగా మన ఆరాధనమూర్తి నిజదేవుడై యుండవలెను. మానవులనుగాని, మానవకల్పిత విగ్రహములనుగాని మనం ఆరాధించ కూడదు. "లోకమందు విగ్రహం వట్టిదనియు, ఒక్కడే దేవుడు తప్ప వేరొక దేవుడు లేడనియు ఎరుగుదుము. దేవతలనబడిన వారును, ప్రభువులనబడిన వారును అనేకులున్నారు. ఆకాశమందైనను, భూమి మీదనైనను దేవతలనబడినవి యున్నను, మనకు ఒక్కడే దేవుడున్నాడు. ఆయన తండ్రి; ఆయన నుండి సమస్తము కలిగెను; ఆయన నిమిత్తము మనమున్నాము. మరియు మనకు ప్రభువు ఒక్కడే; ఆయన యేసుక్రీస్తు; ఆయన ద్వారా సమస్తము కలిగెను; మనము ఆయన ద్వారా కలిగినవారము" (1 కొరింథి 8:4-6). దేవుడు ఆత్మయైయున్నాడు. ఆయన నిర్జీవమైన ఒక విగ్రహము కాదు. అందువలన ఆ ఆత్మయైన దేవుని మనం మన ఆత్మద్వారా ఆయన వాక్యమును కలిగి ఆరాధింపవలెను.

మనం ఆరాధించునపుడు మనకును దేవునికిని సరియైన మధ్యవర్తి యుండవలెను. ఈ మధ్యవర్తి భూసంబంధ యాజకుడు కాదు, గాని ఆయన మన ప్రధాన యాజకుడగు యేసు క్రీస్తే. "దేవుడొక్కడే, దేవునికిని నరులకును మధ్యవర్తి ఒక్కడే; ఆయన క్రీస్తు యేసను నరుడు" అని బైబిలు బోధించుచున్నది (1 తిమోతి 2:5). "ఆకాశమండలము గుండా

వెళ్ళిన దేవుని కుమారుడైన యేసు అను గొప్ప ప్రధాన యాజకుడు మనకు ఉన్నాడు. గనుక మనము ఒప్పుకొనిన దానిని గట్టిగా చేపట్టుదము. మన ప్రధాన యాజకుడు మన బలహీనతలయందు మనతో సహానుభవము లేనివాడు కాడుగాని, సమస్త విషయములలోను మనవలెనే శోధింపబడినను, ఆయన పాపము లేనివాడుగా ఉండెను గనుక మనము కనికరింపబడి, సమయోచితమైన సహాయము కొరకు కృపపొందునట్లు ధైర్యముతో కృపాసనము నొద్దకు చేరుదము" (హెబ్రీ 4:14-16).

మన ఆరాధన యధార్థముగ నుండుటకు దేవునితో మనము సరియైన సంబంధమును కలిగి యుండవలెను. ప్రభువు కన్నులు నీతిమంతుల మీదను, ఆయన చెవులు వారి ప్రార్థనల వైపునకు ఉన్నవిగాని, ప్రభువు ముఖము కీడుచేయువారికి విరోధముగా ఉన్నది" (1 పేతురు 3:12). "మరియు మన మాయన ఆజ్ఞలను గైకొనుచు ఆయన దృష్టికి ఇష్టమైనవి చేయుచున్నాము గనుక మనమేమి అడిగినను అది ఆయన వలన మనకు దొరకును" అని దేవుని వాక్యము చెప్పుచున్నది (1 యోహాను 3:22).

ఆరాధన చేయునప్పుడు మనము సరియైన మనస్తత్త్వము కలిగి ఆరాధించవలెను. అందువలన పౌలు ఇట్లనుచున్నాడు: "కాబట్టి ఆత్మతో ప్రార్థన చేతును, మనస్సుతోను ప్రార్థన చేతును; ఆత్మతో పాడుదును, మనస్సుతోను పాడుదును" (1 కొరింథి 14:15). "మరియు మాటచేతగాని, క్రియచేతగాని మీరేమి చేసినను, ప్రభువైన యేసుద్వారా తండ్రియైన దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచు, సమస్తమును ఆయన పేరట చేయుడి" (కొలస్స 3:17).



ఆరాధన చేయునప్పుడు, అందరి క్రియలు సరియైనవి, అనగా దేవుడు కోరునట్టివి అయి యుండవలెను. ఆరాధనలో దేవుని మనము కీర్తనలతోను, ఆత్మసంబంధమైన పద్యములతో స్తుతించవలెనని కోరుచున్నాడు. ఆయన కోరిక స్వరగానమునే మనము అర్పించవలెనుగాని యాంత్రిక వాయిద్యములను కాదు (కొలస్స 3:16). ప్రార్థన చేయమని ఆయన కోరుచున్నాడు. వాక్యమును బోధించుట, ప్రభు రాత్రి భోజనమును ప్రతి ఆదివారము జరిగించుట, కానుకల నిచ్చుట గూడ ప్రతి ఆదివారమున జరుగవలెనని ఆయన గ్రంథము ద్వారా మనలను హెచ్చరించుచున్నాడు. ఇటి క్రియలను సత్యముతోను, ఆత్మతోను చేసిన యెడల మనము దేవుని కర్పించు ఆరాధన యధార్థమైనదై ఆయనకు ప్రీతికరముగా నుండును (అపో.కా 2:42; 1 కొరింథి 16:1-2).

మనము చేయు ఆరాధన అంతయును ఆయన సంఘము ద్వారా చేయవలెను; "క్రీస్తు యేసు మూలముగా సంఘములో తరతరములు సదాకాలము మహిమ కలుగునుగాక" (ఎఫెసీ 3:21). నీవు ఆయనకు ప్రీతికరముగా ఆరాధించ వలెననిన రక్షణ పొందుట అత్యవసరము. రక్షింపబడిన వారినందరినీ ప్రభువు తన సంఘముతో చేర్చుకొనును. నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును. గనుక నీవు యేసునందు విశ్వాసముంచి, నీ పాపముల విషయమై మార్పునొంది క్రీస్తులోనికి బాప్తిస్మము పొందుటకు తడవు చేయవద్దు. ఆయన ఇచ్చు ఉచిత రక్షణను ఈనాడే తప్పక నీవు అంగీకరించుదువని నా విశ్వాసము (అపో.కా. 2:47, మార్కు 16:16; అపో.కా. 22:16).

# ౨౦. నాలుగు రకములైన ఆరాధన

## (FOUR KINDS OF WORSHIP)

దేవుని మనం ఆరాధించునప్పుడు ఆయన వాక్యము చొప్పుననే ఆరాధించవలెనని తెలిసికొంటిమి. ఆరాధన చేయునప్పుడు మన ఆరాధనమూర్తి నిజదేవుడై యుండవలెనని, మన మనస్తత్వము సరియైనదై యుండవలెననిన కూడా ఇదివరకు మనం తెలిసికొనియున్నాము. అట్లు కానియెడల మనము దేవునికి చేయు ఆరాధన యంతయును ప్రయోజన శూన్యమగును. దేవుని ఆరాధన చేయుటలో నిమగ్నులైన మానవులు ఈనాడు ప్రపంచమందు ఉన్నారు. అయితే వారందరి ఆరాధన దేవునికి ఇష్టపూర్వకమైనది కాదు అని దైవగ్రంథమువలన మనము గ్రహించుకొనవచ్చును. ఈనాడు మానవులు దేవునికి చేయు ఆరాధన కనీసము 4 రకములుగా నున్నది. క్రొత్త నిబంధన గ్రంథమును బట్టి మనం ఒక్కొక్క దానిని పరిశీలించుదము.

మొదటిది వ్యర్థారాధన : నేడు క్రైస్తవులమని చెప్పుకొనుచు దేవుని ఆరాధించువారిలో ఎక్కువ మంది చేయు ఆరాధన వ్యర్థమైనది. మత్తయి వ్రాసిన సువార్త 15వ అధ్యాయము, 7వ వచనము నుండి 9వ వచనము వరకు మనము చదివినయెడల, యేసు ఇట్లనుచున్నాడు : "ఈ ప్రజలు తన పెదవులతో నన్ను ఘనపరుచుదురుగాని వారి హృదయము నాకు దూరముగా ఉన్నది; మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములని బోధించుచువారు నన్ను వ్యర్థముగా ఆరాధించుచున్నారు".

ఒకనాడు యెరూషలేము నుండి శాస్త్రులును, పరిసయ్యులును యేసు నొద్దకు వచ్చి, నీ శిష్యులు చేతులు కడుగుకొనకుండ భోజనము



చేయుచున్నారే, వారెందు నిమిత్తము పెద్దల పారంపర్యాచారమును అతిక్రమించుచున్నారు? అని అడిగిరి. అందుకాయన మీరును మీ పారంపర్యాచార నిమిత్తమై దేవుని ఆజ్ఞను ఎందుకు అతిక్రమించుచున్నారు? మీరు మీ పారంపర్యాచారము నిమిత్తమై దేవుని వాక్యమును నిరర్థకము చేయుచున్నారు... మనుష్యులు కల్పించిన పద్ధతులు దేవుని ఉపదేశములేయని బోధించుచు మీరు నన్ను వ్యర్థముగా ఆరాధించుచున్నారు అని యేసు వారిని హెచ్చరించెను.

నేటి క్రైస్తవ లోకము నిజానికి ఆనాటి యూదులకు ఏమియు తీసిపోలేదు. యేసుక్రీస్తు కాలమునాటి యూదుల వలె నేడు క్రైస్తవ ఆరాధనలోనికి, ఆచరణలోనికి అనేకమైన పారంపార్యచారములు తీసికొనివచ్చుట జరిగినది. భోజనము చేయుటకు ముందు చేతులు కడుగుకొనుట మంచిదే. అయితే చేతులు కడుగు కొనుటయే ఒక ఆరాధన క్రియగా చేయుట దోషము అగును. మనుష్యులు కల్పించిన సిద్ధాంతములు, బోధలు, ఆచారములు నేడు క్రైస్తవ లోకమునందెన్నియో ఉన్నవి. వాటన్నిటిని బట్టి మనము చేయు ఆరాధన నిజానికి ప్రయోజన శూన్యమైనది, పనికిరానిది, వ్యర్థమైనది యని మనము గ్రహించవలెను. పెద్దల పారంపర్యాచారామును బట్టి మనము దేవుని వాక్యమును నిరర్థకము చేయుచున్నాము అని యేసు చెప్పుచున్నాడు (మత్త 15:7-9).

గనుక మిత్రులారా, మీ ఆరాధన క్రమమును, మీ ఆరాధన క్రియలను ఒకసారి దేవుని వాక్యముతో సరిపోల్చి చూడుడి. వాక్యప్రకారము లేకుండా, తరతరాల నుండి చేయుచున్న క్రియలు అందులో మీకు ఎన్నో కన్పడగలవు. అట్టివి లేనియెడల చాలాసంతోషమేగాని, అట్టివి ఉన్నయెడల

వాటిని తొలగించి, దేవుని వాక్యప్రకారము మీ ఆరాధన జరుగునట్లు చూడుడి. ఒకవేళ వాక్యము చెప్పుచున్న క్రియలను కొన్నిటిని మీరు జరిగించుటలేదేమో, వాటిని తప్పక మీరు చేయులాగున జాగ్రత్తపడండి.

రెండవదిగా, మనము తెలియని ఆరాధనను కనుగొన గలము. అపోస్తలుడైన పౌలు ఒకసారి ఏథెన్సు అను పట్టణమునకు వెళ్ళెను. ఆ పట్టణము విగ్రహములతో నిండియుండుట చూచినందున అతని ఆత్మపరితాపము పట్టలేకపోయెను. అపో.కా. 17:22, 23 వచనములలో మన మీ విధముగ చదువగలము : “పౌలు అరెయొపగు మధ్యను నిలిచి చెప్పినదేమనగా – ఏథెన్సు వారలారా, మీరు సమస్త విషయములలో అతి దేవతాభక్తి కలవారై యున్నట్లు నాకు కనబడుచున్నది. నేను సంచరించుచు మీ దేవతా ప్రతిమలను చూచుచుండగా ఒక బలిపీఠము నాకు కనబడెను. దానిమీద తెలియబడిన దేవునికి అని వ్రాయబడి యున్నది. కాబట్టి మీరు తెలియక దేనియందు భక్తిని కలిగియున్నారో దానినే నేను మీకు ప్రచురించుచున్నాను”.

ఏథెన్సు పట్టణస్తులు భక్తిని కలిగియున్నారు. గాని వారు నిజదేవుని నెరగనందున వారు ‘తెలియని ఆరాధనను’ జరుపుచున్నారు. అట్టివారి మూఢభక్తిని దేవుడు గౌరవించడు. మూఢనమ్మకము చొప్పున చేయు ఆరాధన దేవునికి ఇష్టము కాదు. “ధర్మశాస్త్రము వినబడకుండ చెవిని తొలగించువాని ప్రార్థన హేయము” అని సామెతలు 28:9లో వ్రాయబడి యున్నది. అందువలననే దేవుని యధార్ధముగా ఆరాధించువారు, “ఆత్మతోను సత్యముతోను ఆరాధింపవలెను” అని ఆయన కోరుచున్నాడు. ఏథెన్సు వారివలె మనము చేయు తెలియని ఆరాధనను ఇక మీదట



దేవుడు సహించడు. ఆయన ఇట్లు చెప్పుచున్నాడు : “ఆ అజ్ఞాన కాలములను దేవుడు చూచిచూడనట్టుగా నుండెను : ఇప్పుడైతే అంతటను, అందరును మారుమనస్సు పొందవలెనని మనుష్యులకు ఆజ్ఞాపించుచున్నాడు” (అపో.కా. 17:30).

మూడవది స్వేచ్ఛారాధన : ఇది కొలస్సయులకు వ్రాసిన పత్రిక 2:20–23 వరకు ఉన్న వచనములలో వివరింపబడియున్నది. “మీరు క్రీస్తుతో కూడ లోకముయొక్క మూల పాఠముల విషయమై మృతి పొందిన వారైతే, లోకములో బ్రతుకుచున్నట్టుగా మనుష్యుల ఆజ్ఞలను, పద్ధతులను అనుసరించి చేతపట్టుకొనవద్దు, రుచి చూడవద్దు, ముట్టవద్దు అను విధులకు మీరు లోబడనేల? అవన్నియు వాడుకొనుట చేత నశించిపోవును. అట్టి స్వేచ్ఛారాధన విషయములోను, వినయ విషయములోను, దేహ శిక్ష విషయములోను, జ్ఞానరూపకమైనవని యెంచబడున్నవేగాని, శరీరేచ్ఛా నిగ్రహ విషయములో ఏ మాత్రమును ఎన్నిక చేయతగినవి కావు”.

స్వేచ్ఛారాధన యనునది మానవేచ్ఛలను బట్టి ఆరంభమైన క్రియలను సూచించుచున్నది. ఆ పదము భక్తిని సూచింపవచ్చునేమోగాని, ఆ భక్తి లేఖనములను అనుసరించి లేనప్పుడు అది ఖచ్చితముగా దేవునికి అంగీకారయోగ్యము కానిదగును.

ఆఖరిగ మనము క్రొత్త నిబంధనలో సత్యారాధనను గూర్చి చూడగలము. యోహాను 4:24లో యేసుక్రీస్తు ఇట్లనుచున్నాడు : “దేవుడు ఆత్మగనుక ఆయనను ఆరాధించువారు ఆత్మతోను, సత్యముతోను ఆరాధింపవలెను”. ఆత్మతో ఆరాధింపవలె నన్నపుడు మనము ఆత్మజ్ఞానము

గలవారమై నిష్కపటముగ ఆరాధింపవలెను. సత్యముతో ఆరాధించుటకు మనము సత్యవాక్యమేమి చెప్పుచున్నదో దానినిబట్టి చేయవలెను. ఒకవేళ మనము వాక్యప్రకారమే ఆరాధనను జరిగించుచున్నను, దానిని కోపబుద్ధితోను, దేవదూషణతోను, గర్వముతోను జరిగించిన, అట్టి ఆరాధన దేవునిచే తిరస్కరింపబడును. ఒకవేళ మనము ఆత్మజ్ఞానము కలిగి, లేఖనముల ప్రకారము ఆరాధనను జరిగించకుండిన యెడల అట్టి ఆరాధన కూడా తిరస్కరించబడును. "సత్యమునందు వారిని ప్రతిష్ఠచేయుము. నీ వాక్యమే సత్యము అని యోహాను 17:17లో యేసు చెప్పెను. గనుక మనము దేవుని నారాధించునప్పుడు నిర్మలమైన బుద్ధిని, ఆత్మజ్ఞానమును కలిగినవారమై యుండవలెను; సరిగదా మన ఆరాధనను సత్యవాక్య ప్రకారము జరిగించవలెను. దానికి తక్కువగాగాని, ఎక్కువగాగాని చేయకూడదు.

క్రొత్త నిబంధనను చదువునప్పుడు ఆదిమ క్రైస్తవులు ఆరాధనలో కనీసము అయిదు సంగతులను జరిగించిట్లు మనము కొనుగొనగలము. ఈనాడు మనము చేయు ఆరాధన, ఆదిమ క్రైస్తవులు చేసిన ఆరాధనతో సరిపోవుచున్నదో లేదో కూడ మనం పరిశీలించుట మంచిది.

1. ఆదిమ క్రైస్తవులు దేవుని వాక్యమును ధ్యానించుటకు కూడుకొనిరి. అపొ.కా. 20:7లో పౌలు ఒక కూటములో ప్రసంగించుట మనము చూడగలము.
2. వారు ఆరాధనలో ప్రార్థన చేయుటకు కూడుకొనిరి. ఆదిమ క్రైస్తవులు అపోస్తలుల బోధయందు, సహవాసమందు, రొట్టె విరుచుటయందు, ప్రార్థన చేయుటయందు ఎడతెగక యుండిరి (అపొ.కా 2:42).



3. వారు దేవునికి స్తుతిగానములు చేయుటకు కూడుకొనిరి. ఆరాధనలో వారు కీర్తనలు, ఆత్మ సంబంధమైన పాటలు మాత్రమే పాడిరి. గాని వాయిద్యములను వినియోగించలేదు. దయచేసి మీరు కొలస్స 3:16, ఎఫెసీ 5:19ని చదువండి.
4. ఆదిమ క్రైస్తవులు ప్రతి ఆదివారమును ప్రభురాత్రి భోజనము నందు పాలుపొందుటకు కూడుకొనిరి (అపొ.కా. 20:7).
5. తరువాత వారు వర్ధిల్లిన కొలది దేవునికి కానుకల నిచ్చుటకు కూడుకొనిరి (1 కొరింధి 16:1-2). లేఖనములు బయలుపరచు సత్య ఆరాధన యిది. మీరు చేయు ఆరాధన ఇట్లు లేనియెడల ఎక్కడో కొంత దోషము ఉన్నదని మీరు ఇట్టే గమనించగలరు. వాక్యమును బట్టి దానిని సరిదిద్దుకొందురని నా నిరీక్షణ.

దేవుని మనము ఆయన సంఘము ద్వారా ఆరాధించవలెను. "నమ్మి బాప్తిస్మము పొందిన" ప్రతివానిని ప్రభువు తన సంఘమందు చేర్చును. మీరు ఈనాడే ఆయన సువార్తకు లోబడి, ఆయనను ఆయన సంఘము ద్వారా మహిమ పరచుటకు సిద్ధపడవలెనని నా కోరికయై యున్నది!! (మార్కు 16:16; ఎఫెసీ 3:21).

# 21. దేవునికి అంగీకారయోగ్యమైన ఆరాధన

## (ACCEPTABLE WORSHIP TO GOD)

మానవుడు సహజముగా దేవుని నారాధించు గుణము కలిగినవాడు. మానవులనేక దేవుండ్లను, దేవతలను చేసికొని పూజించుచున్నారు అంటే వారికి ఉన్న ఈ భక్తి తత్వము వెల్లడియగుచున్నది. గ్రీసు దేశస్థులు ఇంచుమించు 30 వేల దేవుండ్లను ఆరాధించేవారు. నేడు హిందు దేశము కూడా ఈ సంఖ్యలో ఏమంత వెనుకగా లేదు. నేనిదివరకొకసారి చెప్పిన రీతిగ మానవులు చేయు ఆరాధన అంతయును దేవునికి అంగీకారయోగ్యమైనది కాదు.

అనేకులు నిజదేవుని ఆరాధించకపోవుట వలన వారి ఆరాధన వ్యర్థమగుచున్నది. దేవుడు కాని దేవుని మనం ఆరాధిస్తే ఏమి లాభము?

అనేకులు సరియైన దేవుని ఆరాధించినను, ఆ ఆరాధనను సక్రమముగా జరుపరు. వాక్యప్రకారము లేని క్రియలను ఆరాధనలో చేయుటచే, వారి ఆరాధన నిష్ఫలమగుచున్నది.

మరికొందరు నిజదేవుని వాక్యప్రకారము ఆరాధించినను సరియైన మనస్తత్వము లేకుండా ఆరాధించెదరు. అందువలన వారి ఆరాధన కూడ వ్యర్థమగును.

అందువలన దేవునికి ప్రీతికరమైన ఆరాధన యెట్లు చేయవలెనో మనం ఎరుగవలెను. ఆయనకు అంగీకారయోగ్యమైన ఆరాధన మనం చేయుటకు తెలిసికొనవలెనంటే ఆయన తన గ్రంథమందు ఆ అంశముపై ఏమి బయలుపరచెనో తెలిసికొనవలెను.

ఆయనను ఆరాధించు విషయములో దేవుడు మానవులకు పదేపదే



షరతులను (instruction) ఇచ్చెను. ప్రత్యక్ష గుడారమును నిర్మించుటలోను యాజక ధర్మవిషయములోను, బలిపీఠము విషయములోను, బలుల విషయములోను దేవుడు తన ఆజ్ఞలను మోషే ద్వారా పాతనిబంధన కాలమందు బయలుపరచెను (లేవీ 10:1-2).

ఇప్పుడు యేసు క్రీస్తు ద్వారా దేవుని మనం ఆరాధించుట యెట్లో క్రొత్త నిబంధనయందు ఆయన బయలుపరచి యున్నాడు. గనుక క్రైస్తవ యుగములో మనము దేవుని నారాధించుట యెట్లో తెలిసికొనవలెననిన, క్రొత్త నిబంధన గ్రంథము ఏమి చెప్పుచున్నదో ముందు మనం తెలిసికొనవలెను. అపోస్తలుల కాలములో, ఆదిమ క్రైస్తవులు ఆరాధనలో ఏమేమి చేసిరో గ్రహించి, వాటిని కూడా ఈనాడు మనం ఆరాధనలో చేసిన యెడల అది అంగీకార యోగ్యమైనది అగును.

మొదటి క్రైస్తవులు “అపోస్తలుల బోధయందును, సహవాస మందును, రొట్టె విరుచుట యందును, ప్రార్థన చేయుటయందును ఎడతెగక యుండిరి” అని అపొ.కా 2:42లో మనకు కన్పడుచున్నది. ఆరాధనకు కూడి వచ్చినప్పుడు “సంగీతములతోను, కీర్తనలతోను, ఆత్మ సంబంధమైన పద్యములతోను ఒకని నొకడు బోధించుచు, బుద్ధి చెప్పుచు, కృపా సహితముగా మీ హృదయములలో దేవునిగూర్చి గానము చేయుడి” అని అపోస్తలుడైన పౌలు కొలస్స 3:16లో హెచ్చరించుచున్నాడు. మరల, “నేను వచ్చినప్పుడు చందా పోగుచేయకుండ ప్రతి ఆదివారమున మీలో ప్రతివాడును తాను వర్థిల్లినకొలది తనయొద్ద కొంత సొమ్ము నిలువచేయవలెను” అని అతడు 1 కొరింధి 16:2లో చెప్పెను.

మనం ఇంతవకు చూచిన వాక్యములను బట్టి ఆదిమ క్రైస్తవులు

ఆరాధనలో కనీసం 5 క్రియలను చేసిరి యని గ్రహించాము. వారు పాటలు పాడిరి. వాక్యోపదేశమును జరిగించిరి. ప్రభు రాత్రి భోజనమును ఆచరించిరి. కానుకలనిచ్చిరి. ఆ అయిదు క్రియలను మనము కూడా మన ఆరాధనలో జరిగించినయెడల అది వాక్య ప్రకారము జరిగించిన యట్టి ఆరాధన అవునుగదా? అందువలన అది దేవునికి ప్రతీకరమైన ఆరాధన యగునుగదా? క్రొత్త నిబంధనలోని 5 ఆరాధన అంశములను మనం ఇప్పుడు కొంత పరిశీలించుదాం.

1. ఆదిమ క్రైస్తవులు ఆరాధనలో పాటలు పాడిరి. వారు దేవునికి స్తుతిగానములు చేసిరి. “ఒకని నొకడు కీర్తనలతోను, సంగీతములతోను, ఆత్మసంబంధమైన పాటలతోను హెచ్చరించుచు, మీ హృదయములలో ప్రభువును గూర్చి పాడుచు కీర్తించుడి” యని ఎఫెసీ 5:19లో పౌలు హెచ్చరించుచున్నాడు. క్రొత్త నిబంధన ఆరాధనలో దేవుడు మన స్వరగానము కోరినట్లు కన్పడుచున్నది. అందు క్రైస్తవులు ఆరాధనలో వాయిద్యములు ఎన్నడును వినియోగించలేదు. వాయిద్యములను క్రైస్తవ ఆరాధనలోనికి ఇంచుమించు క్రీ॥శ॥ 670వ సంవత్సములో కేథలిక్‌లు ప్రవేశపెట్టిరి. దేవుడయితే మన స్వరగానమునే కోరుచున్నాడు. మానవ కల్పిత సంగతులతో మనం దేవుని ఆరాధించిన అది వ్యర్ధమని మనం ఇదివరకే గమనించితిమి గదా? (మత్తయి 15:7-9).

2. మొదటి క్రైస్తవులు ప్రార్థన చేయుటకు కూడుకొనిరి. “మీరు ఎడతెగక నిత్యము ప్రార్థన చేయవలెను” అని పౌలు బోధించుచున్నాడు (1 థెస్స 5:17). మనము విసుగక నిత్యము ప్రార్థన చేయవలెను అని యేసు బోధించెను (లూకా 18:1). ప్రార్థన ద్వారా మనము దేవునితో



మాట్లాడుదము. గనుక ప్రార్థనలేని ఆరాధన, ఆరాధన కానేరదు అని గ్రహించవలెను.

3. క్రొత్త నిబంధన క్రైస్తవులు దేవుని వాక్యమును చదివి, ధ్యానించుటకు కూడుకొనిరి. మనము లేఖనములను పరిశోధింపవలెను అని క్రీస్తు బోధించెను (యోహాను 5:39). “దేవుని యెదుట యోగ్యునిగాను, సిగ్గుపడనక్కరలేని పనివానిగాను, సత్యవాక్యమును సరిగా ఉ పదేశించువానిగాను, నిన్ను నీవే దేవునికి కనపరచుకొనుటకు జాగ్రత్త పడుము” అని పౌలు తిమోతిని హెచ్చరించెను (2 తిమో 2:15). బైబిలును చదువుట ద్వారా దేవుడు మనతో మాటలాడును. ఆ గ్రంధమందు ఆయన చిత్తమును మనకొరకు బయలుపరచెను గనక ఆయన చిత్తము నెరుగుటకు మనం ఆయన గ్రంధమును పఠించి ధ్యానించవలెను. దేవుని గ్రంధమును చదువకుండ ఆరాధనను జరిగించుట మనం ఊహించుకొనలేము గదా.

   బైబిలునుగాక మనం మానవుడు వ్రాసిన ప్రమాణ పుస్తకములను పఠించిన అది వ్యర్థారాధన అగును అని మనం సులభముగా గమనించగలము కదా!

4. మొదటి క్రీస్తు సంఘస్తులు ప్రతి ఆదివారమున ఆరాధనలో రొట్టె విరుచుటకు కూడుకొనిరి. అపో.కా. 20వ అధ్యాయము 7వ వచనములో “ఆదివారమున మేము రొట్టె విరుచుటకు కూడినప్పుడు, పౌలు మరునాడు వెళ్ళనైయుండి, వారితో ప్రసంగించుచు అర్ధరాత్రి వరకు విస్తరించి మాటలాడు చుండెను” అని యున్నది. మత్తయి వ్రాసిన సువార్త 26:26-28 వరకు ఉన్న వచనములలో యేసుక్రీస్తు

ఈ భోజనమును స్థాపించెను. రొట్టెను ఆయన శరీరమునకు, ద్రాక్షారసమును ఆయన రక్తమునకు గురుతుగా యేసు ప్రభువు వాటిని మనకిచ్చెను. ప్రతి క్రైస్తవుడు ప్రభువు బల్లదగ్గర ప్రతి ఆదివారమున తప్పక కూడుకొనవలెను. ప్రభువు వచ్చువరకు ప్రభు రాత్రి భోజనము నాచరించుచు, ఆయన మరణమును పునరుత్థానమును ప్రతి క్రైస్తవుడు ప్రచురించవలయును (1 కొరింధి 11:23-26).

5. మొదటి క్రైస్తవులు చందాను ఇచ్చుటకు ప్రతి ఆదివారమున కూడుకొనిరి. వారు వర్థిల్లిన కొలది కానుకలు ఇచ్చుటకు ఆదిమ క్రైస్తవులు కూడుకొనిరి. "నేను వచ్చినప్పుడు చందాను పోగుచేయకుండ ప్రతి ఆదివారమున మీలో ప్రతివాడును తాను వర్థిల్లిన కొలది తనయొద్ద కొంత సొమ్ము నిలువచేయవలెను" అని పౌలు 1 కొరింధి 16:2లో చెప్పియున్నాడు. "కొంచెముగా విత్తువాడు కొంచెముగా పంట కోయును, సమృద్ధిగా విత్తువాడు సమృద్ధిగా పంటకోయును. సణుగుకొనకయు, బలవంతముగా కాకయు ప్రతివాడును తన హృదయములో నిశ్చయించుకొనిన ప్రకారము ఇయ్యవలెను; దేవుడు ఉత్సాహముగా ఇచ్చువానికి ప్రేమించును" అని పౌలు మరల చెప్పుచున్నాడు (2 కొరింధి 9:6-7).

దేవునికి అంగీకారయోగ్యమైన ఆరాధన ఇట్లుండవలెను. ఆరాధనలో వాయిద్యములు లేకుండ మనము పాటలు పాడవలెను. ప్రార్థన చేయవలెను, వాక్యమును వినవలెను. ప్రభు రాత్రి భోజనమును చేయవలెను, తరువాత కానుకలు ఈయవలెను. ఈ ఆరాధన



క్రియలన్నిటిని మనము సరియైన మనస్తత్వము కలిగి చేయవలెను. దేవుడు ఆత్మ గనుక ఆయనను ఆరాధించువారు ఆత్మతోను, సత్యముతోను ఆరాధించవలెనని ఆయన కోరుచున్నాడు. గనుక మనము ఆరాధన చేయునప్పుడు అర్థము చేసికొని ఆరాధించవలెను.

క్రొత్త నిబంధన సూచించు దైవారాధనకంటె ఎక్కువ చేసిన యెడల అది సత్యారాధనకాదు. క్రొత్త నిబంధన సూచించు దానికంటె తక్కువ చేసిన యెడల అది సత్యారాధన కాదు. సమస్తమును మనము వాక్య ప్రకారము చేసినప్పుడే అది అంగీకార యోగ్యమైన ఆరాధన యగును. "క్రీస్తు బోధయందు నిలచియుండక దానిని విడిచి ముందుకు సాగు ప్రతివాడు దేవుని అంగీకరింపనివాడు; ఆ బోధయందు నిలిచియుండు వాడు. తండ్రిని కుమారుని అంగీకరించువాడు'' అని వాక్యము బోధించుచున్నది (2 యోహాను:9).

మనము చేయు ఆరాధన అంతయు దేవుని మహిమ కొరకు చేయవలెను. సంఘములో దేవునికి మహిమ కలుగవలెను. గనుక మన ఆరాధన అంగీకారయోగ్యముగా నుండవలెనినిన మనము యేసుక్రీస్తు సంఘ సభ్యులమై యుండవలెను. క్రీస్తు సంఘస్తులమై యుండవలెననిన, యేసుక్రీస్తు నందు విశ్వాసముంచి, క్రీస్తులోనికి బాప్తిస్మము పొందవలెను. అట్లు ముంచడము పొందిన ప్రతివారిని ప్రభువు తన సంఘముతో చేర్చుకొనును. "క్రీస్తు యేసు మూలముగా సంఘములో తరతరములు సదా కాలము మహిమ కలుగునుగాక" (ఎఫెసీ 3:21). ఆయనను మహిమ పరచునిమిత్తము మీరు అతి త్వరలో ఆయనిచ్చు రక్షణను అంగీకరించుదురని నా విశ్వాసము!!

# 16. శాశ్వత శాంతి
## (GENUINE PEACE)

నాకు మిక్కిలి ప్రియమైన శ్రోతలారా! నేడు మీ యింట, మీతో దేవునిగూర్చియు, క్రీస్తును గూర్చియు మాటలాడుట నాకు ఎంతో సంతోషమును కలిగించుచున్నది. ప్రపంచమందు నేడు పెద్దపెద్ద గద్దెలపై నున్న వారి మొదలు, చిన్నచిన్న స్థానములలో నున్న వారివరకు, ప్రతీవారు 'ప్రపంచశాంతిని' గూర్చియే మాటలాడుచున్నారు. భూ నలుమూలలా ఆ అంశమును ప్రతివారును చెప్పుకొనుచునేయున్నారు. మిగతా దేశములన్నిటికంటెను కొంచెము పురోభివృద్ధిలో యున్న దేశములవారు 'శాంతిని' గూర్చి మిక్కిలి శ్రమపడుచున్నట్లు కన్పడుచున్నది. శాంతిని సమకూర్చుట కొరకు ఆయా దేశములవారు, వారి నాయకులు అనేక విధాల ప్రయత్నము చేయున్నారు. శాంతిసాధన కొరకు వారు, "ఆహార సహాయము, ఆర్థిక సహాయము, వైద్య సహాయము సాంకేతిక సహాయము మొదలగు కార్యక్రమములను ఆరంభించియున్నారు.

మనలో ప్రతివారును, చాలకాలము నుండి ఈ కార్యక్రమములను గూర్చి వినుచుయున్నాము. అయితే శాశ్వతశాంతి కొరకు ఈ కార్యక్రమములు ఎంతమట్టుకు సహాయపడినవి? ఈ కార్యక్రమములు ఆరంభించినది మొదలుకొని, నేటి వరకును అవి సాధించిన శాంతి ఏది? వీనివలన భూమి మీద శాంతి ఎక్కడ నెలకొల్పబడెనో మీరు ఒక్క ఉదాహరణను చెప్పగలరా? అట్టిది ఒక్కటి కూడా లేదు.

తెలుగు భాషలో 'శాంతి' అను పదము అతి మాధుర్యమైనది. ఇంచుమించు ప్రపంచమందున్న అన్ని భాషలలోను అది అందమైనది.



దాని యదార్థ భావమును మనము గ్రహించిన యెడల, దాని మాధుర్యమెంతయో ఎరుగ గలము. మానవజాతి అభివృద్ధి చెందవలెనన్న, శాంతి ఎంతయో అవసరమై యున్నది. శాంతి సమాధానములు లేని దేశములో ఒకడు నివసించుట చాల కష్టమైన సంగతి. శాంతి సమాధానములు లేని గృహాలలో ఒకడు కాపురముండుట సాధ్యముకాదు. అంతేకాదు, ఒకడు తనలో తాను భౌతికముగాను, నైతికముగాను, ఆత్మీయము గాను కూడ శాంతిని, సమాధానమును కలిగియుండని యెడల, అతడీ భూమిపై జీవించుట మరింత క్లిష్టమైన సమస్యయై యుండును.

భూమి మీద గతములో జరిగిన యుద్ధములను గూర్చి మనము ఎరిగియే యున్నాము. అయితే యుద్ధానంతరము కలిగిన శాంతి మాత్రము అనిశ్చయమైనది. అది శాశ్వత శాంతి కాదు. యుద్ధమందు పోరాడిన దేశముల మధ్య, లేక జనాంగముల మధ్య సంభవించినది ఒక బహు అల్పమైన నిర్యుద్ధ ఒడంబడికయే గాని, అది నిశ్చయమైన శాశ్వత శాంతికి జరిగిన సంధికాదు. అందువలననే యుద్ధమాడినవారి మధ్య ఒక ఒడంబడిక కుదిరినను, వారు ఒండొరుల పనులను అతి జాగరూకతతో, ఎల్లప్పుడు కనిపెట్టుచునే యుందురు.

గనుక మిత్రులారా! ఒకవేళ శాంతిని ఈ లోకము మన కనుగ్రహించిన యెడల, అది యిచ్చు శాంతి అశాశ్వతమైనదని గ్రహించుడి. అయితే శాశ్వత శాంతిని మనము వెదకుట ఎంతయో సమంజసమైనది. శాశ్వత శాంతిని వెదకి కనుగొనుట మనకెంతయో మేలు. ఈ సందర్భములో మనము బైబిలు అను పరిశుద్ధ గ్రంథమందు యోహాను వ్రాసిన సువార్త, పదునాలుగవ అధ్యాయములో ఇరువది ఏడవ వచనమును చదువుదము. మీరు కూడా మీ బైబిలును నాతో యిప్పుడు చదువగలిగితే మంచిది. ఇచ్చట

క్రీస్తు నుడివిన మాటలను భక్తుడైన యోహాను ఇట్లు లిఖించియున్నాడు : "శాంతిని మీ కనుగ్రహించి వెళ్లుచున్నాను; నా శాంతినే మీ కనుగ్రహించు చున్నాను. లోకమిచ్చునట్టుగా నేను మీ కనుగ్రహించుట లేదు; మీ హృదయములను కలవరపడనియ్యకుడి, వెరవనియ్యకుడి." యేసుక్రీస్తు మరలా ఇట్లు పలుకున్నాడు – "నా యందు మీకు సమాధానము కల్గునట్లు ఈ మాటలు మీతో చెప్పుచున్నాను. లోకములో మీకు శ్రమ కలుగును; అయినను ధైర్యము తెచ్చుకొనుడి, నేను లోకమును జయించియున్నాను" (యోహాను 16:33).

గనుక నేడు మనము క్రీస్తు అనుగ్రహించు శాశ్వత శాంతిని అన్వేషించుటలో ఆసక్తిని కలిగియున్నాము. అది లోక మిచ్చునట్టిదికాదు. అది ఆత్మీయమైనది అది భూసంబంధమైనది కాదు.

శాంతిననుగ్రహించుటకు యేసుక్రీస్తు ప్రధానధిపతియై యున్నాడు. నిజానికి మనకు శాశ్వత శాంతి క్రీస్తు ఒక్కడు మాత్రమే ఈయగలడు. ఆయన యిచ్చు శాంతి ఈ లోక సంబంధమైనది కాదు. మీరు బైబిలును చదువు చుండగా ఆయనను 'సమాధానకర్త' యని ప్రవచనములలో గుర్తించియే యుందురు. యెషయా ప్రవక్త, క్రీస్తు జననమునకు కొన్ని వందల సంవత్సరములు ముందే, ఇట్లు ప్రవచించెను. "ఏలయనగా మనకు శిశువు పుట్టెను. మనకు కుమారుడు అనుగ్రహింపబడెను. ఆయన భుజము మీద రాజ్యభారముండును. ఆశ్చర్యకరుడ, ఆలోచనకర్త, బలవంతుడైన దేవుడు, నిత్యుడగు తండ్రి, సమాధానకర్తయగు అధిపతి" యని అతనికి పేరు పెట్టబడును (యెషయా 9:6).

ప్రవక్తయైన యెషయా, ఎవరినిగూర్చి సమాధానకర్తయై యున్నాడని ప్రవచించెనో, ఆయనే యేసుక్రీస్తు. క్రీస్తు మనుష్య రూపమును దాల్చి, ఈ



లోకమందు జన్మించగా, దేవదూతలు "సర్వోన్నతమైన స్థలములలో దేవునికి మహిమయు, ఆయన కిష్టులైన మనుష్యులకు భూమిమీద సమాధానము కలుగుగాక" యని పాడిరి (లూకా 2:14). అందుచేతనే మనమందరమును ఆయనయందు సమాధానమును పొందగలమని క్రీస్తు చెప్పెను.

యెల్లవారికి తన శాంతిని యిచ్చుచున్నాడు గనుక, యేసుక్రీస్తు నిస్వార్థపరుడు. ఆయన శాంతి మనకు మంచి సంతోషమును, ఆయన సమాధానము మనకు ధైర్యమును కలుగజేయును. అందువలననే ఆయన యిచ్చు శాంతి, సమాధానములను గూర్చిన సువార్తను భూ నలుమూలల, సర్వలోకమందంతటా, సర్వసృష్టికి ప్రకటింపబడవలెనని ఆయన తన శిష్యులను ఆజ్ఞాపించెను. అందుచే యేసుక్రీస్తు సువార్తను మనము శాంతిసువార్త అని కూడ తరచు చెప్పుకొనుచూ యుంటాము.

యేసుక్రీస్తు రాజ్యము ఇహలోక సంబంధమైనది కాదు. ఈ లోకములో మనకు అనేక శ్రమలున్నవని ఆయన చెప్పెను. అయితే "ఆయన రాజ్యము భోజనమును, పానమును కాదుగాని, నీతియు, సమాధానమును, పరిశుద్ధాత్మయందలి ఆనందమునై యున్నది" (రోమా 14:17). ఆయన రాజ్యము నీతి, శాంతియై యుండగా, క్రీస్తు శాంతి సమాధానములకు చక్రవర్తియై యున్నాడు. ఆయన అనుచరులు శాంతి దూతలై యున్నందున వారు ఆశీర్వదింపబడి యున్నారు. "సమాధాన పరచువారు ధన్యులు, వారు దేవుని కుమారులనబడుదురని" క్రీస్తు నుడివెను (మత్తయి 5:9). దీనిని బట్టి ఏ మానవుడు ఈయలేనట్టి శాంతిని మనకిచ్చుటకు క్రీస్తు మాత్రమే సర్వాధికారి యన మనము గ్రహించితిమి.

అయితే యేసుక్రీస్తు మనకు ఎట్టి శాంతిని, సమాధానమును ఈయగలడో పరీక్షించుటకు, ముందుకు సాగుదము. అశాశ్వత శాంతి,

అనిశ్చయ శాంతి, సమాధి శాంతి, శాశ్వత శాంతియను రకరకాల శాంతిని గూర్చి మనము వినియే యున్నాము. గనుక యేసుక్రీస్తు ఇచ్చు శాంతిని మనము పరీక్షింతము.

క్రీస్తు ఇచ్చు శాంతి, ఈ లోకసంబంధమైనది కాదు. అది ఈలోకమిచ్చు యీవు లన్నిటికంటెను మిన్నయైనది. అది సర్వోత్తమమైనది. అది మానవుల యిష్టాయిష్టములతో ఇచ్చి పుచ్చుకొనునది కాదు. శాంతి సమాధానముల కొరకు మానవుడెల్లప్పుడు భూమిపై సాధనము చేయుచునే యుండవలెను. యేసుక్రీస్తు ఇచ్చు శాంతి సమాధానములు, ఆయన వద్ద నుండి వచ్చు జీవపు ఊటయై యున్నది. అవి మానవునికి ఎల్లవేళల ఆదరణ నొసగునవి. కృంగి కుమిలిపోవు హృదయములకు ఆదరణ నిచ్చుటలో అది క్రీస్తు ఈవియైయున్నది. 'నా శాంతిని నేను మీకిచ్చుచున్నాను, నా శాంతినే మీకనుగ్రహించుచున్నాను; మీ హృదయములను కలవరపడనియ్యకుడి, వెరవనియ్యకుడి' యని ఆయన నుడివెను.

లేఖకుడగు భక్తుడైన యోహాను, తన సువార్తలోని పదునాలుగవ అధ్యాయమును ఇట్టి ఓదార్పు మాటలతో ఆరంభించెను. యేసుక్రీస్తు శిష్యులు ఆయనతో ఇంచుమించు మూడున్నర సంవత్సరములుండిరి. ఆయన ఎచ్చటకు వెళ్ళినను, ఆచ్చటకు వారాయన వెంట వెళ్ళిరి. ఆయన ఆజ్ఞలనన్నిటిని వారనుసరించిరి. ఆయన చేసిన అద్భుతములు – ఆకలిగొన్నవారి కాహారమునిచ్చుట, రోగులను స్వస్థపరచుట చనిపోయిన వారిని బ్రతికించుట మొదలగువాని నన్నిటిని వారు గమనించిరి. అట్టి అత్యాశ్చర్యకరమైన అద్భుతములను చేయు వారి బోధకుడు, పరమందున్న తన తండ్రి యింటికి వెళ్ళుట అవుసరమైయున్నదని ఇప్పుడు వారికి చెప్పుచున్నాడు. ఆయన అట్టి మాటలను పలుకుట వలన, సహజముగా,



వారందరూ చింతాక్రాంతులైరి. ఆయన చనిపోవుచున్నానని వారికి వివరింపగా, ఆ విచారకరమైన వార్త వలన వారి హృదయములు భారభరితములైనవి. అయినను వారికి శాంతి కలుగునట్లు యేసుక్రీస్తు వారిని ఓదార్చి కలవరపడిన వారి హృదయములకు ధైర్యపు వాక్కులను పలికెను. "దేవుని యందు మీరు విశ్వాసముంచుచున్నారు. నా యందును విశ్వాసముంచుడి," అని చెప్పుచూ ఆయన వారి హృదయములను తేలికపరచెను. అంతేకాదు, 'నే నుండు చోటనే మీరునూ ఉండులాగున మీవద్దకు వచ్చి మిమ్మును తీసికొనిపోదు' నని ఆయన వారికి వాగ్దానము చేసెను, నిజానికి సమాధానపరచు యేసుక్రీస్తుని ఈ మాటలే, విచారవదనులైన శిష్యులకు ఆదరణను, నిరీక్షణను కలిగించెను.

ఆ శిష్యులు వారి యజయానియగు యేసుక్రీస్తు అప్పగింపబడి, యూదులచే సిలువ వేయబడుటను చూచిరి, ఆయన చనిపోయి, పునరుత్థానుడై తిరిగి లేచిన తరువాత పరలోకమున కెక్కిపోవుట వారు చూచిరి. అయినను ఆయన వారియొద్దకు మరలవత్తునని చెప్పినందున వారందరునూ సమాధానమును పొంది ప్రశాంతముగా యుండిరి. అట్టి ఈ శాంతి సమాధానములు, క్రీస్తు శిష్యులు మరింత నిశ్చలమైన నిరీక్షణను కలిగి పనిచేయుటకు సహాయపడినవి. యేసుక్రీస్తు సువార్తను బోధించు చున్నందున వారు బాధింపబడిరి; హింసింపబడిరి; కొరడాలతో కొట్టబడి, చెరసాలలో వేయబడిరి. అయినను, ఈ లోకమందనేక శ్రమలున్నవని వారెరిగి నందును, వాని నన్నిటినీ వారు ప్రశాంతముగా అనుభవించిరి.

ఇప్పుడు అపోస్తలుడైన పేతురును గూర్చిన ఒక సంఘటనను జ్ఞప్తికి తెచ్చుకొందము. అపోస్తలుడైన యాకోబును చంపించిన హేరోదు రాజువలన ఇతడొకమారు చెరసాలలో వేయబడెను. నాటికి అతి

సమీపమైయున్న పస్కా పండుగనాడు పేతురును కూడ చంపించుటకు హేరోదు రాజు నిశ్చయించుకొనెను. అయితే ఇనుప సంకెళ్ళతో బంధింపబడి, చెరసాలలో వేయబడిన ఈ పేతురు, అతడు అతి త్వరలో మరణశిక్ష ననుభవింపబోవుచున్నట్లు తెలిసియు కూడ, ఏ విధమైన కలవరపాటు లేక, ప్రశాంతముగా నిద్రించుచుండెను. ఎంత నిర్మలమైన శాంతి అది! అందువలననే 'లోకము ఇచ్చునట్లుగా, నేను నా శాంతిని మీ కనుగ్రహించుట లేదు' అని క్రీస్తు చెప్పెను.

పౌలు, సీలాలు అను మరి యిద్దరు క్రైస్తవ బోధకులు కూడా ఇంకొకమారు క్రీస్తును బోధించుచున్నందుకు చెరసాలలో బంధింపబడిరి. వారి కథనమును అపొస్తలుల కార్యములు, 16వ అధ్యాయములో ఇరువది రెండవ వచనము నుండి, ఇరువది అయిదవ వచనము వరకు చదువుదము. పౌలు, సీలాలు బోధించుచుండగా "అప్పుడు జనసమూహము వారి మీదికి దొమ్మిగా వచ్చెను. న్యాయాధిపతులును వారి వస్త్రములు లాగావేసి వారిని బెత్తములతో కొట్టవలెనని ఆజ్ఞాపించిరి. వారు చాలా దెబ్బలు కొట్టి వారిని చెరసాలలో వేసి భద్రముగా కనిపెట్టవలెనని చెరసాల నాయకుని కాజ్ఞాపించిరి. అతడు అట్టి ఆజ్ఞను పొంది, వారిని లోపలి చెరసాలలోనికి త్రోసి, వారి కాళ్ళకు బొండవేసి బిగించెను. అయితే మధ్యరాత్రివేళ పౌలును, సీలయు దేవుని ప్రార్థించుచు, కీర్తనలు పాడుచునుండిరి; ఖయిదీలు వినుచుండిరి". ఎంత ఆశ్చర్యము! అందు వలననే యేసుక్రీస్తు ఇచ్చుశాంతి, అన్ని వేళలలోను ఒకడు నిశ్చలముగ నుండుటకు తగు శక్తిసామర్థ్యముల నిచ్చును. వెలుపల తుఫానులు చెలరేగుచుండగా, లోపల ప్రశాంతముగ నుండుట కది సహాయపడును. అట్టి శాంతిని పొందుటకు మనము యేసుక్రీస్తేవలె ఈ లోకమును జయించవలెను. క్రీస్తు ఈ లోకములో జీవించి



దానిని జయించెను. ఈ లోకము ఆయన కెన్నియో శోధనలను కలిగించెను. సాతానుడు ఆయనకు కృత్రిమ అధికారమును, మహిమను చూపించెను. ప్రజలాయనను 'రాజును' చేయనెంచిరి. ఆయన శోధనలన్నిటిని జయించి, సమాధి నుండి విజేయుడై లేచి తన శత్రువులను సిగ్గుపరచెను. అట్టి యేసుక్రీస్తు నేటి మన జీవితములకు ఒక మాదిరియై యున్నాడు. ఆయన మాదిరిని మన మనుసరించిన యెడల ఆయనవలె మనమును ఈ లోకమును జయించగలము. మీరు ఆయన వద్దకు వచ్చి, ఆయన యిచ్చు శాంతిని పొందవలెనని కోరుచూ మిమ్మును నేడు యిట్లు పిలుచుచున్నాడు; "ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్తమైన వారలారా, నా యొద్దకు రండి, నేను మీకు విశ్రాంతి కలుగజేతును. నేను సాత్వికుడను, దీన మనస్సు కలవాడను. గనుక మీమీద నా కాడి ఎత్తుకొని, నాయొద్ద నేర్చుకొనుడి; అప్పుడు మీ ప్రాణములకు విశ్రాంతి దొరకును. ఏలయనగా నా కాడి సుళువుగాను నా భారము తేలికగాను ఉన్నవి." (మత్తయి 11:28-30).

గనుక మిత్రుడా, ఆయన యిచ్చు ఆహ్వానము నంగీకరించ గోరుచున్నావా? అయితే ఆయన శాంతి సువార్తకు లోబడుము. ఆయన యందు విశ్వాసముంచి, అన్నిటిలోను ఆయనకు విధేయుడవు కమ్ము. అప్పుడు యేసుక్రీస్తుని శాశ్వత శాంతి నీ హృదయమంతయు ఆవరించుకొనును.

◆ ◆ ◆

These Sermons were originally
delivered on the Radio in 1976.

*Reprint June 2023*